# మైత్రేయ మహర్షి బోధలు

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2005 - గురుపూర్ణిమ ప్రతులు : 1,000
ద్వితీయ ముద్రణ : 2011 - గురుపూజలు ప్రతులు : 1,000

వెల : రూ॥ **60-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531
e-mail : dhanishta@rediffmail.com

ముద్రణ :
ఎక్సేలియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 9848075132.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"**, డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## *సంకలనకర్త :* మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలో గల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాక నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితములనందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతులైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడి పించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ ఫౌండేషన్**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | పరిచయము | 10 |
| 1 | గురుపరంపర | 21 |
| 2. | సాధన సోపానము | 23 |
| 3. | మిత్రత్వము | 25 |
| 4. | సృజనాత్మకత | 27 |
| 5. | ఆశయము | 29 |
| 6. | బృందజీవనము | 31 |
| 7. | కృషి | 33 |
| 8. | ముఖ్యలక్షణము | 35 |
| 9. | సౌకర్యము - సంస్కారము | 37 |
| 10 | ఆశ్రమమునకు దారి | 39 |
| 11. | ధర్మము - దైవము | 42 |
| 12. | సత్యము - భ్రమ | 44 |
| 13. | ఒక త్రిభుజము | 45 |
| 14. | కోటగోడ | 47 |
| 15. | ప్రాథమిక దీక్ష | 48 |
| 16. | సమాన ధర్మము | 50 |
| 17. | ఒక రహస్యము | 52 |
| 18. | మొండితనము | 54 |
| 19. | నిజమైన విశ్రాంతి | 55 |
| 20. | కోపము | 57 |
| 21. | అప్రమత్తత | 59 |
| 22. | క్రమము - క్రతువు | 60 |
| 23. | పని | 61 |
| 24. | ఓర్పు | 62 |
| 25. | ఉట్టి - స్వర్గము | 63 |

| | | |
|---|---|---|
| 26. | ధర్మ యుద్ధము | 64 |
| 27. | మృత్యుంజయ మార్గము | 65 |
| 28. | నిజమైన సాధువు | 66 |
| 29. | దాన యజ్ఞము | 68 |
| 30. | కృతజ్ఞత | 69 |
| 31. | సద్భావము | 70 |
| 32. | లోదారి | 72 |
| 33. | నిరాదరణ | 74 |
| 34. | మార్గశీర్షము | 76 |
| 35. | చపలమతి | 78 |
| 36. | ధీరత | 80 |
| 37. | వైకుంఠపాళి | 82 |
| 38. | సేవా సూక్ష్మము | 84 |
| 39. | వసంతము | 86 |
| 40. | నీరు | 87 |
| 41. | అహంకార వలయము | 89 |
| 42. | స్వయంకృతము | 91 |
| 43. | సలహా సూక్తము | 92 |
| 44. | పరహితము - మోక్షము | 93 |
| 45. | శుభము - శాంతి | 95 |
| 46. | సూక్తులు | 96 |
| 47. | వస్తు సంపద | 97 |
| 48. | మాయ | 99 |
| 49. | ప్రణాళిక - ప్రదేశము | 101 |
| 50. | సత్యము - అతీతము | 102 |
| 51. | ఉత్సాహము | 104 |
| 52. | సంఘములు - సిద్ధాంతములు | 105 |
| 53. | నిరసించుట - ప్రేమించుట | 107 |

| | | |
|---|---|---|
| 54. | కుష్ఠువ్యాధి - నివారణము | 109 |
| 55. | కృషికర్మ | 111 |
| 56. | సేవా సంస్థ - మూలసూత్రములు | 113 |
| 57. | మైత్రేయ సంఘము | 115 |
| 58. | అపౌరుషేయము | 117 |
| 59. | మేలుకొలుపు | 119 |
| 60. | గురుదక్షిణ | 120 |
| 61. | అద్భుతము | 121 |
| 62. | భయము - అభయము | 122 |
| 63. | శిష్య పరీక్ష | 123 |
| 64. | అసత్య భాషణము | 124 |
| 65. | ఆశించుట, శ్రమించుట | 125 |
| 66. | విఘ్నములు - వినియోగము | 126 |
| 67. | వేగము - అవరోధములు | 127 |
| 68. | వింత బోధ | 128 |
| 69. | శిల్‌శిలా | 130 |
| 70. | ఈనాటి విజ్ఞత | 131 |
| 71. | మైత్రేయ యుగము | 132 |
| 72. | సౌందర్య ఉపాసనము | 133 |
| 73. | వ్యర్థులు | 134 |
| 74. | ధన వ్యామోహము | 135 |
| 75. | ప్రత్యేక దృష్టి | 136 |
| 76. | భావములు - పంచభూతములు | 138 |
| 77. | సద్గురువు | 140 |
| 78. | రసాయనము | 142 |
| 79. | మహాత్ముల పని | 144 |
| 80. | నూతన యుగము | 146 |

| | | |
|---|---|---|
| 81. | ఊహాస్త్రము | 147 |
| 82. | చికాకు | 148 |
| 83. | కృతజ్ఞత | 151 |
| 84. | సాధన - సూత్రము | 153 |
| 85. | పూర్ణ యోగము | 155 |
| 86. | సమాధాన విద్య | 157 |
| 87. | అప్రమత్తత | 159 |
| 88. | రుచికర బోధనము | 161 |
| 89. | దైవకారుణ్యము | 163 |
| 90. | తగ్గింపు ధరలు | 165 |
| 91. | జీవుని అశ్రద్ధ | 167 |
| 92. | ఆత్మ హంతకులు | 168 |
| 93. | సర్వహుత యజ్ఞము | 170 |
| 94. | సున్నిత సంబంధము | 171 |
| 95. | జాలి - దయ | 174 |
| 96. | జాతులు - కులములు | 176 |
| 97. | ఒక పొడుపు కథ | 177 |
| 98. | అశ్వఘోషుడు | 178 |
| 99. | సమయస్ఫూర్తి | 180 |
| 100. | మైత్రేయ మార్గము | 182 |
| 101. | శిశు పోషణ | 183 |
| 102. | బృందము - జీవము | 185 |
| 103. | సూటి మార్గము | 187 |
| 104. | కలుపు మొక్కలు | 188 |
| 105. | సదాచారము | 190 |
| 106. | విచికిత్సలు | 192 |
| 107. | రహస్య భాషణము | 194 |
| 108. | దేవ-దానవులు | 196 |

# మైత్రేయ మహర్షి బోధలు

## పరిచయము

మైత్రేయ మహర్షి భూమిపై నిలచిన యోగేశ్వరుడు. అతడు సాక్షాత్తు శ్రీకృష్ణుడే. అతని యందు శ్రీకృష్ణుడు శాశ్వత నివాస మేర్పరచుకొనెను. భగవంతుడగు శ్రీకృష్ణుడందించిన దివ్యప్రణాళి కను భూమిపై నిర్వర్తింప చేయుచున్న జగద్గురువతడు. క్రైస్తవులచే క్రైస్తుగను, బౌద్ధులచే మైత్రేయ బుద్ధుడుగను, ఇస్లాము మతస్థులచే ఇమామ్ మెహదిగను ఆరాధింపబడుచున్న సిద్ధపురుషుడు.

మైత్రేయ మహర్షి దివ్య శరీరధారి. నిర్మలమైనమూర్తి. దర్శన మాత్రముచే ఎవ్వనికైనను సకల మోహముల నుండి విముక్తి కలి గించు మోహనమూర్తి. సంసారమందలి జీవులు తరించి జీవన్ము క్తులై జీవించుటకు పరమపద ముఖద్వారమున నిలచియున్న బోధిసత్త్వుడు. పరమపద ముఖద్వారమున నిలచియున్న బోధి సత్త్వుడు. పరమపదము నుండి దివ్యప్రజ్ఞలు భూమిపై అవత రించుటకు, భూమి జీవులు పరమపదము చేరుటకు మార్గముగ నిలచిన పుణ్యమూర్తి. సాటియోగులను పూర్ణానందస్థితి యందు నిలపి భూమిపై జీవులకు యోగమార్గమునుపదేశించుట కుద్య మింపజేసిన పూర్ణానంద స్వరూపుడతడు.

సిద్ధి, బుద్ధి, జ్ఞానము, ఆయనకు కరతలామలకములు. జ్ఞానము బోధింపజేసి, యోగమభ్యసింపచేసి, సిద్ధి బుద్ధులను ప్రసాదింపజేయు యోగేశ్వరుడతడు. భక్తి జ్ఞాన వైరాగ్యములను యోగముద్వారా పటిష్టము గావింపజేసి, నిష్కామ కర్మమార్గమున

వేలాది జీవులను నియమించిన కర్మనిష్ఠుడతడు. అతడు నిరంతరము పద్మాసనమున నాసీనుడై యమము, నియమము మొదలగు ఎనిమిది అంగములతో కూడిన యోగము నభ్యసించుచుండును. మనస్సు ఎప్పుడూ శ్రీకృష్ణుని పాదపద్మములయందు లీనమై యుండును. అతనికి ఇంద్రియార్థముల యందు కూడ శ్రీకృష్ణుడే గోచరించును. పుణ్య వ్రతాచారములలో నియుక్తమైన అతని శరీరము పలుచనిదై కాంతి కిరణములను ప్రసరింపచేయుచు నుండును.

అతడు ఆజానుబాహువు, తపస్వి, కరగిన బంగారము వంటి మేనిఛాయ కలవాడు. వెడద కన్నుల నడుమ విశాలమైన భ్రూ మధ్యముపై రెండు ఊర్ధ్వ రేఖలు కలిసి వెలుగుతో కూడిన తమ్మి మొగ్గవలె ప్రకాశించుచు గోచరించును. ఆ భ్రూమధ్యము నుండి ప్రసరించు వెలుగు, చీకట్లను తిరస్కరించు నేతి దీపమువలె వెలుగుచుండును.

మైత్రేయ మహర్షి భూమిపై అవిరామముగ కృషి చేయుచున్న సద్గురు పరంపరలన్నింటికిని అధిపతి. గురువులకు గురువు, దైవము. అతడు పురాణపురుషుడగు శ్రీకృష్ణునిచే కలియుగాంతము వరకు జగద్గురువుగ నియమింపబడిన సిద్ధపురుషుడు. ధర్మమతని స్వరూపమున నిలచి భూమిపై వ్యాప్తి చెందుచునుండును. సమస్త జీవులకు కరుణ, ప్రేమ, నిత్యము ఉభయ సంధ్యలయందు తన హస్తములనుండి ప్రసరింపచేయుచు నుండును. మైత్రేయుని స్మరణమే సర్వపాపహరణము. ఆ

పుణ్యాత్ముని చూచిన వారికి వయస్సు యొక్క చిహ్నములు గోచరింపవు. అతడు సంచరించిన ప్రదేశములు పుణ్యతీర్థములై వెలసియున్నవి. లోకమును పవిత్రము చేయుట కొరకు మాత్రమే అతడు విహరించుచుండును. తన్నాశ్రయించిన వారికతడు విధేయుడు.

అట్టి మైత్రేయ మహర్షి కాశీరాజైన దివోదాసుని కుమారుడు. కాశీరాజు చంద్రవంశపు రాజు. కాశీరాజుల మూలపురుషుడు ధన్వంతరి. అతడు ద్వాపర యుగమున చతుర్థ పాదమున కాశీ పట్టణమున పట్టాభిషక్తుడై ప్రజాహితముగ పరిపాలనము కావించెను. ఈ ధన్వంతరి మహావిష్ణువు అవతారమైన ధన్వంతరి కాడు. మహావిష్ణువగు ధన్వంతరి అమృత మధన కాలమున అమృత కలశముతో ఉద్భవించి, జీవులకా కలశమును హృదయముగా సృష్టి చేసి ఇచ్చెను. దానితో అనంతమైన కాలమును తమ ఆయుర్దాయముగ దర్శించి జీవులు దేహమునల్లుకొనుట నేర్చిరి. హృదయము కారణముగ, ప్రణవము ఉచ్ఛ్వాస నిశ్వాసాత్మకమై, దేహము నందు ప్రతిష్ఠ జరుగుట జరిగినది. అట్టి ధన్వంతరి ప్రజ్ఞను కాశీరాజగు ధన్వంతరి, తన సహాధ్యాయి అయిన భరద్వాజ మహర్షితో కూడి ఆయుర్వేద శాస్త్రముగ తీర్చి దిద్దినాడు. భరద్వాజ మహర్షి, ధన్వంతరి, వీరిరువురి వలన ఆయుర్వేద శాస్త్రము లోకమున ప్రసిద్ధి చెందినది.

తరువాతి తరములో ధన్వంతరి కుమారుడు కేతుమంతుడు ఆయుర్వేదమున సిద్ధుడై నాలుగు వందల సంవత్సరములు కాశీ

రాజ్యమును పరిపాలించెను. ఇతని కాలమున కాశీరాజ్యమున, కాశీనగరమందు విశ్వ విద్యాకేంద్ర మొకటి ఏర్పడినది. తన తండ్రియైన ధన్వంతరి ఆరువేల మంది సుశ్రుతులను తయారుచేసి దేశమున వెదజల్లగ, కేతుమంతుడు చరక సంహితము తయారు చేయించి సంచరించుచు వైద్యముచేయు వర్గము నేర్పరచెను. చరకులను నామమున వీరందరును ప్రసిద్ధి గాంచిరి. సుశ్రుతులు, చరకులు రాజ్యమున ప్రజలకు జీవన విధానము, ఆరోగ్యము సంతర్పణ గావించుచుండిరి.

కేతుమంతుని కుమారుడు భీమరథుడు. ఇతడి కాలముననే చ్యవనప్రాశము ఆవిర్భవించినది. భీమరథుని కుమారుడు దివో దాసుడు. ఇతడి కాలమున వసంత కుసుమాకరము ఆవిర్భవించి నది. దివోదాసుడు ద్వాపరయుగమింకను నాలుగు వందల సంవత్సరము లుందనగ, కాశీరాజ్యమును పరిపాలించెను. అతడు కురుచక్రవర్తియైన శంతనునికి సమకాలికుడు.

దివోదాసుని కుమారుడు మైత్రేయుడు. అతడు మైత్రేయుని వేదవేదాంగ పారంగతునిగ ఆయుర్వేదనిధిగ, లలిత కళల యందు కుశలునిగ నొనరించెను. తండ్రి వద్ద విద్యాభ్యాసము పూర్తియైన వెనుక హిమవత్ పర్వతారణ్య సీమలలో నున్న పరాశర మహర్షి శిష్యుడై, మైత్రేయుడు చిరకాలము సద్గురు శుశ్రూష గావించెను. గురుసాన్నిధ్యమున అష్టాంగయోగమున సిద్ధుడై దేహమునకును, తనకును గల బంధమును, శాశ్వతముగ త్రెంచుకొని దివ్య దేహ ములయందు సంచరించుట అభ్యసించెను. పరిప్రశ్న మార్గమున

పరాశరునిచే విష్ణు పురాణము వివరింపబడుటకు అతడు కారకు డయ్యెను. మైత్రేయ పరాశర సంవాదమే విష్ణుమహా పురాణము. దీనినే తరువాతి కాలమున పరాశరుని కుమారుడగు వేదవ్యాసుడు పదునెనిమిది పురాణములుగ విశదీకరించెను. ఆ తరువాతి కాలమున కలియుగమున విదుర మైత్రేయ సంవాదముగ భాగవత పురాణమేర్పడినది.

పరాశర మహర్షి త్రికాలజ్ఞాని. అతడు పురాణ పురుషుని అవతరణమును తన దివ్యచక్షువుతో దర్శించెను. రాబోవు పూర్ణావ తారమునకు భూమిపై తోడ్పాటు గావించిన యోగేశ్వరులలో పరాశరుడు అగ్రగణ్యుడు. దివి నుండి నారదుడు, భువి నుండి పరాశరుడు పురాణ పురుషుని అవతరణమునకు తగు ఉపాధిని భూమిపై పరోక్షమున గావించినారు. పరాశరుడు పురాణ పురుషుని కుపయుక్తముగ పనిచేయుటకై ఉత్తమజీవులను కొందరిని చేరదీసి వారిని వేదవేదాంగముల యందు, అష్టాంగ యోగము నందు పరిపూర్ణులను గావించినాడు.తన కుమారుడగు వేదవ్యాసునితో సహా ఈ సుశిక్షుతులగు శిష్యులనందరిని పురాణ పురుషుని సంకల్పమునకు సమర్పితము గావించినాడు. అట్టి వారిలో ముఖ్యుడు మైత్రేయుడు. ఇతర ముఖ్యులు, సూర్యవంశపు వాడగు మరువు, చంద్రవంశపువాడగు దేవాపి, (ఇతడు శంతనుని జ్యేష్ఠ భ్రాత) యదువంశపువాడగు అక్రూరుడు, సాందీపని, బృహస్పతి ఇత్యాదులు.

గురుస్పర్శ కారణముగ మైత్రేయుడు తండ్రి అనుమతితో రాజ్యపాలనా కర్తవ్యమును త్యజించి భరతభూమి భవిష్యత్తునకై

తన సర్వస్వమును ధారపోసెను. హిమాలయములందలి కలాప గుహలను తన నివాస స్థానముగ నేర్పరచుకొని దైవకార్యమును చిరకాలము సాధించుటకు స్థిర సంకల్పుడైనాడు. హిమవత్ పర్వత గర్భమున లీనమై పోయిన శంబళ గ్రామమును మరువు, దేవాపి మహర్షుల సహాయమున, పునరుత్థానము గావించెను. కలియు గాంతము శ్రీకృష్ణునికి వాహికయై దివ్యప్రణాళికా నిర్వాహణమున శాశ్వతముగ బాధ్యత పడెను.

మైత్రేయుని పరిప్రశ్నమున విష్ణుపురాణము పరాశరు డందించినట్లుగ తెలుపబడినది. విష్ణు మహాపురాణము సకల వేద సమన్వయము. అది ఉపదేశపూర్వకముగ మైత్రేయుడు పరాశరమహర్షి నుండి పొందినాడు. ఈ పురాణ మందలి ఉప విద్యలే రాజనీతి, దండనీతి, మోక్ష ధర్మము, జ్యోతిర్విద్య, ఖగోళ విద్య, యుగాంతర పరిగణనము మొదలగునవి. విష్ణుపురాణ అధ్య యనము మైత్రేయునికి యాభై సంవత్సరములు సాగినది. మొదటి పది సంవత్సరముల ఉపదేశము కలాప గుహల ముఖద్వారమున గల రావిచెట్టు క్రింద జరిగినది. తరువాత పది సంవత్సరములు బదరికాశ్రమమున జరిగినది. తరువాతి ముప్పది సంవత్సరములు ప్రయాగలో కృష్ణ ద్వీపమున జరిగినది. యాబది సంవత్సరములు ఒక పురాణమును, అభ్యసింపచేయుట పరాశరునికే తగినది. అభ్యసించుట మైత్రేయమహర్షికే చెందినది. ఈ గురు శిష్యులు వారికి వారే సాటి.

మైత్రేయ మహర్షికి దేహసంబంధముగ ముగ్గురు సోదరీ మణులు. వీరు మహాభారతమున ప్రసిద్ధి గాంచిన అంబ, అంబిక,

అంబాలిక, భీష్మపితామహుడు మైత్రేయునికి సమకాలికులు. ధృతరాష్ట్రుడు, పాండురాజు తనకి మేనల్లుళ్ళు. సర్వసంగ పరి త్యాగము మొనర్చినప్పటికి తన కర్తవ్యము మేరకు ఒకటి రెండు మార్లు ధృతరాష్ట్రుని ధర్మపరముగ హెచ్చరించినాడు. అతడు మమకారము వీడనిచో కులక్షయ మగునని, నిండు సభలో దర్శన మిచ్చికూడ హెచ్చరించినాడు.

శ్రీకృష్ణజనన సమయమున అప్రాకృత శరీర నిర్మాణమునకై పరాశరు డొనర్చిన మహాయజ్ఞమును మైత్రేయుడు ముఖ్యమగు పాత్రను పోషించెను.

నారదమహర్షి, హిమవత్ శైలపుత్రి ఆదేశమున పరాశరుడు సప్తాహయజ్ఞ మొకటి నిర్వర్తించినాడు. ఆ యజ్ఞమున ప్రధాన పాత్రధారుడు మైత్రేయుడు, వేదవ్యాసుడు, మరువు, దేవాపి, సనత్కుమారుడు, సనత్సుజాతుడు. ధూళిధూసరములైన పంచ భూతములను వేదఘోషలచే సంస్కరింపజేసి, పురాణపురుషుని దివ్య దేహమునకు ఉపాధులుగ నేర్పరిచిన మహాయజ్ఞమది. దేవకీదేవి గర్భమున ఇదివరకే నేర్పడి పెరుగుచున్న పురాణ పురుషుని దేహము నందలి అణువులు, ఈ వేదఘోషల సంస్కార మున పవిత్రమై నిలచినవి. పరాశరుని యజ్ఞము నుండి పుట్టిన వేదఘోషలు అంతవరకును యుగముల తరబడి ప్రసిద్ధి గాంచిన వేదఘోషలకన్నా భిన్నమై నిలచినవి. యజ్ఞము నుండి పుట్టిన వేదఘోషలు, సామలుగ ఆకాశ కక్ష్యలలో ప్రతిధ్వనించు నట్లేర్పడి నవి. అవియొక విధమగు వేణుగానమువలె వినిపించినవి. అట్టి

వేదఘోషలతో కూడిన పంచభూతాత్మకమైన శరీరము పురాణ పురుషుని కేర్పరచిన పుణ్యము, పరాశరునితోపాటు మైత్రేయాదులకు కూడ దక్కినది.

శ్రీకృష్ణుడు భారత యుద్ధానంతరము, రాబోవు కలియుగమున జీవులుద్ధరింపబడుటకై యొక ప్రణాళికను రూపొందించెను. ఆ ప్రణాళికననుసరించి వేదవ్యాసుడు దైవప్రేరితుడై భారత భాగవతాది గ్రంథముల నందించెను. అందు మహాభారతమున భగవద్గీతను కూడ నిక్షిప్తము గావించెను. అన్ని వేదములకు, ఉపనిషత్తులకు, శాస్త్రములకు, బ్రహ్మవిద్యకు, యోగశాస్త్రములకు సమన్వయాత్మకమగు పరిష్కారమే భగవద్గీత. అట్టి పరిపూర్ణమగు భగవత్ ఉపదేశమును వేదవ్యాసుడు దూరశ్రవణమున గ్రహించి, భారతమున నిక్షిప్తము చేసెను. వేదవ్యాసుడే లేనిచో కలియుగమున ముందుచూపు వాఙ్మయమే కరువయ్యెడిది. అట్టి భక్తి, జ్ఞాన, వైరాగ్య యోగ సంభరితములైన వేదవ్యాసుని రచనలను మైత్రేయాదుల ద్వారా ప్రపంచమున శ్రీకృష్ణుడు ప్రకాశము గావించెను. కృష్ణుని దివ్య ప్రణాళికలో ప్రముఖమగు పాత్ర పోషించినది మైత్రేయుడు. మైత్రేయుని యందు శ్రీకృష్ణునికి గల ఆప్యాయత, అనుగ్రహము అద్వితీయము. రాబోవు కాలమున మైత్రేయుడే జీవులకు సన్మార్గము చూపగల జగద్గురువని శ్రీకృష్ణుని భావన. శ్రీకృష్ణుడే త్రిలోకములకు గురువు, స్వామి అని మైత్రేయుని భావన. వారిరువురి సంభాషణములు అత్యంత రమణీయము. దైవము క్రీడను పరిపూర్ణముగ నంగీకరించుట, దానికై సంసిద్ధుడై యుండుట మైత్రేయుని ప్రత్యేకత. దైవము విషయ

మున మైత్రేయు డెప్పుడును అప్రమత్తుడే. కృష్ణుని నుండి మైత్రేయుడు, సాన్నిధ్యమును ప్రసాదించు మార్గము అతని అనుగ్రహముగ పొందినాడు.

శ్రీకృష్ణుడు కలిసంతారకమైన మార్గమునొకటి కల్పించెను. వేణునాదము మూలమున సాన్నిధ్యమననుగ్రహించుటకై సంకల్పము చేసెను. జీవుల హృదయములో మంద్రముగ సాన్నిధ్యము నిచ్చి మంద్ర చైతన్యరూపముననే జీవుల యందు విష్ణుత్వము నెరపుటకు సంకల్పించెను. హృదయములో వినిపించు వేణుగానమున కాకర్షితులై జీవులు మంద్రముగ చైతన్య మార్గ మును పట్టుదురు. మంద్రజాలమున కాకర్షింపబడిన వారు యిక కలి సంకల్పించు యింద్రజాలమునకు లోనుగారు. కలి యింద్ర జాలమునకు ప్రతిగ శ్రీకృష్ణుడు మంద్రజాలమును సృష్టించినాడు. నిర్విరామమైన మంద్రజాలమున ఒక్కొక్క జీవుని అనుగ్రహించుచు, వారిని చైతన్యమార్గమున ప్రవేశపెట్టుట కృష్ణుని సంకల్పము. ఇట్లు హృదయమునందు దివ్యస్పర్శనిచ్చి, జీవులను వెలుగు దారిన నడిపింపజేయుటలో జీవుడెన్ని జన్మలెత్తినను ఆపదలేదు. అతడు మరల జన్మించినపుడెల్ల హృదయమునందు నిక్షిప్తము గావింప బడిన మంద్ర చైతన్యము వికసించి వెలుగు దారులలోనే నడిపింప జేయును. ఈ మంద్రజాలము సాన్నిధ్యము కల్పించు మార్గము. దీనిని జీవులకు అనుగ్రహించుటకు శ్రీకృష్ణుడు ఒక సిద్ధపురుషుని సూక్ష్మ శరీరమును వినియోగించుటకు సంకల్పించెను. చిరంజీవి, సిద్ధుడు, కలి ప్రయత్నించినను తాకలేని స్థిరచిత్తుడగు సిద్ధపురుషుని ఆవశ్యకత, శ్రీకృష్ణుడు గుర్తించి మైత్రేయమహర్షి నెన్నుకొనుట

జరిగినది. అట్టి సిద్ధపురుషుడున్నచో తాను పాంచభౌతిక శరీరము ధరించవలసిన అవసరముండదు. సిద్ధ పురుషుని దేహము నుండియే తాను సమస్తమును నిర్వహించ వచ్చును. జీవులలోనికి వ్యాపనము చెందవచ్చును. విష్ణుత్త్వమనగా నిదియే. యిట్లు జీవులు విష్ణుత్వములోని కుద్ధరింపబడుచుండగ వారి విషయ మున కలి వివశుడగును. ఈ మార్గమునకు శ్రీకృష్ణుడు మైత్రేయ మహర్షిని ఎన్నుకొని, మరువు, దేవాపి మహర్షులను అతని అనుయాయులుగ ఒక త్రిభుజము నేర్పరచెను. ఈ త్రిభుజమే దివ్యప్రణాళికకు కలియుగమున పునాదిరాయి. దివ్య ప్రణాళిక యను మహాసౌధము ఈ ముగ్గురి మహర్షుల భుజస్కంధము లాధారముగ నిర్మింపబడుచున్నది.

పై విధముగ మైత్రేయుడు కలియుగమున జగద్గురువై వెలసెను.

నాటినుండి నేటివరకు తన అనుయాయులతో కూడి మైత్రేయ మహర్షి మంత్రజాలమార్గమున జీవుల నుద్ధరించుచునే యున్నాడు. కలి యుగాంతమువరకు అట్లు ఉద్ధరించుచునే యుండును. ఇది ఒక నిరుపమానమైన దీక్ష. మైత్రేయుడికి మైత్రేయుడే సాటి!

# 1

## గురుపరంపర

**మా**నవజాతి చరిత్రలో సత్యమును గూర్చి సిద్ధాంతములు వెలువడినవి. ఎన్ని సిద్ధాంతములు వ్యక్తమైనచో అన్ని వక్రసిద్ధాంత ములు కూడ ఏర్పడినవి. ఎన్నియో సత్యసూత్రములు కూడ నశించి నవి. కాని ఎప్పటి కప్పుడు సత్యము తనకు తానుగా హృదయ ద్వారము నుండి నిత్య నూతనముగా వ్యక్తమగుట భగవదనుగ్రహము. హృదయగహ్వరమునకు నడిపించుట గురుపరంపర యొక్క ముఖ్య ప్రయోజనము. భృక్తమును సంఘసేవ ద్వారా రహితమును కావించుట, క్రమబద్ధమైన సాధన ద్వారా జీవునికి పరిణతి కలిగించుట, సృష్టి యందలి అందమును, వైభవమును రుచి చూపించుట, తత్ మార్గమున తపో దీక్షతో హృదయమున ప్రవేశపెట్టుట వేలసంవత్స రముల నుండి మా గురుపరంపర నిర్వర్తించుచున్న మహాయజ్ఞము.

గురుపరంపర అనంతత్వమునకు నిచ్చెనవలె నిలచిన బృందము. అనంతత్వము వరకు జీవునకు ప్రేరణనిచ్చి తద్వారమున జీవునికి అనుభూతి కలుగు అర్హత కల్పించుట వారి కర్తవ్యమునం దొక భాగము. దారి వెదుకుకొనువారికి ధృవతారగా నిలచి వెలుగు మార్గమున ప్రవేశపెట్టి తాము నిష్క్రమింతురు. అనగా తెర వెనుక

నుందురు. తాము జీవునకు దైవమునకు మధ్య సంధానకర్తలుగా మాత్రమే పనిచేయుదురు కాని అడ్డుగోడలవలె నిలబడరు. అవసరమైనప్పుడెల్ల జీవునకు మార్గమున తగు సలహాల నిచ్చి సహాయ సహకారములనందింతురు.

మా గురుపరంపర ఏ మతమునకు చెందినదికాదు. కేవలము సత్యమునకు చెందినది. సృష్టి ధర్మములకు కట్టుబడి వుండునది. మాకై మేము ఎవరిని శాసింపము. కోరినవారికి మాత్రమే సత్యమునకు దారి చూపెదము. లోక శ్రేయస్సే మా లక్ష్యము. మృణమయమైన శరీరమునుండి దివ్యశరీరమును జీవుడు పొంది, దివ్యానుభూతి యందు శాశ్వతముగ నిలుచుట కొరకు దైవసంకల్పముగ మా కర్తవ్యమును నిర్వర్తించుచున్నాము. జీవనమున యీ జీవులను హంసలవలె తీర్చిదిద్ది పరమహంసతత్వమును దారిచూపుట మా నిరంతర కృషి.

మానవుని పరిణామము కొరకై నిర్వాణమును నిరాకరించిన త్యాగశీలురైన సిద్ధులు మా పరంపరయందలి సభ్యులు. మా మార్గమున ఎంత దివ్యానుభూతి కలదో అంత త్యాగము కలదు కర్మక్షాళనమునకు తగిన శ్రమము కలదు. ప్రపంచము నలుమూలల యందు సత్యమునన్వేషించుచున్న జీవులయందు శ్రద్ధ కలిగి యుండి వారి యందలి సత్యమును మేలుకొల్పుచుందుము.

ఉపనిషత్తులు, భగవద్గీత, యోగసూత్రములు మా ప్రమాణ గ్రంథములు.

## 2

# సాధన సోపానము

ఏ సన్నివేశము నందుగాని, సంఘటనమందుగాని, అకస్మాత్తుగా జరుగు సంఘటనలయందుగాని చెదరకుండుట అభ్యసింపుము. దీనివలన ఎంతయూ ప్రయోజనము కలుగును. నిశ్చలమైన మనస్సును ఏర్పరచుకొనుటకు అనేక రకములగు అభ్యాసములు గలవు. దైవము యొక్క స్మరణము భావరూపమున గాని, మంత్రరూపమునగాని నిరంతరము చేయుట ఒక ఉపాయము. తనయందు, తన పరిసరముల యందు సతతము సాన్నిధ్యము నిచ్చుచున్న అంతర్యామిని ఎరిగియుండుట మరియొక యుపాయము. అనగా అన్యచింతన లేక అనన్యచింతన యందు నిలబడుట, దీనినే భగవానుడు పర్యుపాసనము అని తెలిపినాడు. ఈ ఉపాసనము దేశము, కాలము, నామము, రూపము అను పరిమితులు దాటి జరుగుచుండవలెను. దైవమును ఒక నామము నందో, ఒక రూపము నందో, ఒక కాలమునందో లేక ఒక దేశము నందో స్మరించుట ప్రాథమికమగు అభ్యాసము. అభ్యాసము ముందుకు సాగిన సందర్భమున అన్ని రూపములయందు, అన్ని నామముల యందు, అన్ని దేశములయందు, అన్ని కాలముల యందు భగవంతుని సాన్నిధ్యమును పొందు ప్రయత్నము జరుగును.

అంతర్యామిని అంతటి దర్శించుట చేయు ప్రయత్నము సత్యమైన సాధన. ఈ సాధన ద్వారా అస్థిరస్థితి నుంచి మనస్సు స్థిరస్థితిని చేరుకొనగలదు. స్థిరమైన చిత్తము అకస్మాత్తు సన్నివేశములకు అదిరిపడదు.

"ఎప్పుడైనను, ఎవరికైనను, ఎక్కడైనను, ఏదైనను జరుగ వచ్చును." ఈ వాక్యమును గుర్తు ఎరిగియుండుట తెలివి. అంతర్యామి దర్శనము సాధన చేయుచు ఈ మహావాక్యముల యందలి సత్యమును అంగీకరించి జీవించి యుండుట వలన ఆశ్చర్యపడుట, అదిరిపడుట అనునవి లేక జీవించు స్థిరచిత్తము క్రమశః అలవడగలదు.

అట్లు అలవడినచో నీకు ముందు చూపు కలుగగలదు. ఉన్నత స్థితియందు యిదియే కాలజ్ఞానముగ సిద్ధించును. స్థిరచిత్తునకు అదృశ్యము దృశ్యమగును. అప్రమత్తత స్థిరచిత్తుని యొక్క మరియొక ముఖ్యలక్షణము.

ప్రస్తుత కాలమున ఎన్నియో అలజడులు కలుగుచున్నవి. ఇట్టి అలజడులయందు తలమునకలు కాక స్థిరముగ నిలబడుట లోక హితుని కర్తవ్యము. అప్రమత్తత, స్థిరచిత్తత తన సహజ గుణములై నటువంటి లోకహితునకు కాలమును, దేశమును బట్టి దివ్య ప్రణాళికకు సంబంధిత మగు సందేశములందుచుండును. అవసర మును బట్టి గురుపరంపర యొక్క సాన్నిధ్యము కూడ లభించు చుండును. ప్రపంచపు అలజడితో సంబంధములేక అతడొనర్చు కార్యములు సిద్ధించుచుండును. అట్టి లోకహితులకు అప్రమత్తులమై మేము (మా గురుపరంపర) మా సహాయ సహకారము లందించ గలము. కావున స్థిరచిత్తుడవై ప్రశాంత మనస్కుడవై, అప్రమత్తుడవై, కార్యోన్ముఖుడవై, అంతర్యామిసాధన యందు జీవితమును నిలుపుము.

# 3

## మిత్రత్వము

**మే**ము మన్నించు అత్యుత్తమైనటువంటి సద్గుణము మిత్రత్వము. మిత్రుడు కలవాడు సంపన్నుడు. తన తోటివారితో మిత్రత్వము సాధించుట సాధకుని స్థితిని తెలియజేయ కలదు. సంఘము మిత్ర సంఘమైనచో మా ఆశయము నెరవేరగలదు. ఎదుటపడినప్పుడు స్తుతించుట, ఇతర సమయములలో నిందించుట సాధకుని అపరిపక్వ స్థితిని ప్రస్ఫుటముగా తెలియజేయును. ఉత్తమసాధకులము అనుకొను చున్న వారెందరో ఇట్టి అవస్థితికి లోనగుచున్నారు. త్రికరణ శుద్ధి లేనిచోట దైవమెట్లుండగలడు? ముందొక మాట, వెనుక ఒక మాట సత్సాధనను అపహాస్యము చేయుటయే కదా! ఏ ఇద్దరిమధ్య పరిపూర్ణ మైత్రికలదో అచ్చట ప్రేమ ప్రవహించగలదు. ముగ్గురు వ్యక్తులు వారి మధ్య ఎట్టి అరమరికలు లేక వున్నచో అట్టి త్రిభుజము నాధారము చేసికొని, మేము మహోత్కార్యములను సాధింపగలము. కలియుగ ప్రభావమో ఏమో మానవుడు ఈ మాత్రపు సంస్కారమును కూడ కలిగి యుండుట లేదు.

మిత్రత్వము సాధకునికి తన జీవన ప్రయాణమున వేగమును కల్పింపగలదు. ఒకరికొకరు సహకరించుకొనుచు ముందుకు సాగినచో ప్రయాణమున అలసటయుండదు. హృదయమున కలిసి పనిచేయుటలో మహత్కార్యములు సిద్ధించగలవు. భూమి యందలి సారమును తీసుకొనుటకు విత్తనమునందు తేమయుండవలెను, అది కారణముగ విత్తనము మహావృక్షమై విలసిల్లగలదు. అటులనే ఒక సాధకుని లోకహితకార్యము వటవృక్షమై విలసిల్లుటకు మిత్రత్వము తేమవలె పనిచేయగలదు. ఇది కారణముగనే, మా నామము, మిత్రత్వమునకు మరియొక పేరు. మిత్రత్వము లేనివారు ఏమియును సాధింపలేదు.



## 4

# సృజనాత్మకత

**ఒ**క కుటుంబము, సంఘము, దేశము మరియు దేశముల కూటమి తమకై చేయు ప్రయత్నమునకు గల గమ్యము ఒకటే. జీవన పరిస్థితులను మెరుగుపరచుకొనుట మరియు ప్రశాంతతను అనుభవించుట, జీవితమును మెరుగుపరుచుకొనుటకు పరిమితులు లేవు. కుటుంబపరముగా కాని సంఘపరముగ కాని ప్రతి విషయమ నందు, ప్రతి రోజు మెరుగుపరుచుకొనుటకు ప్రయత్నము చేయుచుండ వలెను. సంకల్పములయందు పరిణామమునకు ఉన్నత భావములను శోధించుచుండవలెను. భాషా పరిణామమునకు ఉన్నత గ్రంథములను చదువుచుండవలెను. క్రియా రూపమున ఉన్న తత్వమునకు తోటి జీవులతో సహకరించుట నేర్చుకొనుచుండవలెను. ఈవిధముగ ప్రయత్నముచేయు సాధకుడు సృజనాత్మకశక్తిని పొందును.

సృజనాత్మకశక్తి కారణముగ క్రమశః నవజీవనము సాధ్యపడును. గానుగెద్దు జీవితమునుండి చైతన్యము ఊర్ధ్వగతి పొందుచు చక్రభ్రమణమున ఆరోహణము చేయగలుగును.

నవజీవనము సంఘమున ప్రారంభములో కొంత క్రొత్తగనున్నను కాలక్రమమున అది ఇతరజీవులకు కూడ దారి నేర్పరచును.

సృజనాత్మక జీవనము కష్టతరమని భయపడవలదు. వెనుకంజ వేయవలదు. కొత్తదారి మొదటిలో కొంత ఇబ్బందిగనున్నను వాడుకచే సౌమ్యమగును. దారి– సంఘ శ్రేయస్సు, అభివృద్ధి గమ్యములుగ గలది కావున ఈ దారిన నడుచువారు పరిణితిచెందుట తథ్యము. నశించుట జరుగదు. నవజీవనమునకు సృజనాత్మకశక్తి ఎంత అవసరమో, శాస్త్రీయముగ సృజించిన భావములను వివేకముతో, పట్టుదలతో, ధైర్యముతో, మౌనముతో, ఓర్పుతో నిర్వర్తించుట కూడ అంతే ముఖ్యము. ఈ గుణములతో కూడని సంకల్పములు అవతరణ చెందవు. ఇట్లు సృజనాత్మకశక్తిని పై గుణములతో అవతరింప చేయుట వలన సాధకుడు అంతర్ముఖఆనందమును పొందుచు ముందుకు సాగిపోగలడు.



## 5

## ఆశయము

ఉత్తమమైన ఒక గమ్యమును ఏర్పరచుకొని, దానికై కృషి చేయుచు కృషిలోభాగముగ తనను, తనవనరులను సమర్పణ చేయుచు గమ్యమును చేరుట సాధనయందు ముఖ్యమైన అంశము. తమదైన సేవ జాతికి ఈవిధముగ సమర్పించుట వలన సాధకుడు తప్పక పరిణితి చెందును. ఏ మహాత్ముని జీవితమును గమనించినను ఈ అంశము ప్రస్ఫుటముగ గోచరించును.

బుద్ధుడు అహింసాభావమును ప్రతిష్ఠితము చేసెను. ఏసు ప్రేమభావమును ప్రతిష్ఠితము చేసెను. ఆదిశంకరులు జ్ఞానమును పునః ప్రతిష్ఠితము చేసిరి. రామానుజులు భక్తిభావమును ప్రతిష్ఠితము చేసిరి. కొందరు యోగమును, మరికొందరు జీవులసేవయు, మరి కొందరు దీనజనోద్ధరణము. ఇంకొందరు మనోవికాసము కలిగించుట. ఇట్లు రకరకములుగ ఉత్తమమైన ప్రణాళికలను నిర్వర్తింప చేసిరి. మహాత్ముల మార్గమున స్ఫూర్తినొందిన సత్సాధకుడు తనదైన సేవా కార్యక్రమమును ఒకటి సంకల్పించి నిర్వర్తించుచు ఉన్నత పరిణామ ములను జీవుల కేర్పరచుటకు కృషి చేయవలెను. కేవలము తన

ముక్తి కొరకు సాధన చేయువారు గమ్యమును చేరలేరు. తమకు ముక్తి అనునది స్వార్థమే కదా! స్వార్థము,ముక్తి ఒకే కాలమున ఎట్లు సిద్ధించగలవు? జీవుల సేవ కారణమున ఏర్పడు నిస్వార్థత, ముక్తికి హేతువగును.

తనదగు సేవాప్రణాళికను నిర్వర్తించు సందర్భమున తాను మొదట ఏకాకిగ నుండును. తాను నిర్వర్తించు కార్యమునందలి పవిత్రతనుబట్టి సజ్జనులు చేరుట, ఒక బృందముగ నేర్పడుట కూడ జరుగును. సమిష్టిగ, సహకార బుద్ధితో కార్యములను నిర్వర్తించుట వలన ప్రణాళిక సిద్ధించును. మార్గమున నిస్పృహ, సందేహము, భయము, స్వార్థము అను నలుగురు దుండగులు దారికాచి దోచుకొన గలరు. సాధకుడు అప్రమత్తుడై ఈ నలుగురు దుండగులు బారిని పడకుండ ఉత్సాహముతో ముందుకు సాగవలెను. ఇట్టి నిర్మాణాత్మక మైన సేవాప్రణాళిక కనీసము 12 సంవత్సరములు నిర్వర్తించుచూ అందు సహకరించు అనుయాయులకు సంపూర్ణముగ అందించి తాను కృతకృత్యుడు కాగలడు.

ఇది మమ్ములను మిక్కిలిగ ఆకర్షించు అంశము. మా సాన్నిధ్యము, సహకారము లభించుటకు మార్గము.



# 6

## బృందజీవనము

**బృం**దజీవనమునకు సహకారము, పరస్పర గౌరవము, ఏకాభిప్రాయము, సమిష్ఠి శ్రేయస్సు మూల స్తంభములు. ఈ నాలుగు అంశములూ ఎచ్చట ప్రకాశించుచుండునో అచ్చట బృందజీవనము (Group living) సహజీవనముగ సిద్ధించును. బృందమునకు ఒక నాయకుడున్నను, నిర్ణయములు సమిష్టిగా జరుగుట, సమిష్టి నిర్ణయ మును నాయకుడు నిర్వహించుట శ్రేయస్కరము. తన తోటివారిని తనతో సమానముగా మన్నించి, గౌరవించి, సంప్రదించి, సమిష్టి నిర్ణయమును మాత్రమే నిర్వర్తించువాడు నిజమైన నాయకుడు. అధికారమును చూపువాడు సంస్కారవంతుడగు నాయకుడు కాడు. ఈ భావమునే రోమన్ రాజ్యాంగ విధానము అనుసరించినది. మరియు గ్రీకు దేశపు ద్రష్టలగు సోక్రటీసు, ప్లాటో ప్రతిపాదించిరి. సమత్వము, సమభావము నాయకుని ముఖ్యలక్షణములు.

బృందమందలి సభ్యులయందు పరస్పరత్వము ఒక కట్టు బాటు. ఒకరినొకరు ఆదరించుట, సహాయపడుట, విమర్శించు

కొనకుండుట పరస్పర ప్రేమానురాగములకు దారి తీయును. ఇది లేనిచో బృందమొక మఠమగును. మఠములయందు యాంత్రిక దినచర్యయే కాని స్ఫూర్తి తరుగుచుండును. ఒకచోట ఉండినను, ఎవరికి వారుగా నుండుట, యాంత్రికముగ కలియుట, యాంత్రిక ముగ పూజలు చేయుట జరుగుచుండుట చేత కార్యక్రమములు యందు నిస్పృహ తాండవించుచుండును. స్ఫూర్తి అదృశ్యమగు చుండును.

బృందములుగ జీవించుటకు చెప్పబడిన సూత్రములు నాలుగు. అవి ఎచ్చట నిర్వర్తింపబడుచున్నవో అచ్చట బృందజీవనము యొక్క రసానుభూతి కలుగును. కావున బృందజీవనము ఆశ్రమ జీవనమే కానక్కరలేదు. ఒక పరిశ్రమయందు కూడా ఇట్టి వాతావరణమేర్పరచు కొనవచ్చును. కుటుంబము నందేర్పరచుకొనవచ్చును. అన్ని రకముల సంస్థలయందు కూడా బృందజీవనము రసానుభూతి కలిగించును. ఈ సూత్రములతో నిర్వహింపబడు ఆధ్యాత్మికసంస్థకాని, ధార్మిక సంస్థకాని, సాంఘికసంస్థ కాని, వ్యాపారసంస్థ కాని మానవునకు స్ఫూర్తి, ఆనందము కలిగించుట తథ్యము.



# 7

## కృషి

**త**నకుగ నిర్ణయించుకున్న గమ్యమును చేరుటకు అత్యంత ప్రాముఖ్యమైన సద్గుణము కృషి. కృషికి చెలికాడు శ్రద్ధ. శ్రద్ధతో ఒక పద్ధతిగా కృషి సలిపిన వారికి గమ్యము చేరువగును. ఇందు ఏ ఒక్కటి మరచినను, మార్గమున అవరోధము ఏర్పడును. దైనందిన జీవితమున ఓర్పుతో, కాలమును వ్యర్థము చేయక శ్రద్ధాభక్తులతో కృషిసలుపు వానికి దుర్లభములు కూడ సులభమగును. కృషి సలుపుటను చిన్నతనమునుండే అభ్యాసము చేయించుట అత్యుత్తమము. కృషిసలుపువానికి శ్రద్ధాభక్తులను గరపవలెను. కృషి యందు శ్రద్ధ, సోమరితనము, నిద్ర అనునవి అవరోధములు కాగలవు. దైనందినముగ ఆత్మపరిశీలనము కావించుకొనుచు ఈ అవరోధములను నిర్మూలించుకొనవలెను.

జీవనమార్గమున గమ్యమున పయనించు జీవునకు వాక్కు ఎంత ఉపయోగకరమో, అంత అనర్థము కూడ. ఒక విషయమును గుర్తుంచుకొనుడు. అసూయతో పలికిన ఒక వాక్యము మార్గమును

కష్టతరము చేయగలదు. దానికి ద్వేషము తోడైన మార్గము అదృశ్య మగును. మార్గమున పయనించుచున్నానను భ్రమ మాత్రమే మిగులును. ఉత్తమమైన సమర్థత కలిగిన వారు కూడ అసూయ ద్వేషముల ద్వారా పతనము చెందుట మనకు ఇతిహాసములుగ కన్పట్టుచునేయున్నది. మార్గానుయాయులు ఈ భావములను కూడ పరిశీలించుకొని నిర్మూలించుకొనుచుండవలెను.

జీవులపై ద్వేషము శాపముగ పరిణమించగలదు. మహత్తర కార్యములను చేయసంకల్పించువారు అసూయ, ద్వేషములను పెట్టుబడులుగ కార్యమును నిర్వర్తించినచో ఫలము వైఫల్యమే. మా బృందనివాసములయందు అచ్చటచ్చట హెచ్చరికగ ఈ క్రింది వాక్యము ప్రదర్శింపబడుచున్నది. "ద్వేషించుట సిగ్గు సిగ్గు. ద్వేషించు వాడు సిగ్గుపడవలెను." ద్వేషించువారిని కూడ ప్రేమించువారే మైత్రేయ సంఘసభ్యులు. ప్రేమించుట మేమొసగు నియమము. ఇది మొదలు కఠినముగనున్నను, ఇది కారణముగ మనస్సు నిర్మలమగును. నిర్మలమైన మనస్సు మాత్రమే పూర్ణచంద్రునివలె శుద్ధచైతన్యమును ప్రకాశము నొనర్చును.



## 8

# ముఖ్యలక్షణము

అపూర్వము, ప్రత్యేకము అయిన శక్తిసామర్థ్యములు కలిగి యుండి భావమునందు తమ గురించిన ప్రత్యేకతను ధరించకుండుట మైత్రేయసంఘ సభ్యుని ముఖ్యలక్షణము. ఎంత శక్తిసామర్థ్యములు కలిగినను, రూపలావణ్యములు కలిగినను, సంస్కారములు కలిగినను, తన గురించి తనకు విశిష్ట భావముండుట హానికరము. ఇది అహంభావమునకు దారితీయును. అందరిలో తానొకడను భావము, అందరియందొకడే వసియించి యుండుట చేత అందరియందు సమభావము కలిగియుండుట శ్రేయస్కరము. సహజీవనముకు ఇది మొదటి మెట్టు. మైత్రేయ సంఘమున అందరును తమదైన ప్రత్యేక సామర్థ్యములు కలిగినవారే. ఎవరి ప్రత్యేకత వారిది అయినను, సంఘ కార్యములయందు వారి వారి ప్రత్యేకతలను జోడించి కృషి సలుపు దురు కాని, ప్రత్యేక గుర్తింపులకొరకై ఆరాటపడరు. విశిష్టమైన రుచి కలిగిన వివిధ భోజనపదార్థములను భోజనాలయమున చేర్చినట్లు, తత్కారణముగ విందుభోజనము రసోపేతమగునట్లుగ సంఘసభ్యుల వివిధములైన శక్తిసామర్థ్యములను సమీకరించి మహత్తరకార్యములను చేయుదురు.

ఈ ప్రాథమిక సూత్రమును కుటుంబమునందు పాటించినచో కుటుంబజీవనము ఆనందకరముగ నుండును. ఎవరికి దేనియందు ఎక్కువ సామర్థ్యము కలదో వారికి ఆ విషయమున స్వతంత్రము నిచ్చి కార్యమును నిర్వర్తింపచేసుకొనుట తెలివి. భార్యా భర్తల యందు, తల్లితండ్రులయందు, బిడ్డలయందు కల వ్యక్తిగత సామర్థ్యము లను గుర్తించి, గౌరవించుట వలన మరియు నిర్వర్తించుట కనుమ తించుట వలన ఆయా సమర్థలు వారియందు పెంపొందుటయే గాక, సమిష్టిగ కుటుంబమునకు ఉపయోగపడగలవు. ఇదియే సూత్రమును ఒక సంస్థయందు పాటించినచో, సమిష్టిగా సంస్థ వృద్ధిచెందగలదు. సంఘ అభివృద్ధికి కూడ ఇదియే సూత్రము ఉపయోగకరమైనప్పటికి, ఒక కుటుంబమున, ఒక సంస్థ యందు గల కట్టుబాటు సంఘమున లేకుండుట అభివృద్ధికి అవరోధమై నిలచుచున్నది. కుటుంబము నందు, సంస్థయందు ఒకరిని పెద్దగ గౌరవించుట వలన కట్టుబాటుకు అవకాశమేర్పడుచున్నది. హృదయ పూర్వకముగా గౌరవింపబడగల నాయకులున్ననే సంఘమున కట్టుబాటు, అభివృద్ధి సాధ్యములగును.



9

## సౌకర్యము - సంస్కారము

**ఆ**ధునిక యుగమున మానవుడు సాధించిన విజయములలో ప్రయాణ వాహనములు శ్లాఘింపదగినవి. చోటులోనికి చొచ్చుకు పోయినట్లు వేగముగ ప్రయాణము చేయు ఈ యంత్రములు చోటుపై మానవుడు సాధించిన మొదటి విజయము. ఆకాశములో ఎగురుట రెండవ విజయము. తత్కారణముగ సూక్ష్మలోకములలో విహ రించుట, వేగముగా విహరించుట, తేలికగ విహరించుట అను కుంభరాశి తత్త్వమునకు శుభారంభము చేసెను.

కాని పై చెప్పిన విజయముల వెనుకనున్న ఉద్దేశ్యము మాత్రము స్వార్థచింతనయే. ఒకరిపై నొకరు అధిక్యతకు వీనిని వినియోగించుట ద్వారా ఈ సౌకర్యములు మానవ పతనమునకు, హానికి దారితీయును. సూక్ష్మమైన సౌకర్యములు కూడ స్వార్థ పూరిత ఉద్దేశ్యములతో ముడి వేయబడుటచేత మానవ చేతస్సు పరిణితిచెందకపోగా పతనమగు టకు అవకాశమేర్పడును. విజ్ఞానలోకములో మానవుడు పొందిన విజయములతో సమానముగ చేతన కూడ పెరుగవలెనన్న భావము ఆలోచనాపొరలలో కూడ కలుగుకుండుట దురదృష్టము. దుర్జనుడగు తనయునికి సకలైశ్వర్యములు, సకలసౌకర్యములు కల్పించినచో

ఏమగును? సౌకర్యములు పెరిగి సంస్కారము పెరుగకుండుట హానికరము. సంస్కారము పెరుగుచున్నను సౌకర్యములు లేనిచో జీవితమున అపాయమేమియు లేకున్నను, సంఘపరమైన అభివృద్ధి యుండదు. సంస్కారమును పెంచుట సంఘమున విద్యావేత్తల బాధ్యత. విద్యకు, అధ్యాపకులకు గుర్తింపు, రాణింపులేని సంఘమున సంస్కార ములు పెరుగవు. సంస్కరించునదే విద్య. సంస్కారములు పెరుగక కేవలము చదువు పెంచుకున్నచో దానవ సృష్టి జరుగును. గత వంద సంవత్సరములుగ ఈ విషయమున చాల అశ్రద్ధ జరిగినది.

ప్రస్తుతపు చదువులు, సౌకర్యములు మానవుని బాధ్యతా రహితుని చేయుటకే తోడ్పడుచున్నవి. అంతరాత్మ ప్రబోధమును అంతకంతకు అడుగంటించుచున్నది. బాధ్యతపడుట దైవ సామ్రాజ్య మున మొదటి మెట్టు. బాధ్యతారహితత్వము దానవ సామ్రాజ్యము నకు ముఖద్వారము. ఒకరికన్న ఒకరు వేగమును, ఒకరికన్న మరియొకరు దూరముగను, ఎత్తుగను, ప్రయాణములు చేయుటకు పోటీపడు మనస్తత్వము హాస్యాస్పదము. ఇవి కుస్తీపట్లవంటివి. ఒకరి యందు ఒకరికిగల బాధ్యతలను మరపింపగలవు.

విద్యావిధానమును చక్కగ సంస్కరించుకొన్నచో, పరస్పర సహకారమును పెంపొందించుకొన్నచో, బాధ్యతయందు మానవ సంఘములు మేల్కాంచినచో ఈ అధునాతన సౌకర్యములు జాతి కంతయు మేలు చేయగలవు. నిరుపేద దేశములను, దురదృష్ట ప్రాంత ములను, అపాయమునకు గురికాబడిన జనసమూహములను తృటికాలములో రక్షించుటకు ఈ సౌకర్యములు చాల ఉపయోగ పడగలవు. సత్సంకల్పమే ప్రధాన కారణముగ ఆధునీకరణము జరుగుచుండ వలెను.

## 10

## ఆశ్రమమునకు దారి

గురువు ననుసరించుట, గురువిచ్చిన సూచనలు పాటించుట వలన కలుగు శ్రేయస్సు, సాధారణముగ సాధకులు గమనించుచునే యుందురు. అదియే పరమార్థముకాదని గుర్తింపవలెను. అది కేవలము మొదటి మెట్టు మాత్రమే. తదుపరి తనదైన యజ్ఞార్థ జీవిత మొకటి గురుబోధనలు ఆధారముగా చేసుకొని నిర్మింపవలెను. బోధనలు పునాదివలె పనిచేయవలెను. గురుబోధ యందు సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస అను అంశములు సాధ్యములు. అవి పునాదిగ సంఘ శ్రేయస్సునుద్దేశించి ఒక యజ్ఞార్థ కర్మను నిర్వర్తించుట సాధకుని పురోభివృద్ధికి రెండవ మెట్టు. సంఘమున యజ్ఞార్థకర్మలను నిర్వర్తించుట పర్వతారోహణము వలె కొంత కష్టముగ నుండును. పునాదులను నమ్మి ధర్మమును విశ్వసించి స్థిరమైన బుద్ధితో ఓపికగ బహుకాలము ఆచరించుటవలన కార్యము ఫలించును. ఈ సమయమున మాటిమాటికి గురువును పిలుచుట, సహాయమర్థించుట వీలుపడదు. ప్రార్థన ద్వారా గురుబలము నందు కొని పనిచేయుట మాత్రమే నియమము. పైకి చూచుట, సహాయ

మర్థించుట కాక సమర్పణ బుద్ధితో సంకల్పించిన యజ్ఞార్థకర్మలు మాత్రమే యుండవలెను. ఈ సమయమున గురు సందేశ మిట్లుండును. *"నీ పై నీవు ఆధారపడుము. నా బోధనలను ఆధారముగ నీ కార్యములకు పునాదులు వేసుకొనుము. బుద్ధి యోగమున నిలబడి కార్యములు నిర్వర్తించుకొనుచుండవలెను. ప్రతి నిత్యము ఆత్మపరిశీలన చేసుకొనుచుండవలెను. నేను మార్గము చూపువాడనే కాని గమ్యమును కాను. ప్రతి చిన్న విషయమునకు నాకై ఎదురు చూడకుము. నీయందు నేనున్నాను కనుక నాయందు విశ్వసించి ముందుకు సాగుము"* అని పలుకును.

ఇట్లు స్వతంత్రముగ కార్యములను నిర్వర్తించమనుట, బాధ్యత నప్పగించుట. సాధకుడు తన బాధ్యతను తా నంగీకరించి, "నేను" అను ప్రజ్ఞను ఆశ్రయించి గురువు ఆశీర్వచనములను ప్రతిదినము కోరి కార్యోన్ముఖుడు కావలెను. ఈ రెండవదశ యందలి స్వతంత్రత బాధ్యతతో కూడిన స్వతంత్రతయే కాని, స్వతంత్రించి పూర్వ వాసనలయందు జొరపడుటకాదు. మార్గమున నియమింపబడిన వాడు ముక్కుకు తాడువేసిన ఎద్దువలె పయనింపవలెను. అడ్డగోలుగ జీవించుటకు వీలుపడదు. తన కర్తవ్యమే తన మార్గముగ నిలచును. కలహించక, విమర్శించక, మౌనముగ కర్తవ్యోన్ముఖుడై పయనించ వలెను. ఈ విధముగ పయనించు సాధకునకు గురువాశీర్వచనము వెన్నుదన్నుగ నిలచును. కార్యమునందలి సత్యము, ధర్మము, ప్రేమ మరియు నిర్వర్తించుటయందలి ప్రశాంతత కారణముగ అంతే వాసిత్వము లభించును. అనగా గురువు యొక్క అంతరంగ ఆశ్రమ

మున ఆశ్రయము లభించును. తానుగ సంకల్పించిన యజ్ఞార్థ కర్మ పరిపూర్ణత చెందుకొలది అంతరంగమున ఆశ్రమ ప్రవేశమునకు చేరువగుచుండును.

ఇదియే మా ఆశ్రమమునకు దారి. మరియొక మార్గము లేదు. వెఱ్ఱిభక్తులకు మా ఆశ్రమమున తావులేదు. వెఱ్ఱికుదిరి మఱ్ఱివలె విస్తారముగ లోకహిత కార్యముల నొనర్చుచు సత్యమును, ధర్మమును ఆశ్రయించిన వారికి చోటుకలదు. అట్టివారు మా హృదయ సామ్రాజ్యములోనికి ఆహ్వానించబడుదురు.

# 11

## ధర్మము - దైవము

ధర్మసూత్రములననుసరించుచు కార్యములనొనర్చుట ప్రస్తుత కాలమున కష్టతరమని భావించుట కొంచెపుబుద్ధి. ధర్మముయందు విశ్వాసము, ప్రీతి, గౌరవము కలిగియున్న వానిపై కాలము తన ప్రభావమును అంతగా చూపదు. కాలానుసారముగా నడుచువాడు సాధకుడు. ధర్మము దేశ కాలములనుబట్టి మారునది కాదు. ధర్మము నాశ్రయించినవాడు దైవమునాశ్రయించినట్లే. కాలము అతనికి సహకరించును కాని, నశింపచేయదు. ఇట్లునడుచు వానికి జీవిత మున కష్టములు నష్టములు ఉండునని మేము చెప్పుటలేదు. ధర్మము నాశ్రయించుట వలన ఏర్పడిన ఠీవితో నతడు సన్నివేశములకు తలవంచక ముందుకు సాగిపోగలడు. ఒడిదుడుకులు కాలము నుద్భవించు సన్నివేశమునకేకాని తనకు కాదని క్రమశః తెలుసు కొనును. ధర్మమనెడు గుంజకు కట్టుబడినవాడు గాలికి, వానకు, వరదకు కొట్టకొనిపోడు. అతడే సాధకుడు. ఇతరులు కాలక్రమమున నశింతురు. వరద, వాన, గాలి వారిని పీడించగలవు.

అధర్మమునే ధర్మమని భావించుచు కొనసాగినచో పురోగతి యుండదు. 'ధర్మము వలన లాభముండదు. పనులు సాగవు' అని

భావించుట పిల్ల బుద్ధి. ధర్మము నాశ్రయింపక, దైవము నాశ్రయించుచు తమదైన మార్గములలో ముందుకు సాగు లౌకికులు కాలక్రమమున క్రిందుమీదు లగుదురు. దైవమునాశ్రయించి, ధర్మమును వదలుట కొమ్మను ఆశ్రయించి మొదలును నరకుట వంటిది. ధర్మము నాశ్రయించని దైవారాధనము డాంబికము మరియు మోసము. ఈ మార్గమున తమ్ముతాము మోసము చేసుకుందురేగాని దైవమును మోసగింపలేరు కదా! దుర్వాసుని స్థితి, భక్త రామదాసు పరిస్థితి ఈ సూత్రమును ప్రస్ఫుటముగ తెలియజేయుచున్నది. దైవారాధనములు చేయువారు ధర్మమునకు బద్ధులైయుండుట ప్రాథమిక నియమము. అట్టి నియమము లేనివారు దైవారాధన యందున్నను అంతర్గత ఘర్షణలకు లోనగుదురు. పరహితము, అహింస, సత్యము, మైత్రేయ సంఘమున అంగీకరింపబడిన ధర్మ త్రిజట.

మా మార్గమున నడుచువారికి ధర్మమే ప్రధానము. దైవారాధనము ధర్మమున నిలుచుటకే. తీవిగ ధర్మమునాశ్రయించి పయనింపుడు. పిల్లచేష్టలు వదులుడు. ఎట్టి క్లిష్టసమస్యలకైన ధర్మమున వందలకొలది పరిష్కారములు లభింపగలవు.



## 12

## సత్యము - భ్రమ

"**మా**నవ జీవితము అతలాకుతలమైనప్పుడు మానవులు గర్వించి తమ పునాదులు సైతము పెకలించుకొను మూర్ఖత్వమును అతిశయముతో పొందినపుడు, జాతిలో మేలుకొలుపు కలిగించుటకు మైత్రేయవాణి వినిపించునని" అత్యంత ప్రాచీన గ్రంథములు ఉద్ఘోషించుచున్నవి. మానవ చైతన్యమును క్రమబద్ధము చేయుటయే మైత్రేయవాణి ముఖ్య ఆశయము. సత్యమును తమ స్వార్థము కొఱకు మహాత్ములు అనుకొనువారు ఎన్నియో వక్రమార్గములు పట్టించి అడ్డుగోలుగ సిద్ధాంతములేర్పరచి విశ్వమానవ సోదరత్వము అను పవిత్ర భావమును దుర్వినియోగపరచుచూ, జాతిని దుస్థితిపాలు చేసినారు. ఈ రోజులలో అందరూ విశ్వమానవ సౌభ్రాతృత్వమును గూర్చి మాట్లాడెదరు. కాని చేతలలో వారిలోగల కుసంస్కారములు, జాతి, మత, కుల భేదములను వికృతముగా వ్యక్తపరచుచుందురు. దీనికి కారణము సత్యమునందు తాముండుట కన్న తమయందు భాసించినదే సత్యమని భ్రమపడుట. ఈ భ్రమ తొలగిననే పరిష్కారము లభించును. ఈ భ్రమ తొలగింపునకే మైత్రేయవాణి కృషి.

# 13

## ఒక త్రిభుజము




పరమగురువుల మార్గమున దైనందిన కృషి, త్యాగము అనునవి ముఖ్యాంశములు. కృషి నిరంతరముగ సాగవలెను. సత్సంకల్పములను అవతరింపచేయుటకై (రూపకల్పన చేయుటకై) కృషి సాగుచూ నుండవలెను. తన గురించిన భావమున్నవారు ఈ కృషిని సాగింపలేరు. సత్సంకల్పమునందు పూర్ణవిశ్వాసము లేనివారు కూడ కృషిని కొనసాగించలేరు. తమకున్నది సత్సంకల్పములకు సమర్పించుకొనలేరు. ప్రస్తుత పరిస్థితిలో కాలము, సత్సంకల్పమునకు ప్రతికూలముగనున్నదని సత్సంకల్ప సంఘసభ్యులు గుర్తించవలెను. పరిస్థితులకు లోబడని సంకల్పబలము కలిగియుండుటకై ఓంకార మును ధ్యానించుట, గాయత్రి మంత్రమును జపించుట, వీలున్నంత

వఱకు మౌనమును వహించుట, వాక్ శక్తిని క్రియాశక్తిగ మలచుట చేయవలెను. విశ్వవ్యాప్తమైన చైతన్యము ఆహ్వానించుట కొఱకు, తన నాదరించి తనయందు స్థిరపడుట కొఱకు గాయత్రిమంత్ర జపము శ్రేష్ఠముగ వినియోగపడును. కేవలము బుద్ధులను ప్రచోదనము గావించు మహామంత్రము గాయత్రి. నా మార్గమున గాయత్రి మంత్రమునకు అత్యంత ప్రాధాన్యత కలదు. ఓంకారము, గాయత్రి, సత్సంకల్పము, కృషి మరువకుడు. ఇది ఒక త్రిభుజము.

# 14

## కోటగోడ

**యో**గుల కొందరు కాలవంచితులై సాధకుల మనస్సులకు, హృదయములకు తమ నామరూపములను ధ్యానమునకై అందింతురు. దీనివలన అపాయము గుర్తించకపోవుటయే వంచనకు, వక్రగతికి దారితీయుచున్నది. సమస్త హృదయములందును ఈశ్వరుడు ప్రతిష్ఠితుడై యుండగ ఈశ్వర స్వరూప స్వభావములను ఎరుగగోరు సాధకులకు తమ చిత్రపటమందించుటచే ప్రాథమికముగ కొంత ఉపయోగముండినను కాలక్రమమున అదియొక దాటరాని కోటవలె సాధకుని హృదయమున ఏర్పడి పురోగమనమునకు అవరోధ మేర్పరచుచుండును. అంతర్యామియైన భగవంతుడు చేతనాస్వరూపుడై సమస్త ఆకారముల యందు నిలచియున్నాడు. ప్రతి ఆకారమున ఆ ఆకార రూపముగ నిలచియున్నాడు. సమస్త జీవరాసుల హృదయము లందును సూక్ష్మరూపమున ఆయా జీవుల రూపముగ ప్రకాశించు చున్నాడు. దానిని గ్రహించుటయే యోగ లక్ష్యము. దానిని గ్రహించిన వారే యోగులు. స్ఫూర్తి నిచ్చుటకు, దారి చూపుటకు కూడ వారి ఆవశ్యకత యున్నది. చూపినదారిలో వారే అడ్డుతగులుట కలి ప్రభావము. స్ఫూర్తికై మార్గము చూపిన వారిని స్మరించి స్వస్వరూప సంధానమునకై అంతర్ముఖులగుదురుగాక !

## 15

## ప్రాథమిక దీక్ష

రక్తసంబంధపు సోదరత్వమే అంతంత మాత్రముగ మిగిలి యున్న ఈ రోజులలో విశ్వమానవ సోదరత్వము అనెడి భావము హాస్యముగ తోచవచ్చును. దైనందిన జీవితమున తా నెదుర్కొను ప్రతి జీవి యందును తన సోదరుని చూచుట సాధకునకు మే మందించు ప్రాథమిక దీక్ష. ఎదుటి జీవియందు ముందు సోదరుని గుర్తింపుము. ఆ తరువాత లౌకిక సంబంధములను గుర్తింపవచ్చును. సమస్త జీవకోటి ప్రకృతి నుండి వ్యక్తమైనదే కావున జీవులందరూ సహోదరులే. ఇతరుల దృక్పథముతో సంబంధము లేకయే ఈ దీక్షలను నిర్వర్తించుకొన వచ్చును. అనగా ఇతరులు నిన్ను సోదరునిగ గుర్తించ కున్నను నీవు సోదరుని గుర్తించుట ఒక దీక్ష. యుధిష్ఠిరుడు అట్టి దీక్షనే నిర్వర్తించెను. కనుకనే దివ్య లోకములయందు కూడ గౌరవింప బడెను. సోదరత్వమను దీక్ష మా బృందమున శ్రేష్ఠమైన దీక్షగా భావింతుము.

నీ కుటుంబమునందు, నీ పరిసరములయందు యీ భావమును ప్రవేశపెట్టి జీవించుట ప్రయత్నించుము. క్రమశః ఈ భావము నిన్ను ఉన్నతునిగ చేయగలదు. మనోవికాసము కలిగించగలదు.

సోదరత్వమును గూర్చి భాషించుట తగ్గించి జీవించుట మొదలిడుము. సోదరత్వ భావమును ధరించిన సాధకునకు మా సోదరబృందము అదృశ్యముగ సహాయ సహకారముల నందించును. అది కారణముగ మిక్కిలి బలవంతుడవై మహత్కార్యములు సాధింప గలవు. యుధిష్ఠిరుని కందిన సహాయ, సహకారములు జ్ఞప్తికి తెచ్చు కొనుము. అతడు ధర్మదేవతను సహితము సోదర భావముతో రంజింపజేసెను. తన వెంట వచ్చు జాగిలమును సోదర భావముతో మన్నించుట వలననే కదా ధర్మదేవత సంతసించినది! మరణమును సహితము సోదర భావముతో జయించవచ్చును.

అట్టి పటిష్ఠమైన దీక్ష కలవారందరు వైశాఖలోయలో వైశాఖ పౌర్ణమినాడు ఒక బృందముగ ఉత్సవములు జరుపుకొనుచున్నారు. నీవును సోదరదీక్ష నాధారముగ గొని బృందమున చేరుము.



16

## సమాన ధర్మము

సోదరత్వమున స్వతంత్రత, సమాన్వతము భాసించు చుండును. ఈ రెండు గుణములను సదవగాహన చేసుకొనుట అరుదు. దైవము మానవ రూపమున దిగివచ్చినపుడెల్ల తోటి జీవులతో సమానముగ కలిసి జీవించెను. వారి స్వతంత్రతకు తానడ్డుపడలేదు. అది దైవముయొక్క విశేషమైన సోదరభావము. అట్లు దైవము మానుష రూపములో ప్రవర్తించినపుడెల్ల సమానధర్మమును ఆచరించి చూపెను. సమకాలికులైన జనులు దాని విలువను తెలియక దైవముతో ప్రవర్తించిరి. శ్రీకృష్ణుడు, ఏసుక్రీస్తు జీవితములను తరచి చూచి నప్పుడు సమకాలికులు సమానధర్మములు అవగాహన చేసుకొన లేకపోయిరి. జీవులలో ఇప్పటికిని 99 శాతము అధికారమును గౌరవించినట్లుగ, సోదరభావమును గౌరవింపలేదు. అధికారమునకు అణకువతో ప్రతిస్పందింతురు. సోదరత్వము అంతకుమించిన గుణము కనుక అణకువతోకూడిన ప్రేమతో ప్రతిస్పందించవలెను. అట్లుకాక దైవముతో మేమును సమానమే అని స్వతంత్రించి సమకాలికులు నష్ట పోయిరి. శ్రీకృష్ణుని సమాన ధర్మమును గుర్తింపలేక యాదవులు నష్టపడిరి. ఏసు సమాన ధర్మమును గుర్తింపలేక

యూదులు నష్టపడిరి. సంస్కారము పెరిగిన తమకన్న చిన్నవారిని కూడ తమతో సమానముగ ఆదరింతురు. అది వారి సంస్కార గుణము. అంతమాత్రము చేత ఆదరింపబడినవారు, ఆదరించిన వానితో సమానమని భావించుట అతని దుర్గతికి దారితీయగలదు.

తండ్రి కొడుకుయందు చూపు ప్రేమ, గురువు శిష్యునియందు చూపు వాత్సల్యము వారిలోని సోదరత్వమునకు సంబంధించినదే. అటులనే దైవము యొక్క ప్రేమ, వాత్సల్యమును. దానిని సక్రమముగ నందుకొనవలెనన్నచో వినయముతో కూడిన సోదరభావ ముండ వలెను. పిల్లలు పెద్దలను మన్నించుట,పెద్దలు పిన్నలను ఆదరించుట సమాన ధర్మమునందలి భాగములే. ఇట్టి నియతిలేని సమానధర్మము వికృతమై సంఘమును దుర్గతిపాలు చేయగలదు. సమానత్వమును, సోదరత్వమును సదవగాహన చేసుకొనుటకు కూడ విద్య, వినయము అవసరము. కేవలము చదువు చాలదు.



## 17

## ఒక రహస్యము

ఈ మధ్యకాలమున ప్రపంచమున వేలాది సోదరబృందము లేర్పడినవి. ఈ బృందములన్నిటియందును సోదరత్వము మాత్రమే కొఱత. నామమాత్రపు సోదరత్వమే కాని అందు మూలసూత్రములు కానరావు. సోదరత్వమునకు విశ్వాసము పునాదిరాయి. ఒకరిపై ఒకరికి అపనమ్మకము, అనుమానము, సందేహము, అసంతృప్తి కలిగి బృందము మాత్రము గోచరించుచు నామావశిష్టములుగ ఈ బృంద ములు మిగిలివున్నవి. ఒకరి నొకరు "సోదరా" అని సంబోధింతురే కాని హృదయమున సోదరత్వముండదు. భావశూన్యమైన ఉత్తమ పదజాలములతో ఒకరి నొకరు పొగడుకొనుచు ఎవరి కార్యములు వారు నెగ్గించుకొనుటకు ప్రయత్నించుచుందురు.

ధర్మసంస్థల యందు 'ధర్మమే' కొఱత. సహకార సంఘముల యందు 'సహకారమే' కొఱత. సేవాసంస్థల యందు 'సేవయే' కొఱత. ఆధ్యాత్మికసంస్థల యందు 'ఆత్మజ్ఞానమే' కొఱత. పదజాలము ఇంద్రజాలమువలె వికృతముగ నాట్యము చేయుచున్నది.

ఇట్టి కలుషిత వాతావరణమున గుహ్యముగ విశ్వమానవ

సోదరత్వమునకు సంకల్ప బీజములు నిశ్శబ్దముగ చల్లుట నా కర్తవ్యము. ఈ బీజములు మొలకెత్తి ఉద్యానవనములై భవిష్యత్తునందు సత్ఫలములీయ గలవని నా విశ్వాసము. ధర్మముపై పూర్ణ విశ్వాసము కలవారెల్లరును ఈ ఉద్యానవనమును క్రమముగా చేరగలరు. సమస్త ధర్మములను అతిక్రమించుచు భౌతిక వాదములు చెలరేగుచున్న ఈ సమయమున ధర్మము రహస్యముగ నూతన పునాదులను ఏర్పరచుకొనుచున్నది.



## 18

# మొండితనము

సాధకునికి మొండితనము పనికిరాదు. మొండితనము మూర్ఖతకు చిహ్నము. మొండివానితో స్నేహము అభివృద్ధికి ఆటంకము. మొండి గుఱ్ఱము నెక్కి ప్రయాణముచేయుట సాధ్యము కాదు కదా! పట్టు విడుపులు ఆవశ్యకములు. మొండితనము మోయలేని బరువు. మొండివానికి ప్రజ్ఞాకేంద్రములు స్తంభించి అతనిని బంధించును. విజ్ఞానము సాధకునియందు వివేకమును, విచక్షణను పెంచవలెను కాని మొండితనమును కాదు. ఒక రకముగ చూచినచో మూఢ విశ్వాసములు కూడ మొండిలక్షణము గలవి. విశ్వాసము మంచిదే అయినను దానియందు మూఢత్వము వ్యక్తిగత వికాసమునకు అవరోధము కాగలదు.

మేమందించు బోధనాంశములను కూడ మూఢ విశ్వాసముతో, మొండిపట్టుదలతో వినియోగింపవలదు. విచక్షణ వివేకములతో కాలమును, దేశమును గమనించి తెలివిగ వినియోగించుకొనుడు. సాధన దూరప్రయాణము వంటిది. సాధన ప్రయాణము బరువు కారాదు. మా బోధనలతో నిన్ను నీవు కష్టపెట్టుకొనకుము. మిక్కిలి శరీరశ్రమ కూడ మేమంగీకరింపజాలము.

# 19

## నిజమైన విశ్రాంతి

విశ్రాంతి అనగా సమతుల్యమే. విపరీతశ్రమ విశ్రాంతి కాజాలదు. శ్రమలేమి కూడ విశ్రాంతి కాదు. ఏమీచేయకుండుట విశ్రాంతి నివ్వదు. చేయువారి కన్న చేయనివారికే నిస్సత్తువ ఎక్కువ. వారు నిస్పృహను కూడ పొందుదురు. నిస్పృహ, నిస్సత్తువ చేయువారి కుండదు. చేయనివారికే నెక్కువగ నుండును. పనిచేయుటలోనే విశ్రాంతి యున్నదని తెలియుట వివేకము. సమస్త సృష్టి అనుస్యూతము కదలుచునే యున్నది. నదీ ప్రవాహము అనుస్యూతము గమనమునందే వున్నది. గమనము ఎక్కువైనపుడు వరదయగును. గమనమాగినచో నదీజలములు మురిగిపోవును. నదికి గమనమెట్లు సహజమో జీవమునకు చేత అట్లు సహజము. చేతలు మానినవారు రోగములు నాహ్వానింతురు. విశ్రాంతి కోరుట దురభ్యాసము. కార్యములయందు నిమగ్నమై యున్నవారికి అవసరమైన విశ్రాంతి అప్రయత్నముగ లభించుచుండును. విశ్రాంతికోరుట తమోగుణ లక్షణము, అది స్తబ్ధతను పెంచును. నదీ ప్రవాహము ఎక్కువగ ఉన్నను, అసలు

లేకున్నను హాయిని గొలుపదు, అటులనే మానవ జీవనము కూడ. మహానగరమునందునను, మహారణ్యమునందునను ఒకే రకమైన వేగమునందుండుట అభ్యసింపుము. నిశ్చల వేగము సమతుల్యమునకు దారిచూపును. సమతుల్యమే యోగస్థితి, విశ్రాంతస్థితి. ఈ స్థితి యందున్నవాడు సహజయోగి. అతని మనస్సున అతివేగముగాని, అతినిదానముగాని యుండదు. సన్నివేశములు అతనికి వేగమును గాని, నిదానమునుగాని కలిగింపవు. అతని సాన్నిధ్యమున సమస్తము సమవేగమునందుండును. అనగా అతివేగవంతులు కొంత వేగమును కోల్పోవుదురు. అతి నిదానస్తులు కొంతవేగమును పొందుదురు. యోగులు సమస్తమును సమవేగమున నుంచుదురు. సమవేగులకు శక్తి ధారాపాతముగ అందుచునుండును. వారి యందు శక్తి దుర్వినియోగము కాదు. విశ్రాంతి యనుపదము ఒక ఆరాటముగ గాక, ఆచరణయందు అవతరించియుండును. అవిశ్రాంతముగ, సమవేగమున కృషిచేయువారే నిజమైన విశ్రాంతి ననుభవించుచున్నారు.

# 20

## కోపము

**మా** బృందమున తీరిక సమయములలో ఒక ఆట ఆడు చుందురు. అది యేమనగా ఒకరి నొకరు కవ్వించుట. కవ్వింపబడిన వారిలో ఎవరికి ముందు కోపము వచ్చునో వారు ఓడిపోయినట్లు.

యోగికి కోపము తెప్పించుకొనుటయుండును గాని కోపము నకు లోబడుటయుండదు. కోపమునకు లోబడుట అలసత్వము. అవసరమునకు కోపించుట, అవసరమునకొక ఆయుధమును వాడినట్లే. కోపమును తాను వాడవలెను గాని తనను కోపము వాడరాదు.

కోపమునకు లోబడకుండుటెట్లు? అను విచికిత్స వలన దాని నధిగమించుట యుండదు. కోపము తనంతట తానే వచ్చుట యనగా తనయందలి శక్తి ప్రభావమునకు నియమము లేకుండుటయే! దైనందిన జీవితమున నియమములను దీక్షతో పాటించిన వారికి క్రమశః కోపము ఉపశమించును. శక్తిప్రవాహము యొక్క ఆకస్మిక అవతరణమే కోపము. నియమపూరితమైన జీవితమున శక్తిప్రవాహ మునకు అనువైన గమనముండును గనుక అకస్మాత్తుగ ఛేదించుకొని

వెలువడవలసిన అవసరముండదు. రక్తనాళములందు ప్రవహించు రక్తము నిరోధింపబడినచో ఏమగును? నాళము చిట్లును. అటులనే శక్తిప్రసారమును నిరోధించునపుడు చిమ్ముకొనుచు కోపము వచ్చును. వినిమయము నియమముగా గల జీవితములలో కోపమునకు తావుండదు. అందులకే అపుడపుడు కోపముతో ఆడుకొనుటకు మేము సాహసింతుము. కోపముతో ఆడుకొనుట, విద్యుత్తుతో ఆడుకొనుట వంటిది. మా బృందమున ఇట్టి అపాయకరమగు ఆటలు గలవు.

## 21

# అప్రమత్తత

శ్రుతిలేని వీణ సంగీతమునకు పనికిరాదు. అప్రమత్తత లేని సాధన యోగమునకు పనికిరాదు. సరిగ శ్రుతిపెట్టబడిన వీణద్వారా వీచుగాలి వలన కూడ సంగీతములు పలుకును. అప్రమత్తుడైన సాధకుడు తన వంతు కర్తవ్యమును సన్నివేశములనుండి గొనును. అప్రమత్తుడే సూక్ష్మగ్రాహి కూడ. అప్రమత్తత బుద్ధిని పదను యందుంచును. మన చుట్టును నున్నవారు అప్రమత్తులై యుండవలె నని మనమా కాంక్షించుచుందుము. అటులనే మనమప్రమత్తులమై యుండవలెనని వారును ఆకాంక్షింతురు కదా! ఇతరులు అప్రమత్తులై యుండవలెనని ఆకాంక్షించుట కన్న తానప్రమత్తుడై యుండుట అవసరము. సప్తధాతువులతో కూడిన నీ శరీరమను వాయిద్యమును శృతిపెట్టి యుంచుకొనుము. అదియే సాధన. అట్లుంచినచో సూక్ష్మ గ్రాహ్యత్వము కలుగును. వాయుతరంగముల ద్వారా మా నుండి సందేశములు కూడ అందును. బయలాలకించుటకు ఇట్టి అప్రమత్తత అత్యవసరము. అప్రమత్తత నీ సహజ లక్షణము కావలెను. వీణ తీగలను సడలించుట వీణ కపాయకరమని గూడ గుర్తించుము.

22

## క్రమము - క్రతువు

దైనందిన జీవనము ఒక క్రతువువలె క్రమబద్ధము కావలెను. క్రమమే క్రతువునకు బలము. క్రమమే జీవనమునకు కూడ బలము. శ్రమజీవనము క్రమజీవనగముగ ఉత్తీర్ణత చెందవలెను. క్రమ మబ్బినవారికి పరమబ్బుట సాధ్యము కదా! దైనందిన కార్యక్రమము లకు ఒక క్రమమేర్పరచుటకు ప్రయత్నించుము. అట్టి ప్రయత్నము విసుగు వచ్చుట సహజము. ఓర్పుతో విసుగును జయించవలెను. శ్రద్ధ, ఓర్పు విసుగునకు విరుగుడు. అటులనే విసుగు శ్రద్ధా ఓర్పులకు మరణము. జీవితమున క్రమమేర్పరచినపుడు నీయందు ఘర్షణ కూడ కలుగగలదు. ఘర్షణము స్వభావమును మధనము చేయు శక్తి. మథనమునందు కూడ క్రమమును విడువకుము. క్రమవంతుడు చైతన్యమున పెరుగును. అనగా వికాసముచెందుట, వ్యాపించుట అతడికి జరుగగలవు. క్రమముచేత పరమును కూడ ఆక్రమించ వచ్చును. అతడే నిజమైన పరాక్రమవంతుడు. అనగా క్రమమాధార ముగ పరమును కూడ ఆక్రమించిన వాడని అర్థము. అగస్త్యాదులు అట్టివారు.

## 23

# పని

పనిని ప్రేమించుట ఉత్తమలక్షణము. పనిని నిర్లక్షింప కుండుట మధ్యమలక్షణము. పనిని గర్హించుట అధమలక్షణము. పనిని గర్హించువాడు క్రమశః జ్ఞానమును కోల్పోవును. అది కారణముగ ధర్మాధర్మ విచక్షణము కూడ పోవును. విలువైన విషయముల యందు శ్రద్ధ తగ్గుటయేకాక విముఖత, ఏహ్యాభావము కూడ కలుగును. అట్టివారికి మా సోదరబృందమును గూర్చి తెలిపినచో చిట్టెత్తును. మండిపడుదురు. పందికి ముత్యముల విలువ తెలియదు కదా! అట్లే పని దొంగకు సత్పురుషులు, సద్గ్రంథములు, సత్ భాషణములు స్ఫూర్తి నివ్వక ఏహ్యత కలిగించును. విలువైన విషయముల యందు ఏహ్యత కలుగుట అపాయకరము. అనగా రాబోవు అపాయమును సూచించును. సత్పురుషులు, సద్గ్రంథములు, సత్కార్యములు దూషింప బడు తావున క్షణమాత్రము ఉండరాదు. ఇది మా శాసనము. ఇతరములగు వ్యామోహములకు లోబడి అట్టి ప్రదేశముల యందు గాని, వ్యక్తులతోగాని మసలినచో మీకుగల క్రమశిక్షణము దెబ్బ తినుటయేగాక ధర్మసూత్రముల యందు అనుమానముకూడ ఏర్పడ గలదు. నియమిత కార్యములను ఏకోన్ముఖముగ నిర్వర్తించుచు, నిర్వర్తింపబడు కార్యములను ప్రేమించుచు జీవించుట శ్రేయోదాకము.

# 24

## ఓర్పు

**ఓ**ర్పు, ఓర్పు, ఓర్పు! సాధకుని జీవితమున ఈ పదము అర్థరహితము కారాదు. ఓర్పునకు భూమియే గురువు. ఓర్పు వహించలేని సమయమున భూమిని చూసి మరల స్ఫూర్తి చెందవలెను. ఓర్పు లేనివారికి వాతావరణము నందలి దివ్యశక్తులు సహకారము నందించజాలవు. ఓర్పుగలవానికి కాల క్రమమున సమస్తము అనుకూలింపగలవు. సాధన యందు ఓర్పు వహించుటయే పెద్ద పరీక్ష. ఓర్పును కోల్పోయినచో సమస్తమును కోల్పోయెదవు. అనంత శక్తికి ముఖద్వారము ఓర్పుయే.

ఓర్పుతోనే నలుడు, హరిశ్చంద్రుడు, యుధిష్ఠిరుడు కోల్పోయిన వైభవమును తిరిగి పొందిరి. ఓర్పు వలన మూడు లోకముల యందు జయము లభింపగలదు. ఓర్పు గలవాడే నిజమైన బలవంతుడు. ఓర్పుతో నీ కందించిన సద్విషయములను నిర్వర్తించుచుండుము. మా సోదర బృందముతో పనిచేయుటకు వలసిన నేర్పు, ఓర్పు మాత్రమే.

**25**

# ఉట్టి - స్వర్గము

**జా**తి పునర్నిర్మాణమునకు పూనుకొనువారు మున్ముందుగ తమ తమ గృహ (కుటుంబ) నిర్మాణమును నిర్వర్తింపవలెను. చక్కని కుటుంబము సోదరత్వమునకు, ప్రేమకు, సహకారమునకు, త్యాగమునకు, సహజీవనమునకు ప్రతీక. ఇదివరలో సోదరత్వము నకు కుటుంబము చక్కని విద్యాలయమని తెలుపుచుండెడివారము. చక్కని కుటుంబములే అరుదైన ఈ రోజులలో ఈ మాటలు చెప్పుట కూడ నిరర్థకమే అగుచున్నది. కుటుంబముల యందు ద్వేషములు, ఘర్షణలు తాండవముచేయుచుండ, జాతి యను పెద్ద కుటుంబ పునర్నిర్మాణమునకు పూనుకొనుట వెఱ్ఱితనము. "ఉట్టి కెక్కలేనివాడు స్వర్గమున కెక్కుదును" అనినట్లుండును. నాగరికత పేరున మానవుడు కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్న మొనర్చెను. అట్టివాడు భౌగోళికముగ మార్పులు తీసుకుని రాగలడు అని నమ్ముట కరడుగట్టిన అజ్ఞానము. ఈ కాలపు నాయకులెవ్వరును కూడ జాతి పునర్నిర్మాణమునకు అర్హులుగ గోచరించుట లేదు. అర్హులకు అవకాశము లేక, అవకాశము కలవారికి అర్హతలేక జాతిమొత్తము ఒక విషవలయమున తిరుగు చున్నది. కాలక్రమమున దైవమే పరిష్కార మొసంగగలడు. అంత వఱకు ఓర్పు వహించి ఉండుటయే కర్తవ్యము.

## 26

# ధర్మ యుద్ధము

ధర్మమునకై యుద్ధము తప్పనిసరి. జీవితమున ధర్మము నాచరించపూనితివా, ఘర్షణము అను యుద్ధము జీవితకాల మంతయు నీయందు జరుగుచునేయుండును. ప్రశాంతతకు భంగము వాటిల్లు సంఘటనలు తారసిల్లుచునే యుండును. ధర్మయుద్ధము మొదలైనదని గ్రహించి శాంత చిత్తముతో యుద్ధము జరుపు చుండుము. నీవలె లక్షలాది జీవులు ఈ యుద్ధమున పాల్గొని యున్నారు. ఈ సత్యము నీకు ప్రోత్సాహజనకము. బుద్ధి యోగముతో చక్కని నిర్ణయములు గైకొనుచు సాగిపోవుటయే నీ కర్తవ్యము. జీవన మార్గమున ధర్మాచరణమునకు సత్యమను రెక్కలు ఏర్పడగలవు. అది కారణముగ నీవు అనాయాసముగ ముందుకు సాగగలవు. అట్టి సమయమున గర్వము దరిజేరు అపాయము కలదు. అది నీ నుండి జనించిన కొమ్ములై ఇతరులను బాధ పెట్టగలవు. గర్వమును దరి జేరనీయక దయను పెంపొందించుకొనుచు, మార్గమున సాగవలెను. గర్వము నకిలీ రెక్కలు. వాటిపై ఆధారపడినచో పతనము చెందగలవు.

ధర్మము, సత్యము, దయ అను త్రిభుజము నాశ్రయించి ముందుకు సాగినచో విశ్వప్రేమ మార్గమున దైవమును చేరగలవు.

## 27

# మృత్యుంజయ మార్గము

ప్రతి సంస్కృతి యందును మరణించిన జీవుని వెంట తోడుగ ఒక దేవతయో, పితృదేవతయో, సిద్ధుడో కొంత దూరము పయనించి, మరొకలోకమును చేరుటకు సహకరించునని నానుడి కలదు. అనగా, మరణించిన జీవుడు గోరియందే బందీకృతుడైయుండడని దీని అవగాహన. ఇహలోకముకన్న యితరలోకములు గలవన్నది మరి యొక అవగాహన. ఉత్తమ లోకములు చేరుటకు ఒక సహాయకుని గురువని పిలుచుట ప్రాచీన సంప్రదాయము. ప్రతి సంస్కృతి యందును గురువునకు, అధ్యాపకుననకు ఒక విశిష్టస్థానము గలదు. గురువును, అధ్యాపకుని గౌరవించు సంస్కృతికి, సంఘమునకు పతనము కలుగదు. ఎంతటి కష్టనష్టములనుండైనను అట్టి జాతి ఉత్తీర్ణత పొందలదు. గురుబోధ, అధ్యయనములు మృత్యుంజయ ములు. ఇవిలేని జీవనము మరణముతో సమానమే. మృత్యుంజయ మార్గమున జీవులను ఉత్తీర్ణులను చేయుటయే మా దీక్ష!

## 28

## నిజమైన సాధువు

**మా**నవ జాతియందు కఱడుకట్టిన అజ్ఞానమును నిర్మూలించుట మహత్తరమైన సేవా కార్యక్రమము. మూఢ విశ్వాసములు, ఆచారములు అజ్ఞానములోని అంతర్భాగములు. వీని నిర్మూలనము సుసాధ్యమైన కార్యముకాదు. నేర్పు, ఓర్పు, జ్ఞానము కలవారు మాత్రమే నిర్వర్తించగలరు. ఇతరులు ఈ ప్రయత్నమున మరింత అయోమయ స్థితిని సృష్టించగలరు.

విజ్ఞానశాస్త్ర పరిశోధనా మార్గమున మానవుడు అజ్ఞానమును, మూఢ విశ్వాసములను, ఆచారములను దాటుటకు శాస్త్రీయమైన అవగాహన పెంపొందించుటకు శతాబ్దములుగ చక్కని ప్రయత్నములు కొనసాగించుచున్నాడు. ఇది హర్షింపదగిన విషయము. కాని, శాస్త్రజ్ఞుని శాస్త్రీయ దృక్పథము నిష్పాక్షికము కాకపోవుట వలన శాస్త్ర పరిశోధనము కూడా తాత్కాలిక నిరోధములు కల్గించుకొనుచున్నది. శాస్త్రజ్ఞుని మనోతత్వము దేశ, కాల, మత, ఆచారములందు బందీయగుటచే పారదర్శకములగు శాస్త్ర సిద్ధాంతములు వెలుగునకు వచ్చుట లేదు.

చంద్రునిపై జీవము లేదని ఒకప్పుడు, ఉన్నదని మరియొకప్పుడు, కుజునిపై జీవమున్నదని, లేదని, మరల ఉన్నదని శాస్త్రజ్ఞులు చెప్పుట హాస్యాస్పదము. మన సూర్యమండలమును దాటి మరొక సూర్యమండలమును నిరాకరించిన శాస్త్రము, యిపుడు మరియొక సూర్యమండలమును గుర్తించుచున్నది. మనకు తెలియనిది లేదనుట అజ్ఞానము. మనకు తెలియనిది తెలియవచ్చును. తెలియదు అని తెలియుట కూడా జ్ఞానమే.

శాస్త్ర పరిశోధకుల యందుగల సాధువులు యిట్టి దురాచారములకు పాల్పడరు. వారే శాస్త్రజ్ఞానమును సమగ్రముగ అందివ్వగలరు. తత్వశాస్త్రమునైనను, విజ్ఞానశాస్త్రమునైనను, సాధువే చక్కగ నిర్వర్తించి జ్ఞానోదయమేర్పరచగలడు. సాధువు మానవజాతికి ధృవతార వంటివాడు. కాషాయము ధరించిన ప్రతి వ్యక్తియు సాధువు కాడు. సశాస్త్రముగ వివరించువాడు, శోధనా మార్గమున ప్రవేశపెట్టువాడు నిజమైన సాధువు.

## 29

# దాన యజ్ఞము

**త**నకున్నది పంచువాడు పుణ్యమూర్తి. తనను కూడా పంచువాడు సాధువు. అతడు పంచుటకు ప్రకృతి కూడా తోడ్పడి అనంతమైన సంపదను పంచగలదు. సాధువు సంపద అపారము. అనగా హద్దులు లేనిది. ఆ సంపద పదార్థమయమే కాదు, వాఙ్మయము, విజ్ఞాన, జ్ఞానమయము గూడ.

తనకు లేనిది పంచువాడు డంబాచారి. తనది కాని సంపదను, తనకు లేని జ్ఞానమును యితరులకు పంచు ప్రయత్నము మోసముతో కూడినదే. అందుండి పుట్టునది ప్రకోపమే.

దాన యజ్ఞము గొప్పది. మహత్తరమైనది. దానిని నిర్వర్తించుటకు వలసినది అంతః శుచి. హృదయమున దైవమును అనునిత్యము ప్రతిపాదించుకొనుట వలన అట్టి శుచి ఏర్పడగలదు. అట్టివాని హృదయమున దైవము ప్రతిష్ఠితుడై దానమును నిర్వర్తించును. దానము చేయువాడు, హృదయమున దైవమును ప్రతిపాదించుకొనుట వలన విశేషమైన దాన యజ్ఞమును నిర్వర్తింపగలడు. బలిచక్రవర్తి అట్టివాడు.

# 30

## కృతజ్ఞత

**సూ**టియైన ప్రవర్తనము, త్రికరణ శుద్ధి, ఔదార్యము, గంభీరత, మౌనము, కదలికలయందు రీతి, సింహ లక్షణములు. ధర్మము సింహము యొక్క ఆయువుపట్టు. నీచబుద్ధి అణుమాత్రము గూడా లేనిది సింహము. సింహ లక్షణములు లేనివారు మా ప్రణాళికా మార్గమున ప్రవేశింపలేరు. మా గురుపరంపర అంతయూ సింహరాశి ప్రభావముతో కూడినదే!

కృతజ్ఞత, విశ్వాసము రెండు రెక్కలుగ ధర్మము ననుసరించు వారు మా కిష్టులు. ఇవి లేనివారు అధర్మపరులు. కలికి బానిసలు. మా మార్గమున కృతజ్ఞత అత్యావశ్యకము. కృతజ్ఞత గలవారికి మా తోడ్పాటు కలదు. కృతజ్ఞత దివ్యమైన లక్షణమేగాక, సుందరమైనది కూడాను. కృతజ్ఞత హృదయపద్మ వికాసమునకు దోహదకారి. కేవలము కృతజ్ఞతా లక్షణమునుపాసించి దైవ సాన్నిధ్యమును చేరవచ్చును.

కృతజ్ఞత జీవునకు అలంకార భూషణము. కృతఘ్నుడు పతితుడు. అతనికి సమస్త ద్వారములూ మూయబడును. కేవలము అసూర్య లోకముల దారి మాత్రమే తెరువబడి యుండును.

కృతజ్ఞుడు విశ్వాసపాత్రుడు. అట్టివాడు గురు కార్యమునకు అర్హుడు.

# 31

## సద్భావము

**భా**వనలయందు కురుచతనము తగదు. ఉత్తమ భావములే ఉత్తమమానవుని తయారుచేయగలవు. సంకుచిత భావములు గలవారిని మేము మరుగుజ్జులందుము. మరుగుజ్జులకు చీమల పుట్టలే మహాపర్వతములై అవరోధములు కల్పింపగలవు.

ఉత్తమ భావములను మనస్సుయందు సదా నిలుపుకొనుట వలన మనస్సు, బుద్ధియును కూడా దైవీప్రజ్ఞకు అందుబాటులో నుండగలవు. మనస్సు - తుచ్ఛము, నీచము, సంకుచితమైన భావములయందు చిక్కుబడినపుడు, ప్రయత్నించి సాధకుడు ఉత్తమ సంగీతమునుగానీ, భక్తి ప్రధానమైన కీర్తనలనుగానీ, మహాత్ముల ప్రబోధములనుగానీ వినవలెను. మనస్సు నాకర్షించునట్టి భాగవత, రామాయణాది గ్రంథములనుకానీ, సూక్తములనుకానీ, సుభాషిత ములనుకానీ పారాయణము చేయవలెను. అట్టి ప్రయత్నమున మాత్రమే మనస్సు చీకటి భావములనుండి బయల్పడి, వెలుగును సంతరించుకొనగలదు.

పై సద్భావములయందు విముఖత కలిగిననాడు, సాధకుడు తనను తానుద్ధరించుకొను కార్యక్రమమున విఫలుడగును. అతనిని ఎవరునూ రక్షింపలేరు. పై తెలిపిన ప్రయత్నమున మాత్రమే వారు మరల హృదయస్థులై వికసించగలరు. అట్టివారికే జీవన వైభవము. అట్టి రుచి లేనివారు మరుగుజ్జులై విభూతిలేక యుందురు.

32

## లోదారి

దైవ ప్రార్థనలు, దైవారాధనలు సాధకులకు మనోవికాసము కల్గించి చైతన్యవంతుని చేయవలెను. అట్టి ప్రార్థనలే నిజమైన ప్రార్థనలు, ఇతరములు యాంత్రికములు. వాని వలన సమయము, శక్తి, వనరులు వృధా యగుట జరుగును. ప్రతి ప్రార్థనయూ మనలను దైవమును దరిజేరు మార్గమున ముందుకు గొనిపోవలెను. నిత్యమూ ప్రార్థనలాచరించు వానికి, ప్రార్థనలు వినియోగపడుచున్నావా? లేవా? అని తెలియవలెనన్నచో, ప్రార్థన చేయువారు, వారి భాషణము లను, ప్రవర్తననూ, వ్యవహారములనూ గమనించినచో తెలియనగును.

వాక్కునందు, చేతనయందు ఎక్కువ సౌశీల్యము కలుగు చుండినచో ప్రార్థన సఫలము. అట్టి ప్రార్థన వలననే చైతన్యము ద్విగుణీకృతము కాగలదు. దైవ ప్రార్థనము, ధర్మాచరణముల యందు క్రమశః అభివృద్ధి చెందు జీవునకు తప్పక మా పరంపరలోని వారు చేరువై ప్రోత్సహించి, దివ్య ప్రణాళికయందు వారికి ప్రవేశము కల్గించు చుందురు. మేము ఎల్లప్పుడూ మిమ్ము కోరునది– “మీ యందలి

దైవమును మీరు దరిజేరుట, ధర్మమును ప్రపంచమున నిర్వర్తించుటయే కానీ, మమ్ము ప్రార్థించుట కాదు. మీ దైవ ప్రార్థనము, ధర్మాచరణము కారణముగా మేము మీ దరిజేరగలము. మీకు చేయూతనీయగలము. మిమ్ము మేము చేరుటకు, మీరు మాతో కలసి పనిచేయుటకు యిది ఒకటియే మార్గము. మరియొకటి లేదు."



# 33

## నిరాదరణ

సమస్త సృష్టియు పరంపరాగతముగ లోకములను, లోకేశులను, లోకస్థులను ఏర్పరచుకొనియున్నది. సృష్టికి మూలసూత్రమే పరంపర. నారాయణుని నుండి చతుర్ముఖుడు, చతుర్ముఖుని నుండి సమస్తలోకములు ఉద్భవించుట తెలిసిన విషయమే. సృష్టియందు ఊర్ధ్వలోకములు, అధోలోకములకు ఆధారము. క్రిందిలోకములవారు పైలోకముల వారిని గౌరవించుట, పూజించుట, మన్నించుట సృష్టియందు సహజ ధర్మము. సమస్త సృష్టి ధర్మములు అవ్యక్తమునుండి సూక్ష్మలోకములలోనికి, అచటినుండి స్థూలలోకములలోనికి అవతరణము చెందుచున్నవి. సృష్టియందు ఊర్ధ్వలోకములవారు అధోలోకముల వారిని ఆదరించుటవలననూ, అధోలోకములవారు ఊర్ధ్వలోకముల వారిని మన్నించుటవలననూ సృష్టికార్యము నిరాటంకముగ సాగుచుండును.

ఈ పరంపరాగత ధర్మములు మానవులకు కూడా లభించినవి. తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను పిన్నలు గౌరవించుట,

పిన్నలను పెద్దలు ఆదరించుట ఈ ధర్మస్వరూపమే. ఏ సంఘముననైననూ యీ సూత్రము చెడినచో, ఆ సంఘము పతనము చెందుట ఖాయము. పతనము చెందిన మానవసంఘములకు ప్రేమతో, ఆదరముతో, మరల యీ ధర్మ సూత్రములను బోధించుట, అందించుట– తత్ఫలితముగ మానవజాతికి తోడ్పడుట మా గురుపరంపర యొక్క కార్యక్రమము. గురువులను నిరాకరించిన సాంప్రదాయమున సృజనాత్మక శక్తి నశించగలదు. సృజనాత్మక శక్తి నశించిన జాతికి పురోగతి లేదు.



## 34

# మార్గశీర్షము

సృష్టియందు స్థూలము నుండి సూక్ష్మమునకు, సూక్ష్మము నుండి స్థూలమునకు మార్గములు కలవు. జీవుడు తన అనురక్తిని బట్టి సూక్ష్మము లేక వెలుగు మార్గములలోనికి, స్థూలము లేక చీకటి మార్గములలోనికి పయనించును. మార్గనిర్ణేత తానే!

జీవుడు తనకు వలసిన అనుభవములను, తదనుగుణమైన ఆనందమును జీవుడు అన్వేషించుచుండును. రెండు మార్గములూ సృష్టియందలి మార్గములే. అనురక్తియే మార్గమును నిర్ణయించును. జీవుడు ఆనందాన్వేషణమున క్రమశః తప్పొప్పులు తెలిసికొనుచు దీర్ఘకాలమున జ్ఞానము పొందగలడు. కొన్ని జన్మలు పదార్థమయ విషయములందనురక్తి. మరికొన్ని జన్మలు పరమార్థమయ విషయ ములందనురక్తి. అది కారణముగా పదార్థమయ విషయములందు విరక్తి కలుగుచుండును. పూర్ణపురుషుడైన భగవంతునకు పదార్థ మయము, పరమార్థమయము అగు లోకములు రెండునూ సమ పాళ్ళలో అంగీకారములే!

మానవునియందుకూడా అట్టి అంగీకారము ఏర్పడినపుడు అతడు పూర్ణుడగును. పూర్ణపురుష మార్గమే "మార్గశీర్ష మార్గము." యోగమునకు అధిపతియైన "దత్తాత్రేయుడు" మరియు మా గురుపరంపర యీ మార్గమును నిర్దేశించుటకై సనాతనముగ నిలచియున్నాము. భగవద్గీత మాకు ప్రమాణము. యోగ సూత్రములు మేమందించు యోగమార్గము. మార్గశీర్షమును పండించుకొన దలచిన వారు యోగ సూత్రములను, భగవద్గీతను దీక్షతో ఆజన్మాంతమూ అనుసరింపవలెను.



## 35

## చపలమతి

చపలచిత్తుల యందు మేము ప్రత్యేక శ్రద్ధ వహింతుము. చపలచిత్తము అంటురోగమువంటిది. చపలచిత్తులు స్థిర చిత్తమునకై ప్రాకులాడువారిని భ్రష్టులను చేయగలరు. చపలచిత్తుల భాషణమున, చేతలయందు సత్యాసత్యములు, ధర్మాధర్మములు, జ్ఞాన అజ్ఞానములు మిళితములై గమనించువారిని కలవరపరచుచుండును. ఇట్టి వారిని ఏ క్షణమునందైననూ వారి అహంకార ద్వారమున అజ్ఞానము మ్రింగి వేయగలదు. వీరొక భ్రాంతి జీవనమున పడి, వారి భ్రాంతి జీవనమే దివ్యజీవనమని నమ్మి, పామరులను అట్టి భ్రాంతికి గురిచేయు చుందురు. తరచూ వీరివలన జాతికి అపాయములు సంభవించు చుండును.

జీవితమున అశ్రద్ధ, నిర్లక్ష్యము, పొగరుమోతుతనము కలిగిన వారు అట్టి ఆపదకు అవకాశము లేర్పరచుచుందురు. చపలచిత్తము నిర్మూలించుకొనుటకు దీక్షగా ఏదో ఒక సత్కార్యమును దీర్ఘకాలము నిర్వర్తించుటయే పరిష్కారము. అట్టి దీక్షాకంకణులకు స్ఫూర్తిని, శక్తిని,

మా గురుపరంపర అందివ్వగలదు. దీక్ష, శిక్షణము అనుస్యూతము జీవితమున సాగుచుండవలెను. ఇట్లు పంద్రెండు సంవత్సరములు సాగినచో చిత్తచాపల్యము అను అపాయమునుండి ఉద్ధరింపబడుటకు అవకాశము గలదు.



# 36

## ధీరత

**కుం**భయుగమున మా గురుపరంపరను చేరుటకు, మా బృందముతో చేతులు కలిపి జగత్కళ్యాణ కార్యములు నిర్వర్తించుటకు అవకాశము మెండు. ఎవరైతే తనయందు ఈ క్రింద తెలిపిన లక్షణములను వికసింప చేసుకోగలరో, వారు మా కార్యక్రమమందలి స్వల్ప భాగమును నిర్వర్తించుటకు అర్హతను సంపాదించుకొనగలరు. ఈ క్రింద తెలిపిన లక్షణములన్నియు వికసించుట వలన మాత్రమే, అట్టి అర్హత లభించును.

*1) పరిపూర్ణ బాధ్యతతో వైద్యము చేయుట;*

*2) ధర్మజ్ఞానము గలిగి, విషమ పరిస్థితులయందు ధర్మనిర్ణయము చేయగలుగుట;*

*3) పవిత్ర గ్రంథములను వివరించుట, బోధించుట;*

*4) ఆచరణాత్మకముగ యోగజీవనమును నిర్వర్తించుచూ యోగవిద్య నభ్యసింపజేయుట;*

**5) *సృజనాత్మక శక్తితో, నిర్మాణాత్మకమగు సంఘసేవా కార్యక్రమములను నిర్వర్తించుట.***

బాధ్యతపడుటకు భయపడువారు, సంకోచించువారు, సందేహ పడువారు యోగమార్గమునకు అనర్హులు. బాధ్యతలను ఉత్సాహముగ స్వీకరించి, నిర్వర్తించి, సఫలీకృతులగు ధీరులే యోగవిద్యను ఆకళింపు చేసుకొని ఉత్తీర్ణులు కాగలరు. ధీరత మీకును, మాకును మధ్య సూత్రము వంటిది. ధీరతయే సమస్త విజయములకు కారణము.



# 37

## వైకుంఠపాళి

**జీ**వితమను వైకుంఠపాళి క్రీడయందు నిచ్చెన లెక్కుట, సర్ప ముఖమున పడుట సామాన్యము. కాని, ఉత్సాహము నొదలక ముందుకు సాగుట యొక్కటియే క్రీడయందు పరమపదము చేర్చును. ఉత్సాహము, స్ఫూర్తి, ఆశాభావము, జీవుని నడిపించు త్రిశక్తులు. సర్పముఖమున బడిన క్రీడాకారుడు ఒక క్షణము నిరుత్సాహ పడిననూ, మరుక్షణము ముందుకు సాగుచున్నాడు కదా! చతికిలబడి దుఃఖించుట లేదు కదా! నిచ్చెన లెక్కుచున్నప్పుడు కూడా తాను సర్ప ముఖమున పడు అవకాశముగలదని గుర్తించుచునే సాగుచున్నాడు కదా! అట్లే మానవ జీవితమున శ్రీకైవల్య పదమును చేరుటకు సాధన చేయు సాధకుడు కూడా, నిరుత్సాహము చెందకుండా స్ఫూర్తితో ముందుకు సాగవలెను. పరమపదమును చేరువరకూ విశ్రమింప రాదు. క్రీడయందు విశ్రమించుట, వైదొలగుట అవహేళనకు అవకాశము కలిగించును.

మేమందరమూ మీవలెనే అట్టి క్రీడను నిర్వర్తించి, పరమ

పదమును చేరి, మీరునూ అట్లే తరణము చెందవలెనని ఆకాంక్షించు జ్యేష్ఠ సోదరులము. విశ్రమించుటకన్నా శ్రమించుట యందు శ్రద్ధ కలిగియుండుడు. సత్సంకల్పములను మనస్సుయందు సృజింపుడు. వాటిని భూమిపై అవతరింపజేయుడు. నిత్యమూ మీకు స్ఫూర్తి నందించుటకు మేమందరమూ సంసిద్ధులమైయున్నాము. ఎప్పటి కప్పుడు హృదయమును నిర్మలముగా నుంచుకొనుటకు శ్రద్ధ వహించుడు. మా పిలుపునందుకొనుటకు అది ఒక్కటియే ప్రాతిపదిక. మీకు శుభములు కలుగు గాక!



38

## సేవా సూక్ష్మము

సామాన్యులను అశ్రద్ధ చేయకుము. మితిమీరిన సౌకర్యము లను కోరువారిని ఎక్కువగ పట్టించుకొనకుము. మొదటి తెగవారు తెగపడి సంఘమున ఆర్జనము చేయక, చేయలేక యుందురు. రెండవవారు వారి స్థితిగతుల నుపయోగించుకొని రకరకములైన యుక్తులతో జీవింపజూతురు. మొదటివారికి సహాయమవసరము. రెండవతెగవారు వారికి వారే సహాయము చేసుకొందురు కనుక మీ అవసరముండదు. ఇది తెలిసి మసలుట నీయందు సాధు జీవన మును పెంచును. అహంకారులకు చేయు సహాయము నిరర్థకము, నిష్ఫలము, దుఃఖహేతువు కూడ.

ఒకానొక పుణ్య క్షేత్రమున మేమెరిగిన సాధువు ఒకడున్నాడు. అతడు వందల సంవత్సరములనుండి క్షేత్రమునకు వచ్చు సామాన్యు లను గుర్తించి స్వచ్ఛందముగ వారికి వలసిన సహాయము చేయు చుండును. మరికొందరికి సహాయమవసరమైనను చేయడు. అది గమనించిన తోటి సాధువొకడు “కోరినవారికి చేయక కోరనివారికి

చేతువేమి?" అని అడిగెను. దానికి సాధువిట్లు సమాధాన మిచ్చెను. "కోరినవారు సౌకర్యములను కోరుచున్నారు. యాత్రికులకు దైవము ముఖ్యముకాని తిండి, పడక కాదు కదా! వారు సౌకర్యకాములు. తిండి, పడక కోరువారికి నేను సాయము చేయను. దైవమును కోరి వచ్చినవారు తిండికి, పడకకు లెక్కచేయరు. కావున వారికి సౌకర్యము లేర్పరచుదును. మరియొక విశేషమున్నది. కేవలము దైవమును కోరి వచ్చు సామాన్యులలో అప్పుడప్పుడు మహాత్ములు కూడ చనుదెంతురు. కాబట్టి సామాన్యుల సేవనమే తృప్తి, ఆత్మానందము కలిగించును. నీవును అట్లే చేయుము" అని తెలిపెను.

## 39

# వసంతము

వసంతము విసుగుదల, చిరాకు, అలసటలను పారద్రోలి ఉత్సాహమునకు, ఆనందమునకు తెర ఎత్తును. వసంతమున చైతన్యము విద్యుత్ ప్రవాహమువలె జీవులను మేలుకొలిపి చైతన్య వంతులను చేయును. ఉన్నతోన్నతమైన భావములను ఆవిష్కరించును. భగవత్‌తత్త్వము పూర్ణముగ ప్రతి అణువునందును వసించు సమయమే వసంతము. జీవకోటి అంతయు శిశిరము నుండి వసంత మునకు ఎదురు చూచుచుండును. వేలాది సంవత్సరముల నుండి మహత్తర మైన మరియు చైతన్యవంతమైన ఘట్టములు భూమిపై వసంతము నందే జరిగినవి.

వసంతము భూమికే నవచైతన్యము ప్రసాదించును. వసంత ఋతువున మొదటి తొమ్మిది రోజులు ప్రత్యేక దీక్షను వహించుటకు అనుకూలములు. ఇవియే వసంత నవరాత్రులు. అటుపై యాభై రోజులు ఈ దీక్షను కొనసాగించిన వారికి సంవత్సర మంతయును సరిపడ చైతన్యము వారియందు స్థిరపడును. వసంత ఋతువు మొత్తము సాధకులు క్రమబద్ధమైన జీవితమును గడుపవలెనని మా ఆకాంక్ష!

# 40

## నీరు

పరిశుద్ధ జీవనమునకు పవిత్రమైన నీరు ఎంతో ముఖ్యము. నీటి పవిత్రత దేహమునకు, మనస్సునకు కూడ పవిత్రత కలిగించ గలదు. ఈ విషయమును మానవజాతి అశ్రద్ధ వహించి యున్నారు. నీటిని రకరకములైన రసాయనములతో శుద్ధి చేసుకొనుట పరిపాటి అయినది. నిజమునకు అట్లు చేయుటలో నీటియందు సహజముగ గల రసములు అదృశ్యమగును. నీటిని మరిగించి త్రాగుట ఆరోగ్యకర మని మరికొందరి భావన. మరిగించిన నీటియందు కొన్ని జీవకణ ములు మరణించును. నిజమునకు జీవము నీరే! దానిని మరిగించి నపుడు కొన్ని సూక్ష్మక్రిములు నశించుటతో పాటు, ఆ నీరు చల్లార్చిన సమయమున కొన్ని చచ్చిన కణములు వాతావరణము నుండి ఆకర్షింపబడును. మరిగించి, చల్లార్చిన వెనుక త్రాగిన నీరు మెదడును మందముగ తయారుచేయగలదని మా హెచ్చరిక. మరిగించిన నీరు త్రాగు అభ్యాసము కలవారు ఆ నీటిని వేడిగనే త్రాగవలెను.

నీరు దాహము తీర్చుటయే కాక ప్రాణశక్తిని కూడ పెంపొం

దించును. తీవ్రమైన గాయములు కూడ పవిత్రమైన నీటిలో ముంచి నపుడు నయమగుట మేమెరిగిన సత్యము. పవిత్ర జలమునందు పటిష్ఠమైన ఔషధ బలము కలదు. మమ్మనుసరించు బృందములు నీరు విషయమున అత్యంత భక్తిశ్రద్ధలు కలిగి యుండవలెను. నీటి వాడకము విషయమున పై మెలకువలను అనుసరించి ఆరోగ్య వంతులుగ నుండవలెను.



## 41

## అహంకార వలయము

**మా** బృందమునుండి సమాజ శ్రేయస్సుకై, సంఘమున దేహము ధరించు మహాత్ముడు రకరకముల కష్టనష్టములకు గురి అగును. మొసళ్ళ కోనేటిలో ప్రవేశించినట్లు అతని జీవితము నడచును. సర్వమునకు సిద్ధమై పరహితబుద్ధితో త్యాగనిరతితో మా బృంద సభ్యుడు భౌతిక శరీరమును గొనుటకు సంసిద్ధుడగును. నీటియందలి ఈ మొసళ్ళు సంఘమునందలి అహంకారులు. అహంకారము, ధనము ఈ అహంకారులను క్రూరులుగ కూడ తయారుచేయుచున్నది. పరికించి చూడగ ఈ క్రూరత్వము పదవులను, అధికారమును, ధనమును అంటిపెట్టుకొని యున్నట్లు గోచరించును. వీరి వలన సంఘమున ఎట్టి శ్రేయోదాయకమైన కార్యములు నెరవేరవు. అహంకారి తనకు తానే శత్రువు. ఇతరులకు ఉపయోగపడు పనులు అతని వలన జరుగవు. అతని భావనా సముదాయ మంతయు అతని మేలుకొఱకే పని చేయుచుండును. అందరి మేలును కోరుచున్నా మనుచు తమ మేలును పెంపొందించు కొందురు. కట్టలు తెగిన అహంకారముతో తమకందినంత మేర జీవులను, ప్రదేశములను, దేశములను కబళింతురు. ఆతురతతో సమస్తమును, కబళించుటకు వీరు చేయు యత్నము వెనుక మిక్కుటమైన భీతి యున్నది.

అహంకారినెట్లు గుర్తించవలెనో తెలుసుకొనుము. అతడు ఎట్టి సలహాలను పాటింపడు. ఏదియు తన తప్పుని ఒప్పుకొనడు. తానేమి చేసినను ఒప్పే, తప్పు ఇతరులది. ఇట్టి అహంకారులను గుర్తించి వారినుండి తప్పించుకొని పనులు చేసుకొనుటయే సజ్జనుల కర్తవ్యము.

కారణము లేకయే మా బృందసభ్యుని అహంకారులు ద్వేషింతురు. అవమానింపజూతురు. అతడు చేయు నిర్మలమైన బోధనలను అవహేళన చేయుదురు. అతడు వెలుగునకు ప్రతినిధి కావున తెలియకయే వారికి అతని యందు భయమేర్పడి ఆ భయము ద్వేషముగ మారును. అతని ఉనికి వారికి అసౌకర్య మనిపించును. సంఘమున అతని పెరుగుదల వారి ఈర్ష్యను రగుల్కొలుపును. అతనిని (మా సోదరుని) తమ వానిగ చేసుకొనుటకు ప్రయత్నింతురు. కుదరనిచో కష్టపెట్టుదురు. ఇట్టి అహంకారులు సంఘమున పెరుగకుండుటకు విద్యాలయములే సరియైన పరిష్కారములు. అధ్యాపకులు నిరహంకారులై విద్యార్థులను నిరహంకారులుగ చిన్నతనము నుండియు తయారుచేయవలెను. పిల్లలకు అహంకారము వలన కలుగు కష్టనష్టములను తెలియజేసి, సంఘమున అహంకారులను గుర్తించు తెలివినిచ్చి కాపాడవలెను.

ప్రకృతి నిర్వర్తించుచున్న రసాయనమునకు సంబంధించిన వృక్షశాస్త్రము, జంతుశాస్త్రము, మానవ నిర్మాణ శాస్త్రము చిన్నతనము నుండి బోధించి వినయవంతులను చేయవలెను. పిల్లలను స్వంత ముగ ఆలోచించు అవకాశమును వీలున్నంత పెంపొందింపవలెను.

# 42

## స్వయంకృతము

**జీ**వితమున క్రమశిక్షణ ఎవరికీయవలెను? తనకు తానే ఇచ్చుకొనవలెను. దివ్య బోధనలు ఎందుకొఱకు? తనకొఱకే కాని యితరుల కొఱకు కాదు. మోసమును, దగాను ఎట్లు ఎదుర్కొనవలెను? వాని నాకర్షించు తత్త్వము తనలోనే వున్నదని, అది ఆశ యని గుర్తించి నిర్మూలించుకొనవలెను. ఇతరులు తన యెడల కఠినముగ ఎందుకు ప్రవర్తించుచున్నారు? తాను యితరుల యెడల ప్రవర్తించు తీరును బట్టి.

గౌరవించినవారు గౌరవింపబడుదురు. దూషించినవారు దూషింపబడుదురు. ఇతరులను ఉద్దేశించి నీవేమి భావించినను, మాట్లాడినను, చేసినను– అదే తీరులో నిన్ను గూర్చిన భావన, భాషణము, చేత యుండును. ఇది సృష్టి శాస్త్రము. దీనిని మరువకుము. సమస్తమును సహించుటతో నవజీవనమునకు పునాది వేయుము. సహించుట, భరించుట, బాధ్యత వహించుట– తప్పక నీ పురోగతికి తోడ్పడగలవు.

# 43

## సలహా సూక్తము

మీకొక సలహా! ఎవ్వరికిని సలహాల నీయవద్దు- అడగనిచో అసలీయ వద్దు. అడిగిన వెంటనే కూడ సలహా నీయవద్దు. సాధారణ ముగ సలహాల నడుగువారు వినుదురేగాని పాటించరు. కొందరికి సలహాలను కోరుట పరిపాటి. తెలిసినది ఆచరించువానికి సందేహము లెక్కువ కలుగవు. వారికి సమాధానము ఎప్పటికప్పుడు దొరకుచునే యుండును. ఆచరింపని వారికే సందేహము లెక్కువ. పదిమందిని పదిరకములుగ సలహాలు నడిగి పుచ్చుకొని దేనిని ఆచరింపకుండుట వీరి స్వభావముగ నుండును.

నిజమునకు సలహా నిచ్చుటకు వలసిన చేతన కూడ ఇచ్చు వారిలో సాధారణముగ నుండదు. సలహా నిచ్చువాడు, సలహాను పుచ్చుకొనువాని పరిస్థితులతో ఏకీభావము చెంది, లోతుపాతులు గ్రహించి, కొంతవరకు సహవేదన ననుభవించి, తన బుద్ధిలోకములో మునిగి, పరిష్కారము స్ఫురించగ ప్రేమానురాగములతో ఆ పరిష్కార మును కోరినవాని కీయవలెను. అట్లుకానిచో ఇచ్చు పరిష్కారము కాకతాళీయమగును. బాధ్యతలేనిదగును. కావున త్వరపడి సలహాల నీయకుము. అది అమితమైన బాధ్యతతో కూడిన పని.

## 44

## పరహితము - మోక్షము

ఇద్దరు నావికులు పడవలో పోవుచుండగ పడవకు చిల్లుపడి మునిగెను. ఇద్దరును సముద్రములో రోజుల తరబడి యీదుచూ, తేలుచూ ఒక జనసంచారము లేని ద్వీపమును చేరిరి. ఆకలిదప్పులతో, భయముతో ప్రపంచమునకు దూరమై ప్రపంచము కొఱకై తపించు చుండిరి. కొన్ని దినములకు ఒక ఓడ అటుపోవుచుండగ నానా విధముల శ్రమపడి ఓడవారిని ఆకర్షించిరి. ఓడను ద్వీపమునకు మరలించి వారిద్దరిని ఓడలోనికి ఎక్కించుకొని స్వదేశమేగిరి. వారెంతయో ఆనందోత్సాహముతో తమ వారితో గడిపిన వెనుక మరల స్వచ్ఛందముగ ఆ ద్వీపమున కేగిరి. అచటనొక దీప స్తంభ మును (Light house) ఏర్పరచి వచ్చు పోవు ఓడలకు సూచన లిచ్చుచు, సముద్రములోని రాళ్ళచే ఓడలు పగలకుండ కాపాడు చుండిరి. ఇదివరకు ఆ ద్వీపమున వారు దుఃఖపూరితులై సహాయము కొఱకు తపనతో ఎదురుచూచుచుండిరి. ఇప్పుడు అదే ద్వీపమున సంతోషముతో పలురకములుగ ప్రయాణము చేయువారికి తగు సూచనలు, సహకారము అందించుచు ఆనందముగ జీవించుచుండిరి. ఇదివరకు ఆ ద్వీపమున దుఃఖపడుటకును, ఇప్పుడు అదే ద్వీపమున

ఆనందముగ నుండుటకును ఏమి కారణము? ఇదివరకు వారు ఒంటరులు, అనాథలు, ఇతర ప్రపంచముతో సంబంధము లేక అలమటించిన వారు. ఇపుడు వారు ఒంటరులు కారు, అనాథలు కారు. ఇతర ప్రపంచముతో సత్సంబంధములు ఏర్పరచుకొని పరహిత కార్యములను చేయుచున్నారు.

మీ స్థితియు దాదాపుగ ద్వీపమున వేరుపడిన వారి స్థితియే. అందులకే భూమి జీవనము మీకు దుఃఖపూరితముగ గోచరించి, మోక్షము! మోక్షము! అని కేకలు పెట్టుదురు. దివ్య లోకములతో సంబంధము ఏర్పడినచో, యిక మోక్షమును గూర్చిన ఏడుపు యుండదు. ఇచ్చటనే దివ్యకార్యములను నిర్వర్తించుచూ ఆనందించ గలరు.

మేము ప్రస్తుతము చేయుచున్నదదియే! మీరును ఈ మార్గమును ఎన్నుకొనవచ్చును.

## 45

## శుభము - శాంతి

**శాం**తి కావలెనన్నచో సహకరించుట నేర్చుకొనవలెను. సహకరించుట చేతకానివారికి శాంతి లభింపదు. ఇతరులకు శుభము జరిగినచో తనకు జరిగినట్లుగ ఆనందించవలెను. ఈర్ష్యపడుట, దుఃఖపడుట నీయందశాంతిని పెంచును. ఇతరులకు అశుభము కలిగి నప్పుడు సహవేదన ననుభవించి, తోడ్పాటు గావించి శక్తికొలది ఓదార్చుము. నీయందు శాంతి పెరుగును. రవ్వంతైనను ఇతరులకు కష్టనష్టములు కోరుకొనకుము. శుభమునే కోరుము.

పై తెలిపిన విషయములు ప్రాథమికములే. చిన్నతనము నుండి ఎన్నియో సార్లు వినియుందురు. కాని పై విధముగ ఎన్నిసార్లు ఆచరించితివో చూచుకొనుము. చిన్న చిన్న నీతి పాఠములను చక్కగ నేర్చువాడు బుద్ధిమంతుడు. ఇవి నేర్వని పెద్దవారు చిన్నవారే. సంఘ జీవనమున ప్రస్తుతము ఈర్ష్య, అసూయ, పోటీపడు తత్త్వము ఎక్కువగ నున్నది. అశాంతికి అవకాశమెక్కువ. కాని పై తెలిపిన ప్రాథమిక సూత్రములను మరువక అనుసరించు వారికి శాంతికి కొదవ యుండదు. మహాత్ములందరూ యిట్లాచరించి చూపినవారే.

# 46

## సూక్తులు

మూర్ఖునితో వాదింపకుము. బాధ్యత లేనివానియందు మౌనము వహింపుము. నీ విచక్షణాజ్ఞానమును ఇతరుల అభిప్రాయములనే మేఘములతో మరగుపరచుకొనకుము. అవగాహన లేనివారితో దీర్ఘ సంభాషణములు చేయకుము. పై సూత్రములను పాటించినచో నీవు అవమానింపబడవు.

పాండిత్యము ప్రదర్శించువారి ఎడల నిశ్శబ్దమును పాటించుము. పాండిత్యప్రకర్ష వెనుక గల, వారి ఆవేదనను అవగాహన చేసుకొనుటకు ప్రయత్నింపుము. అతిగ మాట్లాడినవారి విషయమున కూడ, ఆ జీవుల ఆవేదనను గుర్తింపుము. వీరందరికిని కావలసిన దేదియోయుండి బైటికి మరియొకటి ఏదియో పలుకుచుందురు.

జీవులను గుర్తించి, వారి నర్తనములను గమనించుట దైనందిన చర్యగ ఏర్పరచుకొనుము. ఎక్కువమంది లోతులేని బావివంటి వారే. లోతుగల బావులయందు నీరు నిశ్చలముగ నుండును. అట్టివారి సాన్నిధ్యమున నీవు కూడ అప్రయత్నముగ నిశ్చలుడవగుదువు.

## 47

## వస్తు సంపద

**వ**స్తుసంపదను పోగుచేసుకొనుటలో గల అపాయమును ఏ విద్యాలయములయందును బోధించుట లేదు. అందరును నీతులు బోధింతురు కాని, వస్తువులను పోగువేసుకొను అభ్యాసము ఎంత దురవస్థను కలిగించునో తెలుపరు. అస్తేయము (ఒకరి సంపదల నాశింపకుండుట), అపరిగ్రహము అను విలువైన విషయములు చిన్నతనముననే బోధింపవలెను. "తాతకు కుర్చీ యున్నది, నాకేది?" అను భావము ఏర్పడిన మనుమడు సన్మార్గమున పయనించుట లేదని తెలియవలెను. వస్తువులను కోరు తెలివి క్రమశః వికసింపక కుంచించుకొనిపోవును. హక్కులను కోరు పసివారు బాధ్యతలయందు అప్రమత్తులై యుండలేరు.

ఈ కాలమున వస్తు ఉత్పత్తి విపరీతముగ నున్నది. వస్తువులను విపరీతముగ జన సామాన్యులకు అంటగట్టుచున్నారు. పనికిరాని వస్తువులన్నియు కూడ పనికివచ్చు వస్తువులని నమ్మించి, ఆకర్షించి, కామోద్రిక్తులను చేయుచున్నారు. వ్యాపారము శ్రేయోదాయకము కాక ప్రజా పీడితముగ మార్పు చెందినది. ఇది కలి ప్రభావము.

విపరీతమైన వస్తు ఉత్పత్తి యున్నను, వాని పంపిణీ అధ్వాన్న ముగ నున్నది. కొన్ని దేశములు వస్తువులతో క్రుగ్గి యున్నవి. మరికొన్ని దేశములు కనీసపు వస్తువులు లేక బాధపడుచున్నవి. అతివృష్టి, అనావృష్టిగ ఆర్థిక వ్యవస్థలు సమస్యలలో చిక్కుకొని యున్నవి.

ఇట్టి సమయమున విచక్షణాపూరితమైన విద్యను అందించు టయే ప్రధానము. వస్తుసామగ్రిని అనాలోచితముగ పోగు వేసు కొనుటలో గల అజ్ఞానమును చిన్నతనము నుండి పోగొట్టినచో ముందు తరములు బాగుండును. విద్యాలయములలో తగు విధముగ ఇట్టి విద్యలను ప్రోత్సహించవలెను. మిక్కుటముగ పోగువేసుకొనుట ఆధ్యాత్మికమార్గమున నేరముగ గుర్తింపబడును. అప్రయత్నముగ సంపద పోగు అయినచో సద్వినియోగము చేయుచు జీవించుము. లేనిచో సంపద నిన్ను మానవత్వము నుండి పశుత్వములోనికి దిగ జార్చగలదు.

# 48

## మాయ

సాధనలో లోతులు పొందినవారు కూడ కష్ట సమయముల యందు ఒంటరితనమనుభవింతురు. సద్గురు బోధనలన్నీ అసత్యము లనిపించును. గురువులు గురుపరంపర తాము ఏర్పరచుకొన్నదే కాని నిజమునకు లేవనిపించును. రకరకములైన అభిప్రాయములు గడ్డు సమయములలో క్రమ్ముకొని తెలిసిన విషయమును (జ్ఞానమును) కప్పివేయును. తన కెవ్వరూ లేరని, తనవారెవ్వరూ లేరని; బోధనలు, ప్రార్థనలు అక్కరకు రావని- దివ్య సహాయము వట్టిమాట యని- అంతయూ శుష్క వేదాంతమని అనిపించును.

పై భావములు కలుగుటకు కారణము మాయ. మాయావరణ ములో జీవులుండుటచే మాయ బలపడినప్పుడెల్ల జీవుడు నిస్సహాయు డిగ బాధపడును. మాయ పలుచబడినపుడు తాను శక్తివంతుడుగ భావించును. మాయ చాల విచిత్రముగ మెదడును స్పృశించగలదు. యుగయుగముల నుండి మాయయే సృష్టిని నడిపించుచున్నది. మాయకున్న అనుభవము జీవునికి లేదు. మాయలో నున్నవానికి

తనను మాయ కప్పినదని తెలియకపోవుటయే మాయ. ఇది మాయాదేవి నేర్పరితనము. మాయకు నమస్కరించి దారి చూపు మనినచో దారి చూపగలదు. తెలిసి మాయలో బడుటకన్న సృష్టిలో అద్భుతమేమియును లేదు.

## 49

## ప్రణాళిక - ప్రదేశము

ప్రణాళిక, ప్రదేశముకన్న ముఖ్యము. ఒక ప్రదేశమున నీవు దివ్య ప్రణాళికను చాలకాలముగ నిర్వర్తించుచున్నావనుకొనుము. అంతకన్న మిన్నగ మరియొక ప్రదేశమున నిర్వర్తింపబడుటకు అవకాశమున్నచో ప్రదేశమును మార్చుటకు సందేహింపకుము. ప్రణాళికనుబట్టి ప్రదేశముగాని, ప్రదేశమును బట్టి ప్రణాళిక కాదు. ప్రణాళికను, ప్రదేశవ్యామోహమున కుదింపవద్దు. భౌతికమునకు, పదార్థమునకు లోబడిన చైతన్యము కలవారు ప్రదేశములకు కట్టుబడి యుందురు. ఇది కూడ ఒక బంధనమే. ప్రదేశబంధనము కన్న ప్రణాళికబంధనము మేలు. అందులకే భూగోళమునందలి మా ఆశ్రమములు సూక్ష్మ పదార్థ నిర్మితములై ప్రణాళికను బట్టి మారు చుండును.

పూర్వకాలమున యతులు, ఋషులు, సంచరించు సన్యాసులు మూడు రాత్రులకు మించి ఒక చోట నుండకపోవుటకు కారణ మిదియే. పదార్థమునకు బంధించు గుణము సహజము. చైతన్యము నకు ప్రవహించు గుణము సహజము. జీవుడు చైతన్య స్వరూపుడు గనుక జీవన ప్రయాణమునకు అడ్డము కలిగించు పదార్థములను విసర్జించుచూ ముందుకు సాగవలెను.

## 50

## సత్యము - అతీతము

**వ్య**క్తి, కుటుంబము, వివిధ సంఘములు, జాతి, దేశములు అన్నియును శాంతి కొరకే పాటుపడుచున్నవి. జీవనమును మెరుగు పరుచుకొనుటకై కృషి సల్పుచున్నవి. తమ బాగుకు, తమ శాంతికి చేయు ప్రయత్నములు ఇతరులపై ఎట్టి ప్రభావమును చూపుచున్నవో గమనింపక పోవుట వలన తమ శాంతి, తమ బాగు అను ప్రయోజనములకు దెబ్బ తగులుచున్నది. మన మేలు ఇంకొకరికి కీడు కారాదు. మనము కోరు శాంతి ఇతరులకశాంతి కలిగింపరాదు.

అందరికిని ఒకే రకపు మేలు గాని, శాంతి గాని అవసరమై ఉండదు. కొందరికి ఆరోగ్యశాంతి కావలెను. కొందరికి ధనశాంతి, కొందరికి కీర్తి శాంతి, ఇంకొందరికి ఆర్జన శాంతి. ఏ కొందరికో కేవలము ప్రశాంతి. ఈ కాలమున అగ్రదేశములవారు అధికారము కొరకు, ఆర్థిక ఆధిపత్యము కొరకు ఇతరులకశాంతి కలిగించు చున్నారు. ఇది అనాదిగా జాతిలో గల జాడ్యమే. ప్రపంచమున వివిధ జాతులు గలవు. వారికి గల అవగాహన వివిధము. వారి సిద్ధాంత

ములు వివిధము. వారి వారి అనుభవములు వివిధములు. ఇందు ఏ ఒక్కటి ఇతరులకు అంగీకారము కాదు. అన్నింటిని సమన్వయించుకొనగల స్ఫూర్తియే పరిష్కారము. ఇది మతములకు, సిద్ధాంతములకు అతీతమైన సత్యము.

# 51

## ఉత్సాహము

నిరాశ, నిస్పృహ అభివృద్ధికి చేటని తెలియుము. అట్టివానికి సందేహము మిత్రుడుగ నుండును. సందేహము నిర్మాణాత్మకపు భావములను, చేతలను నశింపజేయును. పై మూడు అవగుణముల కారణముగ మానవునకు భయమేర్పడును. భయము వలన జీవితపు సుఖము కోల్పోవుట జరుగును.

నిరాశ, నిస్పృహ, సందేహము, భయము అను అవగుణము లకు కారణమేమని ప్రశ్నించుకొనుము. ఆ కారణములను పరిశీలిం చుము. పరిశీలనము నిష్పాక్షికముగ చేయుటకు ప్రయత్నించుము. అపుడా కారణము లన్నియు భ్రాంతి రూపములుగ గోచరింపగలవు. భయపడుటకు నిజమైన కారణము లేదని తెలియును. మరల ప్రయత్నము అభివృద్ధికై కొనసాగు ఉత్సాహము కలుగును. ఆ ఉత్సాహమే శుభంకరమైన నాంది.

ఉత్సాహమే బలము. ఉత్సాహవంతునికి ధైర్యమేర్పడును. అట్టి ధైర్యముతో కష్టముల నెదుర్కొని కార్యవంతులై సిద్ధిని పొందెదరు. వృద్ధియే మార్గమున పురోగమనము.

52

## సంఘములు - సిద్ధాంతములు

**మా**నవ సంఘమున అనేక సంఘములున్నవి. అనేక ఆధ్యాత్మిక సంఘములు కూడ నున్నవి. ఈ ఆధ్యాత్మిక సంఘముల ఆశయము లన్నియు ఒక్కటియే. వీరందరు కోరునది దివ్యజీవనమే. వీరవలంబించు మార్గములు మాత్రము వివిధములు. మార్గమున నడచు సభ్యులు దివ్యజీవనము కొరకు చేయు ప్రయత్నములో కొన్ని సిద్ధాంతములకు లోబడుదురు. సిద్ధాంతములచే బంధింప బడినవారికి దివ్యభావన కన్న తమ సిద్ధాంతములను ప్రపంచమున కెక్కించుటకు ఉత్సాహమెక్కువగును. తత్కారణముగ రజోగుణ ప్రేరితులై ఇతర సిద్ధాంతములను నిరసించుచు మరింత బంధనము కలిగించుకొనుచుందురు. క్రమముగ దివ్యత్వము మరుగై సిద్ధాంతమే మిగులును. ఇట్లు సిద్ధాంతములందు చిక్కుకొనువారు కోటానుకోట్లు కలరు. వీరందరి కిని వారి వారి సంఘములు ప్రాణతుల్యములు. ఇతర సంఘములు తుచ్ఛములు, అజ్ఞానపూరితములు. తమ సిద్ధాంతమందు రాగమెంతయుండునో, ఇతర సిద్ధాంతముల యందు

ద్వేషమంత యుండును. పై విధముగ రాగద్వేషములచే పీడింపబడుచు, తాము దైవజ్ఞులమని అహంకరించుచు, సంఘమున అలజడి కలిగించుచుందురు. నిజమగు దివ్యజీవనమున పరస్పరత్వము, సహాయ సహకారములు, ప్రశాంతత, సమర్థత గోచరించును.

53

## నిరసించుట - ప్రేమించుట

మనుష్యులను ద్వేషించువారు మహత్తర కార్యములు చేయలేరు. ఎల్లప్పుడును మానవజాతిని నిరసించుచు మాటాడు వక్తలు, ప్రవక్తలు చాలామంది కలరు. నిరసించుట వలన ఈ వక్తలు, ప్రవక్తలు ఏ మహత్కార్యమును సాధింపలేరు. కేవలము సిద్ధాంతవాదులుగ చరిత్రపుటలలో మిగిలిపోయినారు. జీవులను నిరసించుట సిగ్గుచేటు. తమలోని ద్వేషభావమునే, వక్తలందరును జీవులపై నిరసన భావముగ ప్రకటింతురు.

నిరసించుటకన్న ప్రేమించుట మిన్న. జీవులను ప్రేమించువారు జీవుల సమస్యలకు పరిష్కారము చూపుదురు. సహకారము నందింతురు. జీవుల పురోగతికి తోడ్పడుదురు. వీరు పరస్పరత్వమును నేర్పుదురు. పరస్పరత్వము పునాదిగ ఏకత్వపు వైభవమును ఆవిష్కరింతురు. ఏకత్వము, పరస్పరత్వము, ఒకరిపై నొకరికి విశ్వాసము కారణముగ సహాయ సహకారముల నందించుకొనుచు మహత్తర కార్యములు చేయుదురు.

కేవలము ప్రేమ, పరస్పరత్వము ఆధారముగనే కోతులు సముద్రముపై వంతెనను నిర్మాణము చేసినవి. ప్రగాఢమైన విశ్వాసము, పరస్పర ప్రేమ, సహాయ సహకారములు, రామునియం దేకత్వము వంతెనకు పునాదిరాళ్ళుగ నిలచినవి. దుర్ఘట కార్యములు కూడ పై పునాదుల వలన సాధింపబడినవి.

## 54

## కుష్ఠువ్యాధి - నివారణము

నిర్మలమైన మనస్సే శుద్ధ చైతన్యమును ఆవిష్కరింపగలదు, ప్రకటింప గలదు, ప్రశాంతతనందించ గలదు. దీనిని సాధించుటే సూటియైన దారి. దీనిని సాధింపక ఎన్ని సాధించినను సాధకుడు చిక్కులు పడును. రజోగుణము, తమోగుణము ఈ సాధన వలననే ఉపశమింపబడగలవు, సమన్వయింపబడగలవు కూడ. సిద్ధికి ఇది దగ్గర దారి. కాలము వృధాచేయక, మనసునందు కలుగుచున్న వికారములను ఆత్మ పరిశీలనముతో ప్రక్కకునెట్టి, నిర్మల భావములను, భాషను, చేతను ప్రకటించుచుండుము.

అలసత్వము, సోమరితనము, నిర్లక్ష్యము, అశ్రద్ధ, అతినిద్ర అజ్ఞానమను ఒకే ఊయలలో నిన్ను శాశ్వతముగ బంధింపగలవు. వానిని దరి చేరనీయకుము. అసూయ కుష్ఠురోగము వంటిది. శరీరమంతటను కుష్ఠు వ్యాపనము చెందునట్లుగ, అసూయ మనసులో మొలకెత్తి, దేహమంతను వ్యాపించి కంపరమెత్తించును. అసూయ వలన ఎందరో సాధకులు పతనము చెందిరి. అసూయ గలవానికి

జ్ఞానము హరింపబడి అహంకారము ఆవిర్భవించును. సర్వవిధముల సద్భావమే మానవునకు పరిష్కారము. ఇది తెలిసియు ఆచరించ కుండుట దురదృష్టము. ఆచరించుటయే అదృష్టము.

## 55

# కృషికర్మ

సహకారము, సోదరభావము ఉండవలెనని, ఇది కరవగు చున్నదని ప్రతి ఆధ్యాత్మిక సంస్థయందు సభ్యులు వాపోవుచుందురు. ఈ వాపోవుట తల వాచిపోవుట వరకు జరుగును. కాని పరిష్కారము మాత్రము లభింపదు. సహకారము, సోదరభావము కోరినంత మాత్రమున లభింపవు. మానవునికి మొదటినుండి కోరుటయందే ఆసక్తి గాని, కోరిన దానిని పొందుటకు వలసిన క్రమశిక్షణ, దీక్ష, మనోనియతి, వాఙ్నియతి ఉండవు. కోరినంత మాత్రమున ఏదియు లభింపదు. కోరిక ఫలించుటకు నిర్దిష్టమగు కార్య క్రమమును శ్రద్ధతో నిర్వర్తింపవలెను. అది చేయక ఊరక కోరి ఫలమేమి? శాంతి కావలెనని కోరుదురు. సంపద, సమృద్ధి కావలెనని కోరుదురు. కీర్తి కావలెనని కోరుదురు. ఆరోగ్యము కావలెనని కోరుదురు. మోక్షమును కూడ కోరుదురు. కోర్కెను తీవ్రము, తీవ్రతరము కూడ చేయుదురు. కోరిక తీవ్రతరమగుటచే ఉద్రిక్తత ఏర్పడును గాని, పరిష్కారము రాదు.

ఏమి కావలెనో తెలిసిన మానవుడు, దానినెట్లు పొందవలెనో తెలుసుకొనవలెను. తగువిధముగ తనను తాను నియంత్రించుకొనవలెను. క్రమశిక్షణ పాటించుచు ఆత్మ నియంత్రణకు లొంగియుండవలెను. నిర్వర్తింపవలసిన కర్తవ్యమును దీక్షతో దీర్ఘకాలము అనుసరించవలెను. సూర్యచంద్రాదులు, పంచభూతములు, సృష్టిలోని సమస్త ప్రజ్ఞలు ఇట్లు క్రతుబద్ధముగ జీవించుచున్నవి.

నిరంతర కృషి చిన్నతనమునుండి అభ్యాసము కావలెను. ఆ కృషి జీవితపు విలువలను గూర్చి ఉండవలెను. ఈ ప్రాథమిక సూత్రమునవలంబింపక ఏమి చేసినను నిష్ప్రయోజనము.

## 56

## సేవా సంస్థ - మూలసూత్రములు

స్వచ్ఛంద సేవా సంస్థలలో నిర్బంధమొక అపశ్రుతి. ఇట్టి సంస్థల యందు పరిశ్రమించుట స్వచ్ఛందముగ నుండవలెను. సహకారము గూడ స్వచ్ఛందమే. సహజీవనములు కూడ స్వచ్ఛంద ములై యుండవలెను. తెలిసినవారిని, పెద్దవారిని– తెలియనివారు, చిన్నవారు గౌరవించుట కూడ స్వచ్ఛందముగ సాగవలెను.

పెద్దవారనుకొనువారు చిన్నవారిపై అధికారము చెలాయించ రాదు. ఎవరును ఎవరిని నిర్బంధించరాదు. ఆత్మస్తుతి, పరనింద పనికిరాదు. ఉన్నతమైన భావములను సదా పెంపొందించుకొను చుండవలెను. విమర్శలు విషప్రయోగమువలె సంస్థను చెరచును. ఉన్నత భావములు ఆచరణాత్మకమైనచో, సభ్యుల ప్రజ్ఞ ఉత్తమ కక్ష్యలలో నిలచి, నిర్మలత్వము, ప్రశాంతత, వైభవము కలిగించును. విమర్శలు, సహాయ నిరాకరణము, మానసిక విముఖత సభ్యులను మురికి కూపములలోనికి కొనిపోవును.

సంస్థయందుగల సభ్యుడు తనయందు కలుగు భావములను ప్రతినిత్యము పరిశీలించుకొనుచుండవలెను. ఉన్నత భావములు ఆచరణాత్మకమైన జీవనము సాగుచున్న యెడ, ఆకసమునకేగు విహంగములవలె నిర్మలత్వమును, ప్రశాంతతను, తత్ఫలమైన ఆనంద మును, వైభవమును పొందుదురు. విమర్శలయందు జీవించుచున్నచో ఎలుకలవలె కలుగులలోనికి దూరి చీకటిగృహములుగ తమ జీవన మును భ్రష్టుకావించుకొందురు.



57

## మైత్రేయ సంఘము

**చీ**కటిదారిలో తోడుండిన ప్రయాణమునకు కొంత సుఖముండును. జీవితమున స్నేహితుడు కలవాడు అదృష్టవంతుడు. స్నేహమందరికిని లభ్యముకాదు. అదియొక సున్నితమైన సంబంధము. బంధము కాదు. బంధించినది స్నేహము కాదు.

చీకటిదారిలో ఎన్నో క్రూరమృగములు తారసిల్లును. వానిని దూరముగ నుంచవలెనన్నచో, భగభగ మండు కాగడావంటి స్నేహితుడుండవలెను. స్నేహమున ఒకరి కింకొకరు కాగడా. చీకటి దారిలో నిద్రా సమయమున ఒకరి కొకరు కాపలా. ప్రయాణమున ఒకరికొకరు తోడు.

జీవన ప్రయాణమున తోడుగ నడచు జీవుడున్నచో కష్టములు, సుఖములు పంచుకొనవచ్చును. ఒకరినొకరు ఓదార్చుకొనవచ్చును. ఒకరినొకరు సంతోషపెట్టవచ్చును. ఒకరినొకరు ప్రోత్సహించుకొనుచు ముందుకు సాగవచ్చును. ఒకరినొకరు కాపాడుకొనుటలో ప్రాణమును, మానమును, ధనమును లెక్కచేయరాదు. అదియే నిత్యమైన,

సత్యమైన, శాశ్వతమైన స్నేహము. అట్టి స్నేహితులు సమస్త లోకములను జయించగలరు. రామలక్ష్మణులు, కృష్ణార్జునులు అట్టివారే. నిజమగు గురుశిష్యులు గూడ అట్టివారే. మిత్రత్వము అత్యంత వైభవోపేతమైన సృష్టిసంపద. ఇది సాధించినవారు మైత్రేయ సంఘ సభ్యులగుదురు.



## 58

## అపౌరుషేయము

**అ**జ్ఞానమును, అంధ విశ్వాసములను, భీతిని పారద్రోలుట, జ్ఞానమును, సంకల్ప బలమును, ధీరతను పెంపొందించుట మా ప్రణాళికలోని అంశములు.

ప్రజ్ఞా వికాసములకు తోడ్పడు ప్రతి ప్రయత్నమునకు మేము తోడ్పడుదుము. తత్సంబంధమైన సంకల్పములను అదృశ్యముగ ప్రోత్సహింతుము. ఊహలను అపోహలను నిర్మూలించి, జీవులకు కర్తవ్యోన్ముఖులను చేయుట కూడ మా ప్రణాళికలో భాగము.

శ్రమకోర్చి పనిచేయువారికి సహకారమునందించి సంఘ జీవనమున వారికొక చక్కని ప్రణాళిక నేర్పరచి తీర్చిదిద్దుట తెరవెనుక నుండి నిర్వర్తించుచుందుము.

మాచే ఎన్నుకొనబడిన వారికి స్ఫూర్తిని కలిగించి వారి నుండి సనాతనమగు ధర్మమార్గమును జనజీవనమునకు అందించుట గూడ మా కర్తవ్యములలో ఒకటి.

అసామాన్యునివలె శక్తి సామర్థ్యములను గఱపి సామాన్య జీవనమున మా శిక్షితులు లోకహిత కార్యములను నిర్వర్తించుచుందురు. ఉత్తమోత్తమమైన సత్యము, ధర్మము అతి నిర్మలముగను, సామాన్యముగను, రహస్యముగను నిర్వర్తింపబడుట సృష్టియందలి ధర్మము. ఈ ధర్మమును పాటించుచు వేలాది సంవత్సరములు ప్రత్యేక గుర్తింపుకొఱకు కాక, లోకహితము కొఱకు నిర్వర్తించుట మా విధానము. మే మొనర్చునదంతయు అపౌరుషేయమే.



## 59

# మేలుకొలుపు

ఈ భూమి ఘనీభవించుట పరిపూర్తి అయి స్థూల పదార్థము పరిమితి వరకు ఏర్పడినది. ఇక పరిణామమే శరణ్యము. పరిణామమున పదార్థమందలి ప్రజ్ఞ మేల్కాంచును. అట్టి మేలుకొలుపే ప్రస్తుత కర్తవ్యము. నిర్విరామముగ భూమిపై గల సమస్తమును మేల్కొలుపు చునేయున్నాము. మేలుకొలుపు వినుచున్నవారు మేల్కాంచుచునే యున్నారు.కాని పూర్వాభ్యాసము వలన మరల నిద్రలోనికి చను చున్నారు. మేలుకొనియుండు అభ్యాసము చిరకాలము సాగవలెను. అపుడు నిద్రను కోరు స్వభావము అదృశ్యమగును.

ఎడారిని నందనవనము చేయుట ప్రస్తుత కర్తవ్యమని మైత్రేయసంఘ సభ్యులెరుగుదురు. తదాశయ సిద్ధికై అహోరాత్రములు కృషి జరుగుచునేయున్నది.



60

## గురుదక్షిణ

**అం**తః బహిః శుచికి పరమగురువు విలువ నిచ్చును.

చిన్న చిన్న పదములలో గంభీరమగు సత్యములను తెలిపినచో పరమగురువు ఆనందించును.

పదజాలముతో శ్రోతలను భ్రమింపజేయక సూటిగ అనుభవైక విషయమును బోధించిన పరమగురువు మెచ్చుకొనును. బోధనలు ఆచరణీయముగ నున్నచో మరింత సంతోషించును.

బోధనను సత్యదూరము కాకుండ జాగ్రత్తపడినచో పరమ గురువు సహకరించును.

బోధనయందు తెలిపినదానినే మరల మరల తెలుపుట తప్పనిసరి. విత్తనము మొలకెత్తుటకు, మొలకెత్తిన విత్తనము పెరుగు టకు మొక్క చుట్టును మరల మరల తోటమాలి త్రవ్వుచూ ఉండును గదా !

నిశితము, నిశ్చయము, నిర్మమము యగు బోధన సద్గురువు నకు యిచ్చు దక్షిణ యని తెలియుము.

**61**

## అద్భుతము

ఇతరుల హృదయములను స్పృశించి రంజింప చేయుటకు, అట్టి రంజనము దీర్ఘకాలము నిలచుటకు వలసిన సామర్థ్య మొక్కటియే. అది నిరాడంబరత. నిరాడంబరుడికి సమస్తము లొంగును. అతని నుండి ఇంద్రధనుస్సువలె అతి సుందరమైన కార్యములు వ్యక్తము కాగలవు. అవి సూటిగ హృదయమును తాకి ప్రచోదనమొనర్పగలవు. వ్యక్తిగత గుర్తింపునకు, సమాజపు గుర్తింపునకు పాటుపడువారు ఇంద్ర ధనుస్సువలె హృదయములను రంజింప చేయజాలరు. కేవలము భ్రమగొలిపి భ్రాంతి కలిగింతురు. భ్రమ, భ్రాంతి కారణముగ తాత్కాలికపు అద్భుతములు జరుగును. కాని నిర్మల కార్యము వలన అట్టి అద్భుతములు శాశ్వతముగ జరుగును. హృదయములను సన్మార్గమున మేల్కొల్పుటయే నిజమైన అద్భుతము.

62

## భయము - అభయము

భయమును పారద్రోలుట ఉపాధ్యాయుని ప్రథమ కర్తవ్యము. కరుడు కట్టిన విశ్వాసముల వలన భయమేర్పడగలదు. నమ్మినవారిని మోసగించుట వలన భయమేర్పడగలదు. అసత్యములాడుచు కర్తవ్యము నుండి తప్పించుకొనుచు జీవించుట వలన భయమేర్పడును. భయమునకు కారణము అంతర్ముఖమగు స్వభావమే. భయము ప్రజ్ఞాపతనమునకు కారణమగును.

భయపడువానికి కర్తవ్యమును అందించి దానిని నిరంతరము నిర్వర్తించుట నేర్పవలెను. కర్తవ్య నిర్వహణలో నిమగ్నమైనవానికి భయమదృశ్యమగును. భయముచే మ్రింగబడినవాడు కర్తవ్యమును నిర్వహింపలేడు. కావున ఉపాధ్యాయుడు తన వెంట అతని నుంచుకొని తనతోపాటుగ కర్తవ్యములు నిర్వర్తింపచేయుచు దాని యందలి సుఖమును అనుచరున కందించుచుండవలెను. కర్తవ్యోన్ముఖుడైనచో అనుచరుడు భయమును దాటగలడు. తాను కొంత ప్రయత్నించిన మరికొంత సహాయము ప్రకృతి నుంచి అందును. నీటిపై తేలుట నేర్చినవానిని ఎంత పెద్ద అలయైనను ముంచదు గదా! ముంచక ముందుకు కొనిపోవును. అట్లే కర్తవ్యమున నిలచినవానిని భయము ముంచదు.

# 63

## శిష్య పరీక్ష

సద్గురువు శిష్యుల నెన్నుకొనుటలో మూడు పరీక్షలు పెట్టును. అందు మొదటిది, శిష్యుని దృక్పథము. అతనియందు ఇతరుల శ్రేయస్సును గూర్చిన భావ మెక్కువగ నున్నదా లేక తన శ్రేయస్సును గూర్చిన భావ మెక్కువగ నున్నదా? – తన శ్రేయస్సు గూర్చి భావమున్న వానిని శిష్యునిగ అంగీకరించినచో సద్గురువునకు తిప్పలు తప్పవు. అతని వలన సద్గురువు అపఖ్యాతి చెందగలడు.

రెండవది : ధర్మమును, దైవమును సమర్థించు బుద్ధి యున్నదా? లేదా? ధర్మమును సమర్థించనివాడు దైవమును సమర్థించనివాడే. ధర్మమునందు విశ్వాసము లేనివారు ధర్మసంస్థలలో యున్నప్పుడు, వారు నిర్వహింపబడుచున్న కార్యములకు విఘ్నములు కలిగింతురు. ధర్మానుష్ఠానబుద్ధి లేనివారిని శిష్యునిగ అంగీకరించుటలో చాల అపాయముండును. లోక శ్రేయస్సు, ధర్మమునందు విశ్వాసము గలవానినే శిష్యునిగ చేర్చుకొనవలెను.

మూడవది : స్వంతముగ ఆలోచించగలిగిన శక్తి, కార్య నిర్వహణాదీక్ష. ఇది లేనివారు గురువునకు బరువే. శిష్యవ్యామోహము లేక, పై మూడు విషయములను పరిశీలించి శిష్యునంగీకరించవలెను.

## 64

## అసత్య భాషణము

అసత్యభాషణము, భాషించువానిని క్రమముగ క్రుంగ తీయును. జీవితము బరువెక్కుచుండును. పలికిన ప్రతి అసత్యము ఏనుగంత బరువై బ్రతుకు భారముగ చేయును. అట్టి భాషణము వలన వ్యక్తిగత కర్మము విపరీతముగ పెరుగును. దాని ఫలితము జీవుని స్వభావమున పాదుకొని జన్మ జన్మలు వెంబడించును. దానికి సంబంధించిన కర్మ భవిష్యత్తున ఆపదయై తారసిల్లును.

అసత్య భాషణముయొక్క ఫలములను తెలిసినవాడు అసత్య మాడుటకు భయపడును. తెలియనివాడు అసత్యమాడుచు జీవితమును క్లిష్టపరచుకొనును. తెలిసియు ఆచరింపని వాడు మూర్ఖుడు. అన్ని దోషములయందు అసత్యదోషము జీవుల నెక్కువగా బాధించునని తెలియవలెను.

# 65

## ఆశించుట, శ్రమించుట

**ఆ**శించుటకు, శ్రమించుటకు భేదమున్నది. ఆశించుట ఎక్కువైనచో, శ్రమించుట తగ్గును. శ్రమించువాడు ప్రస్తుతమున జీవించును. ఆశించువాడు ప్రస్తుతమును కోల్పోవుచునేయుండును. మరియు శ్రమించువాడు క్రమముగ ఆశయ సిద్ధిని పొందును. కేవల మాశించువాడు ఆశయములకు దూరమగుచుండును. శ్రమించక ఆశించుట వ్యర్థము. ఆశించిన దానికి శ్రమించుట ఔచిత్యము. శ్రమించుటలో ఆనందించుట ఉత్తమము. అట్టివారే కాలగమనమున సమర్థవంతులుగ తీర్చిదిద్దబడుదురు.

## 66

## విఘ్నములు - వినియోగము

విఘ్నములు కలిగినపుడు మానవునియొక్క లోశక్తి, మేధస్సు ఎక్కువగ పనిచేయును. కష్టములు కలిగినపుడు మేధస్సునకు, శక్తికి మరింత పని తగులును. ఆపదలు వచ్చినప్పుడు మానవుడు తన సమస్త శక్తిని, మేధస్సును వినియోగించును. సంపూర్ణముగ తన యందలి శక్తి సామర్థ్యములను వినియోగించుటకు అవకాశమప్పుడే ఏర్పడును. అప్రమత్తతకూడ అప్పుడే ఏర్పడును. సాధారణ సమయ మున అట్టి శక్తి, మేధస్సు నిద్రాణముగను, నిరుపయోగముగను యుండును.

మీ యందలి శక్తి సామర్థ్యములను, మేధస్సును మీ ఉన్నతికి ఉపయోగించుటకు, మీ పరిణితికి తోడ్పాటు చేయుటకు ప్రకృతి విఘ్నములు, కష్టములు, ఆపదలు కలిగించుచుండును. సౌఖ్యము లనుభవించుచున్నప్పుడు అప్రమత్తత యుండదు. మీరప్రమత్తు లగుటయే మా ఆశయము. అప్రమత్తులే లోకహిత కార్యములకు సహకరించగలరు. అందువలననే లోకహిత మార్గమున నడచువారికి కష్టములు, నష్టములు, ఆపదలు తరచుగ కలుగుచుండును. భీతి, భయము చెందక ధీశక్తిని వినియోగించుచు, ముందుకు నడచుటయే గాని చతికిలపడుట మా మార్గమున లేదు.

## 67

## వేగము - అవరోధములు

వేగముగ పోవువానికి ఎదురుగాలి ఎక్కువగ నుండును. సముద్రమున నావ వేగము పెరిగిన కొలది ప్రవాహము ఎదుర్కోలు ఎక్కువగ నుండును. త్వరితగతిని యోగమున పరిణితి చెందువారికి కూడ జీవితమున విఘ్నములు, కష్టములు ఎక్కువగ నుండును. ఇది ప్రకృతి ధర్మము. త్వరితగతిని పురోగతి చెందుటకు చెల్లించు రుసుము. ప్రత్యేక దర్శనమునకు లేక శీఘ్ర దర్శనమునకు దేవాలయమున ఎక్కువ రుసుము చెల్లించవలయును గదా! ఇదియును అట్లే. ప్రసవ వేదనవలె ప్రతి విషయమునను సిద్ధి లభించుటకు కొంత వేదన తప్పనిసరి. సృష్టియందు దీనిని గమనించినవారు వేదనయందిమిడి యున్న ఫలసిద్ధిని తెలియగలరు. అందువలననే జ్ఞానమను తెరచాపను కాలము, దేశము అను ప్రయాణమున వినియోగించుకొనుచు ముందుకు సాగవలెను. మీరు పఠించిన జ్ఞానమంతయు మీకు కష్ట సమయమున వినియోగపడుటకే. అట్లుకానిచో జ్ఞానమొక గాడిద బరువగును. విఘ్నములయందు తెలిసిన జ్ఞానమును వినియో గించుచు ముందుకు సాగుటయే వివేకము.

# 68

## వింత బోధ

ఫకీరు ఒకడు బంతిని విసరుచు ప్రతిసారి ధ్యేయమును కొట్టుచున్నాడు. ఆశ్చర్య పడుచు అతని చుట్టూవున్న పిల్లలు మరల బంతిని తెచ్చి ఫకీరు కిచ్చుచున్నారు. అతడు బంతిని విసిరి ధ్యేయ మును కొట్టుట, పిల్లలు బంతిని తెచ్చి అతని కిచ్చుట అవిశ్రాంతముగ రెండు గంటలు సాగినది. ఫకీరునకు విసరుటలో విసుగులేదు. ధ్యేయమును చేరుటలో అశ్రద్ధ లేదు. పిల్లలకు ఉత్సాహములో విసుగులేదు.

ఈ కార్యమును చాలసేపు నుండి చూచుచున్న ఒక పెద్దమనిషి ఫకీరును చేరి "మీరు జ్ఞానవంతులని తెలిసి మీనుండి జ్ఞానము పొందుటకై చాల సేపటినుండి వేచి యున్నాను. మీ ఆటను విరమించి నాకేమైన జ్ఞానబోధను అనుగ్రహించవలెనని ఎదురు చూచుచున్నాను" అని పలికినాడు. అది వినిన ఫకీరు ఫక్కున నవ్వి ఇట్లనెను. "ఎదురు చూచుటేల? చూచినచో సరిపోయెడిది గదా! ఇంత సేపు నేను చేసినది జ్ఞాన బోధయే. చేసిన జ్ఞానబోధను నీవు

చూడలేదు. విసిరిన ప్రతి బంతి శ్రద్ధగ విసిరితిని. మరల అది నా చేతికే అందింపబడెను. అందలి రహస్యము గమనించితివా? నీ చేతియందున్నది శ్రద్ధగ సద్వినియోగము చేయుము. అది మరల మరల నిన్నే చేరుచు నీ నుండి అవిరామముగ లోకహితము జరుగును. ఉన్నది సద్వినియోగము చేయుటయే నేను నీకందించిన జ్ఞానబోధ. ఇక బయలుదేరుము. వాచాలత్త్వమునకు నాకు సమయము లేదు."

వచ్చిన జ్ఞానాభిలాషి అబ్బురపడెను. అవగాహన పొందెను.

## 69

## శిల్‌శిలా

**మ**మ్ములను చేరుటకు సద్గురువు ఆవశ్యకత ఉన్నది. భూమి జీవులకు దివ్యత్వమును చేరుటకు గురువే మార్గము. భారతీయుల కిది చిరకాలము నుండి తెలియును. పాశ్చాత్యులకు ఈ విషయము రెండువేల సంవత్సరముల క్రితము ఏసు ద్వారా తెలుపబడినది. ఏసు, "నేనే మార్గము" అని తెలుపుటలో ఈ రహస్యమున్నది. గురువు చేయు మేలు నీకుగ నీవు చేసుకొనలేవు. దీనినే గురుపరంపరాగత మార్గము అందురు. ఇందు నడచువారందరు తథాగతులే. బుద్ధుడు కూడ తథాగతుడే. తథాగత మార్గమును "శిల్‌శిలా" అని హిమాలయపు ఉత్తరప్రాంతము వారు పలుకుదురు.

**70**

## ఈనాటి విజ్ఞత

**పం**చభూతములకు అంతరాయము కలిగించినచో అందుండి విషము పుట్టునని శాస్త్రజ్ఞులకు తెలియదు. ఆధునిక యుగమున మానవుడు భూమిని, నీటిని, వాయువును, ఆకాశమును చీకాకు పరచుచున్నాడు. అది కారణముగ పుట్టిన విషవాయువులు సూర్య కిరణముల ద్వారా భూమిని చేరి మానవులను చీకాకు పెట్టుచున్నవి.

మానవుని ప్రవర్తనయే భూమిపై అనర్థము లేర్పరచుచుండగ, అట్టి ప్రవర్తనను సరిదిద్దుకొనక భూమిని పవిత్రీకరించవలెనని ప్రయత్నము చేయుచున్నారు. అపరిశుద్ధము చేయుచు, పరిశుద్ధత కొరకు ప్రాకులాడుచున్నాడు. ప్రకృతితో కలసిమెలసి జీవించుట అను స్నేహభావము లేకుండుట వలననే అలజడి చెందుచున్నాడు. జీవితము అపాయకరము చేసుకొను చున్నాడు. అతని విజ్ఞతను ఏమని వివరించగలము ?

# 71

## మైత్రేయ యుగము

**“నూ**తన యుగము మైత్రేయ యుగమని అంటారు. అది దగ్గరలో నున్నదా?” అని ప్రశ్నింపగ మే మిట్లంటిమి.

“మైత్రేయ యుగము వచ్చుట, రాకుండుట మీవంటివారి వశమున నున్నది. మీ యందు మా బోధనల ద్వారా ఏర్పడు మైత్రీభావమే మైత్రేయ యుగమునకు బీజము. మే మాశించునది మిత్రత్వము. ప్రస్తుతము మానవజాతియందు శత్రుత్వమెక్కువగ నున్నది. ఆధ్యాత్మిక సోదరబృందములయందు గూడ మిత్రత్వము కన్న శత్రుత్వమే ఎక్కువగ కన్పట్టుతున్నది. వేర్పాటు ధోరణి యున్న చోట మిత్రత్వముండదు గదా! కలిసి జీవించుడని మేము 5 వేల సంవత్సరముల నుండి తెలుపుచున్నాము. మమ్మనుసరించు బృంద ములకే ఇంతవరకిది సాధ్యపడలేదు. బోధించుట, స్ఫూర్తి నిచ్చుట, అటుపై వేచియుండుటగ మా పని నడచుచున్నది. మీరు చేయ వలసినదే మిగిలియున్నది. మిత్రత్వ భావమే మైత్రేయ లోకము. అది ఎక్కడ వున్న అక్కడ మైత్రేయ యుగము సత్యమగును.”

## 72

# సౌందర్య ఉపాసనము

విసుగు, చిరాకు, కోపము మనిషియందు విషమును పుట్టించును. పుట్టిన విషము నాడులగుండా ప్రవహించి దేహ మంతయు మలినము చేయును. అట్టి వారికి రకరకములైన మందులు వేయుటతో మరికొంత ప్రమాదము జరుగును. వారికి తగిన చికిత్స విశ్రాంతి. వారికి ఎంత విశ్రాంతి ఏర్పరచిన అంత స్వస్థత చేకూరును. సుందరము, పవిత్రము, ప్రశాంతము అయిన ప్రదేశములలో జీవించుట ఇట్టి రోగులకు అతిముఖ్యము. ప్రకృతి సహజ సౌందర్యము నుండి ఉద్భవించు తరంగములు ఎట్టి విషపూరిత రోగమునైనను పరిష్కరించగలదు. సౌందర్యోపాసన ప్రాణమునకు బలము నిచ్చును. ఈ ఉపాసన సహజముగ సాగవలెను.



# 73

## వ్యర్థులు

వేగవంతముగ పురుగులను తిను పక్షికిని, పెద్ద పెద్ద జంతువులను తిను రాబందులకు తేడా తెలియుట అవసరము. చిన్న చిన్న తప్పులు చేయు బలహీనులకు, భయంకరమగు తప్పులు చేయు దుష్టులకు గల వ్యత్యాసము తెలియవలెను. ప్రస్తుత కాలమున దుష్టులు వారి దౌష్ట్య నిర్వహణమున చిన్నవారి తప్పులు పెద్దవి చేసి దండించు చున్నారు. బలవంతులు బలహీనులపై ఆరోపణలు మోపి దండించు చున్నారు. ఈ బలవంతులు భూమిపై అత్యంత ధనికులుగను, భయంకరమగు శక్తివంతులుగను ఏర్పడుచు జాతిని కబళించు చున్నారు. ఆధ్యాత్మికులు కూడ వీరి పంచన చేరి వారి మోచేతి నీరు త్రాగుచు దివ్యపురుషులమని తమని తాము గౌరవించుకొనుచున్నారు. పేదలకన్న ధనికులను, సామాన్యునికన్న అధికారులను ఎక్కువగా ఆదరించు సత్పురుషులందరును కలికి అమ్ముడుపోయినవారే. వీరి వలన సామాన్య జనజీవనమునకు ఉపయోగమేమియు లేదు. గాడిదలవలె ధనికుల కర్మములను మోయుచు, పుణ్యము క్షీణింప చేసుకొనుచున్నారు. వీరిది వ్యర్థ ప్రయత్నము.

# 74

## ధన వ్యామోహము

**జీ**వితమున ధనము ఆవశ్యకత తగ్గించుకొను నేర్పు కలవాడు ముక్తి పథమున నడువగలడు. ధనమను మాయ జీవుని దృష్టిని చెదరగొట్టును. ప్రస్తుతము మానవజాతి యంతయు ధనపిశాచిచే పీడింపబడుచున్నవారే. సంస్కారవంతులు గూడ ధనాశ కారణముగ సంస్కారములకు తిలోదకములు వదలుచున్నారు. భారతీయ సంస్కృతికన్న మించిన సంస్కృతి ప్రపంచమున లేకున్నను ధనమునకు లోబడి సంపన్న దేశములకు వలసలు పోవుచు, బానిస జీవితములు గడుపుచున్నవారెందరో గలరు. ధన సంపాదనమునకు, ఆత్మ స్వాతంత్ర్యమునకు పరస్పర వైరుధ్యము కన్పట్టుచున్నది. మానవు డేర్పరచుకున్న ధనము మానవునే బంధించినది. ఈ కారణముగ మానవుడు పిరికివాడైనాడు. సాటి మనిషిపై విశ్వాసము తగ్గి ధనముపై విశ్వాసము పెరిగినది.

నీవు సత్సాధకుడవైనచో ధనవాంఛ, అధికార వాంఛల నుండి స్వతంత్రుడవు కమ్ము. ఇవి మాయకు రెండు రెక్కలవంటివి. నిన్నెత్తుకొనిపోయి నడిసముద్రములో వదలగలవు.

75

## ప్రత్యేక దృష్టి

మహత్తర విషయములు ఎప్పుడునూ అతి సామాన్యముగ ప్రారంభమగును. ఆర్భాటమసలేయుండదు. నదీ ప్రవాహము పుట్టుకను గమనించినచో పై సత్యము తెలియనగును. కాకతాళీయ ముగ మహాత్ములచే మహాకార్యములిట్లే ప్రారంభింపబడినవి. మహాత్ముల బోధనలు కూడ నిగూఢ రహస్యముల నిట్లే వెలిబుచ్చు చుండును. శ్రద్ధ, భక్తి, ఏకాగ్ర దృష్టి కలవారు మాత్రమే వీటిని గమనింపగలరు. ఇతరులకు సత్యపరమైన విషయములు అంతగ గోచరింపవు. ఆరంభము లెప్పుడును సామాన్యముగ నుండుట ప్రకృతి విధానము. శ్రీ కృష్ణ జననము, ఏసుక్రీస్తు జననము కూడ ఇట్లే సామాన్యముగ జరిగినవి. అందువలన అతి సామాన్య విషయముల యందు అశ్రద్ధ పనికిరాదని మా హెచ్చరిక.

భూమిపై తిరుగాడు దైవము దత్తాత్రేయుడు. అతడు సామాన్యు లలో కలసిమెలసి తిరుగుచుండును. అతని నెవ్వరునూ గుర్తింపలేరు. కారణము మానవుల డాంబికతయే.

డాంబిక విషయముల యందు సత్యము నేతి బీరకాయలోని నెయ్యివంటిది. ఆధ్యాత్మిక మార్గముననే చాటించుకొనుచు తమను తామే కీర్తించుకొను సంఘములు పెక్కు గలవు. అందు ఆధ్యాత్మికత నామమాత్రమే. విలువగల విషయము లెప్పుడును మరుగున యుండును. ఒక రకమగు తమస్సు వాని నావరించి వెలుగును మరుగుగ నుంచును. కావున మహత్తర విషయములను, సన్నివేశము లను, మనుష్యులను గుర్తించుటకు మీరు ప్రత్యేకమగు కన్నును ఏర్పాటు గావించుకొనవలెను. అట్టి దృష్టి లేనివాని జీవితము సత్యదూరమై సాగును.



## 76

## భావములు - పంచభూతములు

మీ భావలోకములను కంచుకోటవలె పటిష్ఠము గావించుకొనవలెను. మీ యందలి పంచభూతములు, మీ భావముల నాణ్యతను బట్టి వెలుగొందుచుండును. నాణ్యతలేని భావములు మనసున చేరినచో కోటకు బీట్లు వారినట్లే. అపుడు శత్రువులు ప్రవేశింతురు. శరీరమందలి పంచభూతములు అపుడు కకావికలమై పోవును. ఆరోగ్యము చెడును. నిరాశ, నిస్పృహ చోటు చేసుకొనును. మన పతనమునకు గాని, వృద్ధికి గాని భావములే ప్రధానము. ఎట్టి క్లిష్ట పరిస్థితిలోను కూడ దీనతను ఆశ్రయింపకూడదు. నిరాశ, నిస్పృహలను పెంపొందింపజేయకుడు. పంచభూతములకు ఇంద్రుడే అధిదేవత. ఇంద్రప్రజ్ఞ మీ మనోభావములను పనిచేయించును. ఇంద్రుడు పంచభూతాత్మక సృష్టికి రాజు. అనగా రక్షకుడు. అతడు బలహీన పడినప్పుడెల్ల అసురులు ప్రవేశించి సమస్తమును ధ్వంసము చేయుదురు. అట్లే మీ జీవన రాజ్యములకు మీ మనోభావ నాణ్యత రక్షణ. వన్నెలేని భావములు పతనమునకు ద్వారములు.

పంచభూతములు భావన మాధారముగ వర్తించుచున్నవి. మానవ భావనము అనారోగ్యకరముగ నుండుటచేతనే అతివృష్టి, అనావృష్టి, క్షామము, తీవ్రరోగములు పుట్టుచున్నవి. సంఘటితమగు నిర్మాణాత్మక భావములే సంఘ క్షేమమునకు ప్రధానము. ఒకరిద్దరు సత్పురుషులున్నచో నిర్వీర్యమైన సంఘభావన మార్పు జేయలేరు. బృందములు బృందములుగ సద్భావనా సంఘములున్నచో సంఘ మును పునరుజ్జీవింప చేయవచ్చును. ఇందులకే సద్భావనా బృంద ముల నేర్పరచుటకొక ప్రయత్నము జరుగుచున్నది. ఈ సంఘముల యందు సద్భావన కొరవడుట వలన వాని అస్థిత్వమే అస్థిరముగ నున్నది. అయినను సద్భావనతో నా కృషిని సాగించుచునే యుందును.

వ్యక్తిగత జీవనము, సాంఘిక జీవనము నాణ్యతను చెందవలె నన్నచో భావలోకమందలి మార్పులే ప్రధానమని గుర్తింపుడు.



# 77

## సద్గురువు

**తా** నుండుటకొక నీడ యుండవలెనని సద్గురువు భావింపడు. తనకుగ తాను గృహమేర్పరచుకొనడు. నిలయములు, నివాసములు, ఆశ్రమములు మా మార్గమున నడచు లోకహితులు కోరరు. వారికి హృదయమే శాశ్వత నిలయము. వారి నిలయము స్పందనాత్మకము. ఇటుకతో కట్టబడినది కాదు. చైతన్యముతో అల్లబడినది. తన సహవాసుల హృదయములు కూడ అతనికి నివాసయోగ్యములే. వారి భవనములతో గాని, ఆస్తిపాస్తులతో గాని అతనికి సంబంధము లేదు.

అతడు మానవ జీవన స్రవంతియందు పాల్గొనియే యుండును. కాని సామాన్యులతనిని గుర్తింపలేరు. అతని మాట, చేత, చూపు ఆనందదాయకములు. అతడెచ్చటను అవసరమును మించి తిరుగడు, మాటాడడు. కాలయాపనమునకు అతని స్వభావమున చోటే లేదు. అతడు దేనిని ద్వేషింపడు. యోగులు ద్వేషించిన వారిని అతడు కరుణించును. అతడు మహాత్ములను, సద్గ్రంథములను సమర్థించునే గాని అపహాస్యము చేయడు.

అతని నడత నిర్దిష్టముగను, నిర్దుష్టముగను వుండును. సందిగ్ధముండదు. అనుయాయులకు గల అపాయము సూచనప్రాయముగ తెలుపుచునుండును. అతడికి కించిత్ మేలు చేసిన వారియందు కృతజ్ఞుడై యుండును. జీవుల హృదయమందు ప్రవేశించగల వాడగుటచే వారి ఉద్దేశ్యములను సులభముగ గ్రహించును. అతడు నిర్భయుడు. అట్లని ఎవరిని నిర్లక్ష్యము చేయడు. అతని పని జీవులను వారి హృదయములందు మేల్కొల్పుటయే. అట్టి సద్గురువు సాన్నిధ్యమును హృదయమున పెంపొందించుకొనుట నిజమగు సౌభాగ్యము.

## 78

# రసాయనము

**యో**గసాధన ఒక రసాయనము. రసాయనచర్యయందు ఒక స్థితిలో పదార్థము నిర్దిష్టమగు మార్పునుచెందును. అప్పుడా రసాయన చర్య సిద్ధించును. సృష్టియంతయు ఒక రసాయనము. అదృశ్యముగను, అనుస్యూతముగను సృష్టిమార్పు పరిణామ మార్గమున జరుగుచునే యున్నది. మానవపరిణామము కూడ ఇంద్రియగోచరము కాక పోయినను జరుగుచునేయున్నది. పాలు పెరుగు యగుటకు జరుగు నది రసాయనచర్యే. దానికి, తోడు ఆధారము. మట్టి బంగార మగుట కూడ యిట్టిదే. రాయి రత్నమగుట, పూవు కాయగుట, కాయపండగుట గమనించినచో ఈ సత్యము తెలియగలదు. అతి సూక్ష్మమగు మార్పులు స్థూలబుద్ధిగల వారి కందదు. సూక్ష్మబుద్ధి కలిగినచో సూక్ష్మమగు పరిణామములన్నియు తెలియనగును.

సాధకుడు సామాన్యముగ స్థూలబుద్ధి. గురువు సూక్ష్మబుద్ధి. గురువందించిన సూత్రములను అనుస్యూతముగను, అదృశ్యము గను నిర్వర్తించుకొనుటే అతని కర్తవ్యము. అతని యందు జరుగు

మార్పులను అతడు గమనింపలేడు. సద్గురువు గమనించుచునే యుండును. మార్పు సూక్ష్మము నుండి స్థూలమునకు జరుగుచు, ఒక దశలో స్థూలమున కూడ ప్రకటింపబడును. పండిన పండు, విచ్చిన పూవు, రత్నము, బంగారము స్వయంప్రకాశములే. అంతియే కాదు, అవి జీవుల కత్యంత ఉపయోగకరము. సాధకుడు సిద్ధుడగుట కూడ లోకశ్రేయస్సు కొరకే. అది తనయందు జరుగు రసాయనము యొక్క ఫలము. రసాయనము జరుగుటకు నిరంతర సాధన, మౌనము ప్రధానములు. వాచాలత్వము దీనికి విరుద్ధము.

## 79

## మహాత్ముల పని

**క**లియుగమున బుద్ధుడు, క్రీస్తు దేహధారులై మహత్తరమైన బోధనలను గావించిరి. వారు నిస్సందేహముగ అవతారమూర్తులే. భూమిపై నడచి భూమిని పులకింపజేసిరి. తమ బోధనలను వినువారి హృదయములను కూడ పులకింపజేసిరి. భూమియందలి పంచభూతములను, వృక్షములను, జంతువులను, పక్షులను కూడ వారి సాన్నిధ్యముచే ప్రచోదనము గావించిరి. అయినను ఒరిగినదేమి? అను ప్రశ్న ఎప్పటికప్పుడు మానవుని మనస్సులో పుట్టుచున్నది. వారిని రక్షకులని పిలచుట వెఱ్ఱితనమని కొందరి యుద్దేశ్యము. మానవజాతి నానాటికి క్షీణించుచున్నదని, అవతారమూర్తుల బోధనలు కూడ ఎవ్వరిని రక్షింపలేవని మేధావుల స్థూలభావము.

స్థూలదృష్టికి సూక్ష్మమగు మార్పులు తెలియవు. చప్పుడు కలవాటుపడిన వారికి నిశ్శబ్దము యొక్క మహాత్మ్యమెట్లు తెలియగలదు? నేర్పుతో ప్రసంగములు చేయువారు ఆకర్షించినట్లుగ మౌనులాకర్షింపగలరా? ప్రపంచము మేళతాళములను, ఆడంబర

ములను మాత్రమే గుర్తించును గాని, పూవు వికసించుట, నీటిబొట్టు ముత్యమగుట, పూత పిందెవేయుట గమనించలేరు కదా! మహాత్ము లొనర్చిన కార్యములన్నియు జీవపరిణామమునకు తోడ్పాటు గావించుచునేయున్నవి. వారి కార్యములు సూక్ష్మతరములు. వాని ప్రభావము స్థూలబుద్ధిగలవారి అవగాహనకు అందుట తరము కాదు. అపహాస్యము చేయుటయే వారి వంతు. వారిని సైతము ఉద్ధరించు టయే మహాత్ముల పని.

# 80

## నూతన యుగము

**నూ**తన యుగమును గూర్చి ఎన్నియో ఆశాభావములు వ్యక్త మైనవి. నూతన జీవనము గూర్చి ఎన్నియో ప్రయత్నములు జరుగు చున్నవి. నూతనమగు ఏర్పాట్లను, సర్దుబాట్లను మానవుడు అవిరామ ముగ చేయుచున్నాడు. అయినను నూతన జీవనమబ్బలేదు. నూతన యుగము రాలేదు. శాంతి కొరకు భౌతికలోకమున మహత్తరమగు ప్రయత్నములు జరుగుచున్నవి. శాంతి కొరకు యుద్ధములుకూడ చేయుచున్నారు. యుద్ధము, శాంతి ఒకదానికొకటి విరుద్ధము. మానవునిలోని అశాంతి, అసహనము, అధికార కాంక్ష, శాంతి కొరకు చేయు ప్రయత్నములను విఫలము చేయును.

ప్రపంచశాంతికి ప్రయత్నము చేయువారి స్వభావమునందు శాంతి యున్నచో వారు చేయు కృషి శాంతి నందించ గలదు. ఎవరు దేనియందు నిష్ణాతులో, వారు దానిని ప్రకటించుటకు సమర్థులు. కపటత్వమున శాంతి లభింపదు. కపటత్వమే ప్రకటితమగు చుండును. తనవద్ద లేని వస్తువును తానిచ్చెదననుట కపటము. భావము, భాషలను సత్యమావరించినచో నూతన యుగమారంభము కాగలదు.

# 81

## ఊహాస్త్రము

**ఒ**క స్త్రీ నీటికుండను ధరించి బాటలో మసలుచున్నప్పుడు, ఆ నీరెవరి దాహము కొరకో మీకు తెలియునా? నేతవాడొక చీరను నేయునప్పుడు, ఆ చీరను ఎవరు ధరింతురో మీకు తెలియునా? ఒక ముఖద్వారము మూసియున్నప్పుడు అందుండి ఎవరు ఏతెంతురో నీకు తెలియునా? నీతో ప్రయాణము చేయువారు ఏ కారణమునకు ప్రయాణించుచున్నారో నీకు తెలియునా? పిడుగు పడినప్పుడు అది ఎవరి ప్రాణములు తీయునో తెలియునా? ఎవరెందులకెట్లు ప్రవర్తించుచున్నారో నీకు తెలియునా? నీకేమీ తెలియదు.

తెలియక పోయినను నీకు తోచినట్లూహింతువు. నీ ఊహల నుండి అభిప్రాయము లేర్పరచుకొందువు. అభిప్రాయములాధారముగ చూచుటచే, అవి బలపడి నమ్మకమేర్పడును. అపనమ్మక మేర్పడును. అంతయూ ఊహాజనితమే. సాధారణముగ నీవు నమ్ము మంచి చెడు అంతయూ ఊహాజనితమే. అది నీ మనసు నీకు చూపించు సినిమా. ఈ సినిమాలో మమకారమే ప్రేమ. అసూయయే ద్వేషము. నచ్చిన

వారు నవ్వినచో ప్రేమనుకొందువు. నచ్చనివారు నవ్వినచో ఎగతాళి అనుకొందువు. అంతా నీ ఊహయే. నీ అభిప్రాయమే.

భగవంతుడు నీకు ఊహ నిచ్చినాడు. ఆ ఊహతో ప్రాపంచిక విషయముల యందు చిక్కుబడుచున్నావు. ఊహను సద్విషయముపై ప్రయోగింపుము. భగవంతుని గూర్చి ఊహించుము. సృష్టి వైభవము నూహించుము. గ్రహగోళముల సంచారముల నూహించుము. ప్రాణము, తెలివి, పోకడల నూహించుము. రూపముల వైవిధ్యము నూహించుము. వర్ణముల వైభవము నూహించుము. శబ్ద తరంగముల నూహించుము. జరుగుచున్న ఓంకారము నూహించుము. ఊహకొక ప్రయోజన మున్నది. ఊహను నిష్ప్రయోజకముగ వినియోగింపకుము. అట్లైనచో నిష్ప్రయోజకుడ వగుదువు. ప్రయోజకుడవగుము. ఇది మా సూచన.

## 82

## చికాకు

నీకు కలుగు చికాకు రెండు రకములు. జీవుడుగ నిన్ను నీవు ఉద్ధరించుకొనలేకపోవుట వలన నీపై నీకు చిరాకు కలుగవచ్చును. ఇది సాధకునకు సామాన్యము. సాధకుడు తన స్వభావముపై స్వామిత్వమునకు ప్రయత్నించుచుండును. తరచూ విఫలుడగు చుండును. వైఫల్యము నుండి చిరాకు పుట్టును. చిరాకు నుండి విషము పుట్టును. ప్రాణాయామము, వెలుగును గూర్చిన ధ్యానము పై విషమును హరింపగలవు. సాధకుని నుండి పుట్టు విషమున కిదియే ఔషధము. దివ్య ధ్యానమునకుగాని, ప్రాణాయామమునకు గాని మొగ్గని చిరాకేర్పడినచో అది సాధన కషాయకరము. అపుడు సత్సంగమే శరణ్యము. నిత్యము ఈ రెండింటిని సాధన చేయువారితో కూడి చేసుకొను ప్రయత్నముండవలెను. ఈ విషయమున కూడ అలసత్వ మేర్పడినచో సాధకునికిక సాధన సాగదు. విష మతనిని హరించును.

ఇక రెండవ విషము. ప్రాపంచిక విషయములను గూర్చి కలుగు చికాకు. దీనత దీనికి పునాదిరాయి. తనపై తనకు దయ, కరుణ దీనతను కలిగించును. హృదయమును దుర్బలము చేయును.

తననందరూ మోసము చేయుచున్నారని భావన కలుగును. తన నెవరూ ప్రేమించుటలేదనిపించును. అందరూ స్వార్థపరులే అని పించును. ప్రపంచము లోపభూయిష్టమైనదనిపించును. బాధే సౌఖ్య మనిపించును. మంచి చెడుల తారతమ్యము లేదనిపించును. బుద్ధి వక్రించును. కుంచించుకొని పోవును. నిష్ప్రయోజనమగు వేదాంత ధోరణి పుట్టును. సద్విషయములయందు, సత్కార్యముల యందు, సత్పురుషుల యందు ఏహ్యాభావము కలుగును. వీని నుండి పుట్టిన విషమునుండి బయల్పడుట బహుకష్టము. సర్వమునకు విముఖత చెందిన మనస్సును కేవలము దైవస్పర్శయే మార్చగలదు. జీవులను, ప్రపంచమును ద్వేషించుట వలన పుట్టిన విషమును దైవము కూడ హరింపడు. కాని దైవమునందు అనుగ్రహమను శుభలక్షణముండు టచే అది ప్రసరించినచో కాలము రూపములో పరిష్కారము లభింప గలదు. ఇట్టి వారికి కాలమే పరిష్కారకుడు.

83

## కృతజ్ఞత

ప్రస్తుత కాలమున ప్రతివారికి హీలింగ్ (Healing) ప్రక్రియ యందు మోజు కలదు. హీలింగ్ అనగా ప్రాణప్రసారము చేయు సామర్థ్యము. ప్రాణమును ప్రసరింపచేయదలచినచో భావము ప్రేమ మయమై యుండవలెను. ప్రేమ ప్రాణ ప్రవాహక శక్తి. ప్రేమ లేనివారు హీలింగ్ చేయలేరు. ప్రేమ భావము మానవుని భావనలన్నిటికన్న పవిత్రమైనది. అది భావమను మకుటమునకు మాణిక్యము వంటిది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు ప్రేమను అను నిత్యము నిర్వర్తించి చూపినారు. నేటికిని మానవజాతి ప్రేమ విలువను తెలియలేకున్నది.

ప్రేమ మార్గమునకు పునాది కృతజ్ఞత. కృతజ్ఞతలేని వాని యందు ప్రేమ యుండదు. కృతజ్ఞతా భావమును ముందుగ మానవుడు పరిపూర్ణముగ పోషించి పెంపొందించుకొనవలెను. సరాసరి దివ్యప్రేమను అనుసరించుట కుదరదు. ప్రతి స్వల్ప విషయ ములకు కూడ కృతజ్ఞతే సమాధానము కావలెను. అవి చిన్న

సహాయము పొందినను గుర్తుంచుకొనుట ఒక సంస్కారము. మిక్కుట ముగ సహాయము పొంది గుర్తించనివారు పాషండులు.

కృతజ్ఞతా భావమును మీ యందు పెంపొందించుకొనుడు. శరీర మందలి అణువణువును కృతజ్ఞతతో నింపుడు. పంచభూతము లకు, పంచేంద్రియములకు, పంచ ప్రాణములకు, మనస్సునకు, బుద్ధికి, గ్రహతారకలకు, అంతరిక్ష దేవతలకు, పశుపక్ష్యాదులకు, సమస్త ప్రాణికోటికి కృతజ్ఞుడై యుండువాడే ప్రేమానుభూతిని పొందగలడు. అట్టివాని నుండి ప్రేమ గంగాఝురివలె ప్రవహించును.

**84**

## సాధన - సూత్రము

**ఒం**టె మోయునంత బరువు గాడిద మోయగలదా? ఎవ రెంతవరకు మార్గమున వినియోగపడుదురో అంతవరకే వారికి శిక్షణ నీయవలెను. జీవతత్త్వము ఒక జన్మమున కొంతవరకే సాగును. అంతకుమించి సాగదు. మించి సాగదీసినచో తెగును. పదార్థము నందు ఆసక్తి గలవారిని పరమార్థములో వేసి త్రొక్కుట అపాయ కరము. పరమార్థమును చేరు ప్రయాణమున కూడా సాగినంత వరకే నడక. అందరునూ ఒకే మారుగ గుడి మెట్లెక్కలేరు. కొందరు ఆగి ఆగి ఎక్కుదురు. ఆగకూడదన్నచో అసలే ఎక్కరు. సత్య మార్గమున నడచు జీవులు కూడ అదియే పనిగ నడక సాగించలేరు. కొంత ఆగుటయుండును. కొంత మరచుట యుండును. కొంత ప్రక్కదారుల యందు పోవుటయుండును. కాలము, కర్మమును బట్టి వేగము, నెమ్మదితనము, మరపు, ప్రక్కదారి, విశ్రాంతి– మార్గమున సహజ ములు. అపుడపుడు, కొంత పదార్థమయమైన జీవనము కూడ అవసరము. దాని వలన పొందు అనుభవము పరమార్థమయ జీవన

మున కుపయోగించును. పదార్థమయ అనుభవము లేనివాడు పరమార్థమును చేరుట వట్టిమాట.

పరమార్థము కోరని వానిని ఆ మార్గమున నిర్బంధించుట పందికి మూతి కడిగినట్లే నిష్ప్రయోజనము. బోధకుడీ విషయమును గ్రహించి జీవులను నడిపింపవలెను.



## 85

# పూర్ణ యోగము

**జీ**విత మందలి ప్రతి సన్నివేశము, జీవపరిణామమునకే. విఘ్నములు, విఘాతములు, అంతరాయములు నిజమునకు లేవు. అవి అన్నియు జీవుని పరిపూర్ణత్వము కొఱకే. కామి కాని వాడు మోక్షకామి కాడు. సమస్త విషయములు అనుభవపూర్వకముగ తృప్తి చెందుచు, ముందుకు సాగుటకే జన్మపరంపరలు. కొన్ని జన్మలలో కొన్ని సిద్ధించును, కొన్ని సిద్ధింపవు. మరికొన్నిటియందు అశ్రద్ధ యుండును. ఇంకొన్నిటియందు నిర్లక్ష్యముండును. శిల్పము, చిత్రము అందముగ తయారుకావలెనన్నచో దానిని సర్వసుందరముగ తీర్చిదిద్దవలెను. మిగుళ్ళు, తగుళ్ళు పనికిరావు. దరిద్రునికి ధనానుభవము, ధనికునికి దారిద్ర్యానుభవము అవసరము. ఆకలి అనుభవము, సమృద్ధి అనుభవము కలుగవలెను. కష్టసుఖముల అనుభవములు తెలియవలెను. లాభ నష్టములను తెలియవలెను. జయాపజయములను తెలియవలెను. స్త్రీ జన్మను, పురుష జన్మను కూడ తెలియవలెను.

పద్మమునందలి దళములన్నీ విచ్చుకొనవలెనన్నచో అన్ని అనుభవములు పూర్ణము కావలెను. అందుకొక జన్మ చాలదు. పరిపూర్ణ యోగియందు అరువది నాలుగు కళలు భాసించును. అంతవరకు జన్మ పరంపరలు తప్పవు. పరిపూర్ణుడు సర్వ విషయము లందును పరిపూర్ణుడే. అతడే దైవ సమానుడు. శ్రీకృష్ణుడట్టివాడు. అతనియందు లేని కళ, విద్య లేనేలేదు. అతడు విశ్వమందుగల సమస్త జీవులకు ఆదర్శము. సహస్రదళపద్మము విచ్చుకొనుట యనగా సహస్రకళలను తననుండి ప్రకాశింప చేయుట. ఇది మాటల కందని విషయము. దీనిని గూర్చి కొంత ఆలోచన చేయుడు. ఆత్మపరముగ నున్న అపరిపూర్ణతలను తొలగించుట గాక పరిపూర్ణము చేయుచు ముందుకు సాగుడు. ఇది పూర్ణ యోగము.



**86**

## సమాధాన విద్య

ప్రశ్నకు సమాధానము తెలుపువాడు అవగాహన ఏర్పడునట్లు సమాధానమీయవలెను. సమాధానమిచ్చినను అవగాహన కాదు అని అనిపించినచో సమాధాన మీయకుండుటయే మంచిది. సాధారణ ముగ సమాధానము నుండి మరల ప్రశ్నలు పుట్టుచుండును. అనగా పృచ్ఛకుడు సమాధానపడలేదనే కదా అర్థము. ప్రశ్నలతో కలవర పడువారికి సమాధానము మరింత కలవరపెట్టకలదు సుమా! అందుకే తెలిసిననూ సమాధానమీయకుండుట ఉత్తమము. పృచ్ఛకుడే సమాధానపడునట్లు సూచన లీయుట బోధన కాని సూటిగ సమాధాన మును చెప్పుట ఉపయోగకరము కాదు. సూచనలే ఉపయోగకరము. సూచనలు ప్రశ్నించువాడి ప్రశ్నయందే యుండును. ప్రశ్న యందే సమాధాన మున్నది అని తెలుపుటలో గల రహస్య మిదియే. “ఇట్లు చేసిన బాగుండునా?” అని ప్రశ్నించువాడు ప్రశ్నయందే తన కట్లు చేసిన బాగుండునని తెలుపుచున్నాడు. బాగుండదని నీవు తెలిపిననూ వినడు. అట్లు తెలిపిన చేదుగ నుండును. “నీవన్నట్లే కానిమ్ము.”

అనుట పృచ్ఛకునికి తృప్తి కలిగించును. అట్లనినచో అతను చెడి పోవును కదా! అని నీకనిపించినచో దానిని కూడ వివరించుము.

వద్దు, కాదు, కూడదు అని తెలిపి ఉపయోగము లేదు. సూటిగ వ్యతిరేకించుట సమాధానము కాదు. విభీషణుడు రావణుని సూటిగ సమాధాన రూపమున వ్యతిరేకించుట వలననే రాజ్య బహిష్కారము నకు గురి అయినాడు. హనుమంతుడు తన ప్రభువు సుగ్రీవుడు చేయుచున్నది అకార్యమని అనకుండగనే కార్యమున నిలబెట్టినాడు. హనుమంతుడు తెలిసినవాడు. విభీషణుడు తెలియనివాడు. విదురుడు తెలిసీ తెలియని వాడు. సమాధానము చెప్పుట ఒక ప్రత్యేక విద్య. దానికిని ఒక ఉపాసనామార్గమున్నది. తనకు తోచినదే సమాధాన మనుకొనుట మూర్ఖత.



**87**

## అప్రమత్తత

సద్గురువు చిన్న చిన్న విషయములయందు అప్రమత్తులై వుండవలెనని బోధించుచుండును. తాను ఆచరించి చూపించును. చిన్న విషయమునకు ఇంత రాద్ధాంతము చేయుట ఏమి? అని సాధకున కనిపించుచుండును. ఏవి చిన్నవో, ఏవి పెద్దవో నిర్ణయించట యెట్లు? చిన్న బెడ్డమీద కాలువేసి జారినచో, పెద్ద బొమిక విరుగును కదా? చిన్న బోల్టు ఊడినచో పెద్ద యంత్రము ఆగదా? పెద్ద అపాయ ములు కలిగించువన్నియు కూడ సూక్ష్మముగా తారసపడును. పెద్ద ప్రమాదములు కలిగించును. వేగవంతమైన ప్రయాణములో చిన్న కునుకు ప్రాణమును హరించును. చిన్న చిన్న విషయములలో హెచ్చరిక గావించువాడే నిజమైన స్నేహితుడు. హెచ్చరిక నందుకొని అప్రమత్తముగ జీవించేవాడే బుద్ధిమంతుడు.

అప్రమత్తత మానవులు జంతువుల నుండి నేర్చుకొనవలసి యుండును. జాతికుక్క వాసన, చప్పుడు విషయముల యందు అప్రమత్తమై యుండును. మృగరాజు తన వారిని రక్షించుకొనుటలో

అప్రమత్తుడు. గ్రద్ద ఆకాశములో ఎగురుచున్ననూ నిశితమైన దృష్టికలిగి భూమిపై చరించు ఆహారమును చూచుచునే యుండును. నిశితమైన బుద్ధి ఏర్పడవలెననిన చిన్న, పెద్ద అని భావించక అన్ని విషయములందు అప్రమత్తులై యుండవలెను. అట్టివారే అపాయము లను ముందుగ గ్రహించి దాటిపోగలరు. లేనిచో అశ్రద్ధ కారణముగ పతనము చెందుదురు.

## 88

# రుచికర బోధనము

**మా** బోధనలు సంప్రదాయక బోధనలకన్న భిన్నముగ నున్నవని చాల మంది భావింతురు. సృష్టి పరిణామ కథలో బోధనలు కూడ పరిణామము చెందుచున్నవి. కాలమును, దేశమును, ప్రజల సంస్కృతిని బట్టి బోధనలు అందించు విధానమున కొంత మార్పు జరుగుచుండును. బోధనల ఆశయము జీవులకు జ్ఞానాసక్తి కలిగించుటయే. ఆసక్తి కలుగవలెనన్నచో, బోధనలయందు కొంత ఆకర్షణ యుండవలెను. ఆకర్షితులైన జీవులు జ్ఞానమున ప్రవేశించుటకు వీలగును. జీవులను చైతన్య మార్గమున ముందునకు నడుపుటయే మా ఏకైక ఆశయము. ఆశయ నిర్వహణమునకై మా బృందము రకరకములగ బోధనలను చేయును. బోధనల ముఖ్య ఉద్దేశ్యము, శ్రద్ధను కలిగించి జ్ఞానమున ప్రవేశపెట్టుట.

ఆకలి తీర్చుటకై ఆహారము భుజించుట అవశ్యకము. ఆహారము పోషకాహారమై యుండవలెను. పోషణమునకు విరుద్ధము కాని రుచి భుజించువారికి ఆహారమునందాసక్తి కలిగించును.

రుచికాకర్షింపబడి పోషకమగు ఆహారమును భుజించువాడు శరీర పుష్టినెట్లు పొందునో, అట్లే బోధనలు రుచికరము చేయవలెను. అనుసరించువారికి రుచి కలుగవలెను. రుచి అనగా వెలుగు అని కూడ అర్థమున్నది. బోధనలయందు రుచి జ్ఞానముగ ఆవిర్భ వించును.

**89**

## దైవకారుణ్యము

**సృ**ష్టి కథయందు పూర్వార్ధము అవతరణమునకు సంబంధించి యుండగ, ఉత్తరార్థము పరిణామమునకు సంబంధించి యుండును. సృష్టి పరిణామము జీవుల పరిణామము కొఱకే. అసలు సృష్టి కూడ జీవులకొఱకే. పరిణామము పరిపూర్ణము కాని అసంఖ్యాకులైన జీవుల కొఱకు మరొకసృష్టి ఏర్పాటు చేయబడుచున్నది. ఇదియే దైవము యొక్క కారుణ్యము. జీవులందరును, తనంతటి వారుకావలెనని దైవము అభిలాష. అందరును పరిమితత్త్వమును దాటి పరమ పదమున పడయవలెనని బహు విస్తారమగు సృష్టినిర్మాణము గావించి పరిణామమునకు దైవము జీవుల కవకాశము కలిగించుచున్నాడు.

జీవునకు దేహము నిచ్చి పోషణము గావించి విద్యాభ్యాసము గావించి దారి చూపు తండ్రి, కుమారుడు తనంతట వాడు కావలెన నియే కదా! ఇది సహజమైనప్రేమ. బాధ్యతతో, ప్రేమతో, కారుణ్య ముతో అందించిన అవకాశమును, దుర్వినియోగము చేసుకొను జీవుల నేమనవలయును? అజ్ఞానులవలెను. అజ్ఞానులకు పరిష్కార

మేమి? జ్ఞానమను దీపమును వెలిగించుటయే, అది వెలిగించు రూపమున దైవమే గురువుగ దిగిరాగ, నిరాకరించువారినేమన వలెను? నిరాకరించుటయేకాక, దూషించుట, హేళన చేయుట కూడ జరుగుచున్నది. ఇట్టివారే సృష్టి పరిణామ కథకు అంతరాయ ములు కలిగించుచుందురు.

అట్టివారి నుద్ధరించుటకు దైవము శిక్షించుట జరుగుచుండును. శిక్షించుటకూడ ప్రేమతోనే నిర్వర్తింపబడును.

ప్రస్తుతము మానవ జాతి యందు ఇట్లు వెనుకబడి యున్న మానవుల గుంపు ఒకటి కలదు. వారి వలననే ఘర్షణలు, పోరాట ములు, మారణకాండ జరుగుచున్నవి. వీరు బహుకొద్ది మందే. అయినను మూర్ఖులగుటచే ఘర్షణము కొనసాగుచుండును. కాలక్రమ మున వీరికిని సద్బుద్ధి కలుగునంత వరకు మా కృషి జరుగుచునే యుండును. శపించిననూ, శిక్షించిననూ, శాసించిననూ జీవుల యందు మార్పురాదు. ఓర్పుతో, ప్రేమతో, కరుణతో వీరికిని సన్మార్గము చూపవలెనని దైవనిర్ణయము. కరుణ లేనిచో యిట్టి కార్యము చేయుట కష్టము.

# 90

## తగ్గింపు ధరలు

ప్రచోదనము కావించుటయేకాని ప్రచారము చేయుట మా మార్గము కాదు. ఆకలిగొన్న వారి కన్నము పెట్టుటకై అన్నదాన సత్రము లుండవలెను. ఆకలిలేని వారికి తినిపించినచో, అతని అజీర్తికి బాధ్యత అన్నదాతదే అగుచున్నది కదా! తమను తాముద్ధరించుకొను ఆసక్తి కలవారికే జ్ఞానము. ఇతరులకు జ్ఞానమందించుట బాధ్యతారహితమగు చర్య. దాని పర్యవసానము తెలియుట ఆవశక్య కము. ప్రచారకులు జీవుల నాకర్షించి వారికి మార్గమును చూపుటలో తమ మెడకు గుదిబండలు వేసుకొనుచున్నారు. తమపై నాధార పడువారిని పెంచుకొనుచున్నారు. వారి యందు గురుత్వము వహించు టకై పాటుపడుచున్నారు. ఇట్టివారు వ్యామోహమునపడి జీవనము బరువు చేసుకొనుచున్నారు.

విలువైన విషయములు బజారున కెక్కించుట సంస్కృతి కాదు. పవిత్రమగు విషయములను జాగ్రత్తగ, మరుగుగ ఉంచి కాపాడు కొనుట బాధ్యత. సృష్టిలో అన్నిటికన్న పవిత్రమైనది, అమూల్యమైనది

జ్ఞానము - దాని కొఱకై వెదకు కొనువారికి దానినందించవలెను. అట్లుకానిచో నిరుపయోగము. ఆసక్తి లేనివారికి జ్ఞానము నందించి నచో వారు కూడ తమకందిన దానిని ప్రచారమే చేయుదురు కాని, దాని వలన ప్రచోదనము చెందరు.

జ్ఞానము ప్రచోదనమునకే కాని, ప్రచారమునకు కాదు. ప్రచారకులకు జ్ఞానము విలువ తెలియదు. వారు గురువును సహితము వెలగట్టి అమ్మగలరు. అవసరమైనచో ప్రత్యేక తగ్గింపు ధరలకు కూడ అమ్మివేయగలరు. మేము కోరునది ప్రచోదకులను మాత్రమే. ప్రచారకులు మాత్రము కాదు.



# 91

## జీవుని అశ్రద్ధ

**మా**నవుడు ధనము విషయమున మాత్రమే జాగ్రత్త వహించి యున్నాడు. శ్రద్ధ కలిగి యున్నాడు. దీనికి కారణము ధనము వలన సర్వ సుఖములు పొందగలడనెడి భావము, అనారోగ్యము కలిగినప్పుడే ఆరోగ్యమును గూర్చి భావన చేయుచున్నాడు. అందు శ్రద్ధ అంతంత మాత్రమే. భూమి, నీరు, గాలి యిత్యాది పంచభూతముల యెడల అతనికి శ్రద్ధ లేదు. అందువలననే పంచభూతములకు కూడ మానవుని యందు విముఖములగుచున్నవి. పంచభూతముల విలువ తెలియని మానవులకు వారి నధిష్ఠించి యున్న మనసు విలువేమి తెలియును? ఆలోచనల విలువేమి తెలియును? మానవులకు మాత్రమే ఆలోచన, వివేచన, భాషణ యీయబడినవి. కాని వాని విలువ తెలియక అతడు ప్రవర్తించుచున్నాడు. శ్రద్ధ సహజ గుణము కాబడినది. కొన్ని విషయ ములపై శ్రద్ధ, మరికొన్ని విషయములయందశ్రద్ధ, గలవారు శ్రద్ధాళువులు కాలేరు. శ్రద్ధ సహజగుణమైనచో అన్ని విషయము లందును అది భాసించగలదు. శ్రీరాముని జీవితము శ్రద్ధకు పరిపూర్ణ సంకేతము. శ్రద్ధలేనివారు ఇపుడాధ్యాత్మిక బోధన కెగబడుట కలియుగ ప్రభావమే. వారు ఆచరణమునందు శ్రద్ధలేక, ప్రచారముననే శ్రద్ధ గలిగి యున్నారు.

## 92

## ఆత్మ హంతకులు

మేమందించు బోధనలు ఏమి చేయవలెను? అనునది ప్రశ్న. కేవలము మౌనముగ ఆచరింపవలెను అనునది సమాధానము. ఆచరించుట ప్రథమ కర్తవ్యము. దాని ఫలము అనుభూతి. అనుభూతి ఆచరణకు సువాసన కలిగించును. అట్టి సువాసనకు అన్వేషకులా కర్షింపబడుదురు. ఆకర్షింపబడినవారికి వారి శ్రద్ధననుసరించి మా బోధలందించవలెను. సత్యాన్వేషకులు అన్వేషణ మార్గమున మా బోధనల సమీపమునకు చేరుదురు. అన్వేషణ లేనివారు చేరలేరు.

బోధనలనాచరించుటయే ప్రమాణము కాని జీవుల నాకర్షించుట ప్రమాణము కాదు. జీవులు ఆకర్షింపబడినపుడు బోధనము చేయుటకు ఉత్సహింపక, ఆచరణమార్గమున చూపుటయే నిజమైన బోధన. నిజమునకు ప్రవర్తనయే ప్రవచనము. కేవలము ప్రవచనములో నుపయోగమేమియును లేదు– ప్రవచనమున కాకర్షింబడక, ప్రవర్తనకు ఆకర్షింపబడుటకు శ్రద్ధయొక్కటియే పునాదికాగలదు.

శ్రద్ధ కలిగి ప్రవర్తనయందు నిమగ్నమైన వానిని నిర్లక్ష్యము,

మోసము అను శక్తులు స్పృశింపజాలవు. ఎట్టి సాధకునైనను ఈ రెండు శక్తులును ౘ్రమింగివేయగలవు. తనయందు మోసమున్నదో? లేదో? తెలియుటకు తనకన్న మించిన వారు లేరు. అట్టి వారికి సాక్ష్యమే అవసరములేదు. అంతరాత్మయే అన్నిటికిని సాక్ష్యము. అది మరుగున పడినచో, అట్టివారు ఆత్మహంతకులే! ఆత్మహంతకులకు సాక్ష్యము చూపినను చూడలేరు. ఆత్మవంతులకు సాక్ష్యమే అక్కర లేదు. సాక్ష్యము ఒక మాయ. అందులకే ఏసు సాక్ష్యము కోరలేదు. ఆత్మయే సాక్షిగ నిలబడినాడు. దేహానంతరము కూడ నిలబడి యున్నాడు. అతడు ఆత్మవంతుడు. ఆత్మహంతకులకు, ఆత్మవంతులు అర్థము కారు. కృష్ణుడు, క్రైస్తు అర్థమగుటకు ఆవగింజంత ఆత్మ చైతన్యముండవలెను.



## 93

## సర్వహుత యజ్ఞము

**ఆ**త్మవంతులు కొందరు బోధన చేయుదురు. కొందరు మౌనముగ నుందురు. కొందరు ప్రేమ, దయ పంచుచుందురు. కొందరంతర్ముఖులై యుందురు.

దేహాభిమానముగల జీవుడు దైవాభిమానము కారణముగ పరిణితిచెంది ఆత్మవంతుడగును. దేహాత్మభావనను వీడి జీవాత్మ భావనను పొంది పరమాత్మతో అనుసంధానము గావించుచున్నాడు. పరమాత్మానుసంధానము కారణముగ అతనియందు కొన్ని శక్తు లుద్భవించును. వచ్చిన శక్తులను సిద్ధులను వినియోగించుటలో అతనికి బాధ్యత యున్నది. సర్వజన శ్రేయోదాయకముగ నిర్వర్తించుట కర్తవ్యము. అట్టి కర్తవ్య నిర్వహణమున జీవుడు పురుషమేధ యజ్ఞము నిర్వర్తించుట జరుగును. తన దగ్గర చేరిన వాని నన్నంటిని జీవ శ్రేయస్సుకై సమర్పణ చేయుట చేసి, అటుపైన తనను కూడ సమర్పణ చేసుకొనుట పురుషమేధ యజ్ఞము. ఇది సర్వహుత యజ్ఞము. ఇందు జీవుడు తనతో సహా సమస్తమును సమర్పణ చేయును. సర్వము

ఆహుతి యగుటయే సర్వహుత యజ్ఞము. వేదమున ఈ యజ్ఞము కీర్తింపబడినది. శ్రీకృష్ణుని జీవితమట్లు సాగినది. మరల ఏసుక్రీస్తు భగవద్భక్తితో ఈ యజ్ఞమును చేసి విశ్వవ్యాప్తమైనాడు. దైవమై నిలచినాడు. Last supper సందేశ మిదియే. ఏసు దానిని చివరి భోజనమనెను. ఆ భోజనమునకు భోక్త దైవమే. భుజింపబడువాడు ఏసు. ఈ మార్గమునే భాగవతమున సమర్పణ మనిరి. "తమను" మరియు "తమవి"– జీవులకు సమర్పించుకొనువారే, సమర్పణము చెందినవారు.

## 94

## సున్నిత సంబంధము

మైత్రేయ సంఘము అతి ప్రాచీనమైనది. ఈ సంఘమున ఒకే చైతన్యము చాలా దేహములయందు పనిచేయుచున్నది. దాని యందు పనిచేయునది కృష్ణచైతన్యమే. అందరి జీవాత్మలు కృష్ణ చైతన్యమునకు వాహికలు. వారి వారి శరీరములు జగత్ కళ్యాణమున కున్ముఖమైయుండును. కృష్ణునికి మేమందరము స్నేహితులమే. అందరి యందు అతనికి మిత్రత్వముండుటచేత ఇది మిత్ర సంఘమైనది. మైత్రేయ సంఘమనగా కృష్ణుని మిత్రుల సంఘమే. కృష్ణుడనగా జగన్నాథుడే. అది విశ్వవ్యాపకమైన చైతన్యము. దానియందహర్నిశలు జీవించువారు మైత్రేయ సంఘ సభ్యులు.

శ్రీకృష్ణుడు వీరందరియందును మిత్రత్వము వహించినను, సంఘమందలి సభ్యులు కృష్ణుని మిత్రులనుకొనరు. వారి కతడు గురువు, దైవము. గురువు, దైవము వాత్సల్యకారణముగ మిత్రత్వము చూపుదురు. అంత మాత్రమున కృష్ణ చైతన్యమునందు జీవించుచున్న సభ్యులు కృష్ణునితో మిత్రులవలె ప్రవర్తించక, భక్తులవలెను, శిష్యుల

వలెను ప్రవర్తింతురు. మిత్రత్వము చూపుచున్న సద్గురువును మిత్రుడను కొనుట అవివేకము. మిత్రత్వము సలుపుట అతని వాత్సల్యమే కాని తన అర్హతకాదని శిష్యుడెరుగవలెను. అట్లు కానిచో శిష్యుడహంకార మునపడును. ఈ సున్నితమైన గురు శిష్య సంబంధము గమనార్హము.

# 95

## జాలి - దయ

**జా**లిపడుట దయచూపుట కాదు. జాలివేరు, దయవేరు. జాలి పడువారు జాలిని కోరుదురు కూడ. తమపై ఎవరికిని జాలిలేదని కూడ వారికనిపించుచుండును. తానితరులపై జూపిన జాలి తనపై నెవ్వరును చూపుట లేదని కూడ జాలిపడుదురు. దుఃఖింతురు కూడ. ఆ దుఃఖము నుండి ఇతరులపై ఆరోపణలు చేయుట ప్రారంభింతురు. తమను గూర్చి ఎవరును పట్టించుకొనుట లేదని రోషము చెందుదురు. తమలో గల జాలి తమపై ఆవరించి చైతన్యమునకు అవరోహణము కలిగించుకొనుచుందురు. వారి దుఃఖము, ద్వేషము, రోషము కారణ ముగ రోగగ్రస్తులు కూడ నగుదురు.

దయ, జాలివంటిది కాదు. దయకలవాడు, ఇతరులకష్టములను చూచి కేవలము జాలిపడక వారికేమి కావలయునో బుద్ధి నుండి గ్రహించి నిర్వర్తించును. వారి కష్టనష్టములను తన లోనికి గొనక వారికి సహాయ సహకారములందించును. దయ గలవాడు, జాలి గలవాడివలె దుఃఖించడు. కర్తవ్యనిర్వహణమే గావించును. జాలి

హృదయదౌర్బల్యము కలిగించును. దయ, హృదయ వికాసమును గావించును.

జాలి విషయమున "జాలిపడుట" అందురు. దయ విషయమున "దయ చూపుట" అందురు. ఒకటి పడుట కాగ రెండవది చూపుట యుండును. పడుటకన్న చూపించుట మేలు కదా! హృదయమునందలి పురుషప్రజ్ఞ - దయ. స్త్రీ ప్రజ్ఞ - జాలి.

# 96

## జాతులు - కులములు

మైత్రేయ మార్గమున తెలుసుకొనుచు ఆచరించుటయే కాని తెలియచెప్పుటయుండదు. తెలియచెప్పుట వలన తెలుసుకొనుట జరుగదు. ఎదుటివానికి దాహమైనప్పుడు తెలిసికొని త్రాగునీరందించుట తెలివి. "మంచి నీరిత్తురా?" అని కోరిన తరువాత ఇచ్చుట అంత తెలివైన పనికాదు.

తెలుసుకొనుచు నిర్వర్తించువారు ఉత్తములు. వారికి ఆటంకములుండవు. తెలియ జెప్పినను, నిర్వర్తించనివారికి ఆటంకములు మెండుగనుండును. మరల, మరల తెలిపినను నిర్వర్తించని వారి విషయమున ఏమి చేయవలెను? వేచియుండుటయే మార్గము.

ఇట్లు ఆస్తిక సమాజమున నాలుగు జాతులు కనపడుచున్నవి. ఆస్తికులే యిట్లుండ, స్వార్థపరులు, హింసాత్మకులు, దోపిడి దారులైన మానవుల గూర్చి భావించునపుడు వారు పంచమజాతి వారగుదురు.

ఈ పాఠము చదువుకొను పాఠకుడు, తానేజాతివాడో తానుగ నిర్ణయించుకొనవచ్చును. మీ కులము నిర్ణయించుకొనునది మీరే. మార్చుకొనుశక్తి కూడ మీ యందే యున్నది. అది మీకు దైవమందించిన స్వేచ్ఛ. ఇది తెలుపుట దైవము మాకందించిన కర్తవ్యము.

## 97

## ఒక పొడుపు కథ

అతి ప్రాచీన కాలమున హిందువులు ఒక పిట్టకథను చెప్పుకొనుచుండెడివారు. ఆర్యులలో మొదటి తెగవారే హిందువులు. ఆర్యులలో జ్యేష్టులు వారే. వారు చెప్పుకొను కథ యిట్లున్నది.

అనగ అనగ ఒక రాజ్యములో ఒక మహామృగముండెడిది. అది రోజున కొక జీవుని చొప్పున భక్షించుచుండెడిది. ఆ మృగము ఆకాశమున ఎగురగలదు. భూమిపై పరుగిడగలదు. నీటిలో ఈద గలదు. దానికి ముందు చూపేగాని వెనుక చూపు లేదు. అది, అడ్డు, ఆపులేక జీవులను భక్షించుచునే యుండెడిది. ఒకనాడు దాని కంటికొక యోగి కనిపించెను. అతనిని భక్షించుట కుద్యమించెను. యోగి నవ్వుకొని పరుగెత్తుచు, సమీపమున గల ఒక మహా సరస్సున జొరపడెను. మృగము కూడ జొరపడినది. మృగము యోగి కొఱకై వెతుకుచుండగ యోగి మృగము వీపు పైకెక్కి కూర్చుండెను. వెనుక చూపు లేని మృగము యోగికై వెతుకుచునుండెను. యోగి కనపడక పోగ క్రమముగ మృగమునకు పంతము పెరిగెను. యోగికొరకై వెతుకుట సాగించెను. నేటికిని వెదకులాడుకొనుచునే యున్నది. యోగి మృగము వీపున తన యోగమును సాగించుచునే యున్నాడు.

పై కథను విప్పుకొనుట సాధకుల కర్తవ్యము.

# 98

## అశ్వఘోషుడు

**యో**గసాధనయందు తీవ్ర తపన కలవానిని 'అవకరుడు' అని బోధించెదము. అవకరమనగా వంకరయని అర్థము కాదు. 'అవకరుడన'గా సాధన రూపమున సమస్త మలినములను నిర్మూలించుకొనువాడు. అజ్ఞానమును, అసంగమను అస్త్రముతో ఖండించువాడు.

అవకరణకు ప్రకృతి అందమే స్ఫూర్తినందించుచుండును. ప్రకృతి అందమును సృష్టియందు దర్శించగలవాడు సమర్థుడు. అశ్వఘోషుడు అట్లు దర్శించెను. అశ్వఘోషుడు రహదారి కూడలిలో నిలబడి చిత్రలేఖనము చేసెడివాడు. అతని చిత్రములన్నియు సమకాలిక మానవులకు స్ఫూర్తి కలిగించుచుండెడివి. స్ఫూర్తి కలవారే స్ఫూర్తినందివ్వగలరు. అందము నారాధించుట వలన అశ్వఘోషున కట్టి స్ఫూర్తి కలిగినది. ఆట, పాట రంగులు ఆనందము కలిగించనిచో ఆ జీవికి స్ఫూర్తినందు అవకాశము తక్కువ. వాని కొఱకు ప్రత్యేకముగ మీరేర్పరచుకొనిన సినిమా థియేటర్‌లకు మేము కూడ అప్పుడప్పుడు

(టికెట్టు కొని) వచ్చుచుందుము. సినిమాలు దర్శించినపుడు, వాని ఆవశ్యకత జాతికి తగుమాత్రమే అనిపించుచుండును.

నిత్య జీవితమే ఒక సినిమా. దీనిని గమనించుట నేర్చినచో దాని దర్శకుడు. నిర్మాత యొక్క చాతుర్యము మనలను అబ్బుర పరచగలదు. ప్రకృతి యందుగాని, మానవుని ప్రవర్తనయందు గాని, అంతర్యామిని దర్శించుట, అందమును దర్శించుటే. అతని లీలలుయే పశుపక్ష్యాదులు, సమస్త మానవుల ప్రవర్తనలును. అంతర్యామి సృష్టి నుండి, సృష్టి జీవులనుండి తొంగి చూచుచుండును. తొణికిసలాడు చుండును. మిరుమిట్లు కొలుపుచుండును. దిగ్భ్రాంతి కలిగించు చుండును. భయభ్రాంతులను కూడ కలిగించుచుండును. అతనిని చూచువారికి సృష్టి అందమే గోచరించును. అశ్వఘోషుడట్లు దర్శించి, స్పందించి, చిత్రించి జనసమూహములను ఉత్తేజపరచినాడు. అతడు కేవలము చిత్రకారుడు కాదు. తీవ్రమగు సాధకుడు. తాను దర్శించిన అంతర్యామి అందమును చిత్రముల బంధించు ప్రయత్నమున సిద్ధుడైనాడు. అతడు నిజమగు యుపాసకుడు. అందము తీరుతెన్ను లెరిగినవాడు.

## 99

# సమయస్ఫూర్తి

**కా**ర్యములకు శుభలగ్నములు, తేదీలు నిర్ణయించుకొనుట వానిని సకాలమున పూర్తి గావించుకొనుట ఒక క్రమశిక్షణ. దైనందిన జీవితమున నిదురలేచుటకు, స్నానాదికములను గావించుకొనుటకు, దైవప్రార్థనల నిర్వర్తించుకొనుటకు, దైనందిన కార్యముల కొరకు ఆహార విహారములకొరకు కాలనిర్ణయము జరుగవలెను. కాలమును నిర్ణయించి పాటించిన వారికి సంకల్పబలము పెరుగును. బలము సంకల్పసిద్ధిని కూడ నిచ్చును. కాలము విషయమున అశ్రద్ధ పనికి రాదు. అలసత్వముండరాదు. నిర్ణీత సమయమునకు కార్యములు నిర్వర్తించువారు సమర్థులు కాగలరు. సర్వసమర్థతకు సమయ పాలనమే ముఖ్యము. సూర్యచంద్రులు, గ్రహగోళాదులు కాలమునే దైవముగ భావించి ప్రవర్తింతురు. అట్లే సమస్త దేవతలును.

కాలమును వ్యర్థము చేయువారు, నిజమగు వ్యర్థులు. వారు ఊబినేలపై నడుచునటువంటివారు. ఇట్టి వారియందు అశ్రద్ధ, సోమరి తనము తెలియకయే పెరిగి, తామున్న స్థితి నుండి కూడ దిగజారుట జరుగును.

కార్యములకు కాలము నిర్ణయించువారు, కాలమునను సరించుటలో సూక్ష్మ లోకమునందు వారికి తెలియకయే మార్గమును పటిష్టము గావించుకొనుచున్నారు. విఘ్నములను లోయలపై తెలియకయే సూక్ష్మమగు వంతెనలను నిర్మించుకొనుచున్నారు. కాలానుగుణ్యముగ జీవితమును నడుపుకొనువారిని కాలమే అన్ని సమస్యల నుండి ఉద్ధరించును. సమస్యలు కలిగినపుడు తగు స్ఫూర్తి నిచ్చును. ధర్మజుడట్లేనడచెను. యక్ష ప్రశ్నల సమయమున, నహుష ప్రశ్నల సమయమున, స్వర్గారోహణ సమయమున, అతని కందిన పరిష్కారము, అతని స్ఫూర్తి నుండి కలిగిన పరిష్కారమే. ఆ స్ఫూర్తి సమయస్ఫూర్తి. సమయస్ఫూర్తి, కాలము యొక్క అనుగ్రహమే. సమయపాలనమే వలసిన దీక్ష.

## 100

# మైత్రేయ మార్గము

**జీ**వితమున విజయములు కలుగుచున్న కొద్ది బాధ్యతలు పెరుగును. ఉత్తమమైన పరీక్ష యందు జయము పొందినవాడు ఉత్తమమైన బాధ్యతను చేపట్టుటకే పరీక్ష. ఉత్తమమగు శక్తి గలవారు ఆ శక్తిని కార్యనిర్వహణమున నిలిపి జగత్ కళ్యాణమగు కార్యములను చేయుదురు. ఉత్తమమగు బుద్ధి వికాశము కలిగినప్పుడు అందుండి జన్మించు సిద్ధులకు, బాధ్యతలను పెంచునే గాని తగ్గించవు. ఉత్తము లకు బాధ్యత మెండు. ఉత్తమపురుషుడగు శ్రీరాముని జీవనము బాధ్యతామయమే.

బాధ్యత యందు రుచి గలవారే ఉత్తమత్త్వము కొఱకు నిజముగ పాటుపడుచుందురు. హక్కులకు పాటుపడువారు, ప్రపంచమున ఉత్తమపదవు లందున్నను వానిని నిలుపుకొనలేరు. బాధ్యత, ఉత్తమత్త్వము రెండును బొమ్మ బొరుసుల వంటివి. బాధ్యతకే ఎగబ్రాకుట మైత్రేయ మార్గము. హక్కులకై పోరాడుట కలిమార్గము.

# 101

## శిశు పోషణ

**శి**శుపోషణ విషయమున తల్లిదండ్రులు చేయు కృషి, మమకార పూరితము. ఆటబొమ్మలు, ఐస్‌క్రీమ్‌లు, చాక్‌లెట్‌లు, రంగురంగుల దుస్తులు, పాదరక్షలు అమర్చుటలో సతమతమగు తల్లి దండ్రులు, జీవపోషణకేమియు చేయుటలేదు. దేహపోషణము మాత్రమే చేయుచున్నారు.

మరికొందరు, ఆవేశముతో దైవ మంత్రములు, స్తోత్రములు, శతకములు, పిల్లలపై రుద్ది, వారు వల్లించునపుడు గర్వపడుచున్నారు. పిల్లలకు మంచి విషయములు నేర్పుచున్నామని, తెలియక అహంకార పడుచున్నారు.

నిజముగ పిల్లల యందాసక్తి మీకున్నచో వారికి రెండు విషయములు నేర్పుడు.

1. వారిని తరచుగ మన ప్రదేశములకు, ఎత్తైన కొండ ప్రదేశములకు కొని పోవుచుండుడు. ఎత్తైన వృక్షముల క్రింద నివసింప

చేయుడు. గడ్డి మొక్కలతోను, పువ్వులతోను, ప్రకృతి రంగులతోను కలిసి ఆడుకొననిండు, అట్టి ప్రదేశముల యందు, ప్రకృతినుండి విద్యుత్తు, ప్రాణము మిక్కుటముగ లభించును. పదకొండువందల అడుగుల పై ఎత్తుగల ప్రదేశములన్నియు, ప్రాణమయములే. విద్యుత్ మయములే. విద్యుత్తు తెలివిని పోషించగ, ప్రాణము దేహమును పోషించగలదు.

చిన్నతనమున అడవులలో పెరిగిన పాండవులకు, అంతఃపురములలో పెరిగిన కౌరవులకు, ప్రాథమికముగ నేర్పడిన వ్యత్యాస మిదియే.

2. పిల్లలు పెరుగు, పరిసరములు ప్రత్యేకముగ నుంచు కొనవలెను. పట్టణములలో నెరిగిన వారికన్న పల్లెలలో పెరుగు వారు బలవంతులగుదురు. (ప్రాణపరముగ, చేతనపరముగ) పల్లెలలో పెరిగిన వారికన్న వనములలో పెరిగినవారు, మరింత పటిష్ట వంతులగుదురు. వనములలో విద్యాలయములేర్పరచి మమకార పడక, చిన్నతనముననే ఆ విద్యాలయములకు పంపి సంస్కారవంతు లగు ఉపాధ్యాయులచే విద్యలభ్యసింప చేసినచో తల్లిదండ్రులు తమ కర్తవ్యమును సక్రమముగ నిర్వర్తించిన వారగుదురు. లేనిచో గమ్యమును చేరు జీవులుగ కాక చర్విత చర్వణులై సంసార చక్రమున పడి జనన, మరణములకు లోబడు జీవులుగ నేర్పడుదురు.

## 102

## బృందము - జీవము

**బృం**దములందు, స్త్రీలు, పురుషులు, పిల్లలు కలసిమెలసి మెలగవచ్చునా? లేక వారి మధ్య వ్యత్యాసము చూపవలెనా? తప్పక బృందమందు అందరును ఉండవచ్చును. కాని ప్రకృతి సిద్ధమగు కొన్ని వ్యత్యాసములు మన్నించుట శ్రేయస్కరము. ఒకే వృక్షమునకు వివిధమగు శాఖలున్నవి కదా! ఒక శాఖ తీరునకు మరియొక శాఖ తీరునకు వ్యత్యాసముండుట కూడ సహజమే అని గుర్తింపవలెను. వ్యత్యాసములతో కూడిన శాఖలతో ఒక వృక్షమున్నట్లే ఒక బృంద మందుగల సభ్యుల మధ్య ఏకత్వమందు సహజమగు భిన్నత్వమును గుర్తించి మన్నింపవలెను. పిల్లలు పిల్లలే, వారు పెద్దలు కారు. జీవ పరముగ పెద్దలే అయివుండవచ్చుగాని, దేహపరముగ, మానసిక పరముగ కారు. అట్లే పురుషులు పురుషులే. స్త్రీలు స్త్రీలే. పురుషులు, స్త్రీలు కాలేరు. స్త్రీలు, పురుషులు కాక సంఘమందు వృద్ధులుందురు. వారి జీవితానుభవము ఇతరులు తెలియవలసిన ఆవశ్యకతయున్నది. పెద్ద కొమ్మలు, చిన్న కొమ్మలు, రెమ్మలువలె వృద్ధులు, స్త్రీ పురుషులు,

పిల్లలు కలసిన బృందమే అందము. వృక్షము కూడ పెద్ద, చిన్న, బుల్లి కొమ్మలతో అలరారుచుండును.

ఒక బృందమున వృద్ధులకు, స్త్రీలకు, పురుషులకు పిల్లలకు ప్రత్యేక కార్యక్రమములుండవలెను. అందరు కలిసి పాల్గొను కార్యక్రమములు కూడ ఉండవలెను. ఏకత్వమందు భిన్నత్వము, భిన్నత్వమందు ఏకత్వము గమనించి తదనుగుణముగ కార్యక్రమముల నేర్పరచు బృందగణపతి, బృందములకు సరియైన పురోగతి నందించ గలడు. అందరికిని వారి సహజ సమర్థతకు సరిపడురీతిని కార్యక్రమ ములను రూపొందించవలెను. ఒకరి కార్యక్రమములకు మరియొకరి కార్యక్రమములకు సహకారముండునట్లు కూడ ఏర్పాటు చేయవలెను.

పై విధముగ యుక్తి యుక్తముగ బృందమునందు కార్యము లేర్పరచినచో వృక్షమువలె బృందము కూడ కలకాలము సమాజ సేవలందించగలదు. ఈ జ్ఞానము లేక బృందములను నిర్మించుట వ్యర్థము. ఈ జ్ఞానమే, బృందములకు ప్రాణము.

**103**

# సూటి మార్గము

**ఆ**త్మ విచారము తామర తంపరయై, అడవివలె పెరిగినపుడు, ఆధ్యాత్మిక మార్గములు అగమ్యగోచరమగును. సామాన్యునికి, దిక్కుతెలియని స్థితి ఏర్పడును. పలువురు, పలు రకములుగ పలుతావులలో చేయు ఉద్భోధనలు తికమకపెట్టును. ఆత్మ సాధకునకు మార్గము తెలియక కలవరము మొదలగును. అంతయు అయోమయమగును.

ఇట్టి సమయములలో పరిష్కారమొక్కటే. బాహ్యమగు విషయములను విసర్జించి, నీ హృదయమున నీవు, దైవమును చూడుము. నీ హృదయమునందే అతడున్నాడు. అచటనే వెదకుము. అందరితోను హృదయసంబంధమే కలిగియుండుము. దైవము హృదయున సన్నిహితమగు మిత్రుడు. అతనికి గల ప్రేమ అపరిమితము. అది సామాన్యముగ బయట దొరకదు. అరుదుగ బాహ్యమున కూడ అతడు తన ప్రేమను జీవుల రూపమున రుచి చూపించుచుండును. అంతరంగమున అది ఎప్పుడును లభ్యమే.

హృదయ సంబంధమే నిజమగు దైవ సంబంధము. ఇతరములన్నీ బంధములే గాని సంబంధములు కాజాలవు.

# 104

## కలుపు మొక్కలు

**యాం**త్రిక జీవనమున జీవము తక్కువ. సహజీవనమున జీవమెక్కువ. సహజీవనము సరియగు మార్గమున నడచినచో, దివ్య జీవనమునకు అవకాశమేర్పడును. దివ్యజీవనమునకు ఉత్సహించి కొన్ని కుటుంబములొకచోట జేరి జీవించుటకు ప్రయత్నింతురు. దైనందిన కార్యక్రమముల నేర్పరతురు. ఉత్సాహముతో కార్యక్రమములు నిర్వర్తించుచుండగ, కాలక్రమమున అట్టి జీవనము కూడ యాంత్రికమగు అపాయము కలదు. మానవులేర్పరచుకొన్న ఆశ్రమములన్నియు కాలక్రమమున యాంత్రికములై నిర్జీవమగుచున్నవి. అట్లుకాక సజీవమై యుండవలెనన్నచో, సంఘమున నూతన సభ్యులు చేరుచుండవలెను. నూతన కార్యక్రమములు కూడ సృజనాత్మకముగ నేర్పరచుకొనుచుండవలెను.

క్రొత్తవారి నంగీకరించుటకు ఉన్న వారికి పెద్ద మనసుండవలెను. మానవుని మనస్సు, ప్రతి విషయమునందును స్థిరపడుటకు ప్రయత్నము చేయుచుండును. యతీశ్వరులు సైతము మూడు

రాత్రులకన్న ఒక ప్రదేశమున నున్నచో మనస్సచ్చట స్థిరపడుటకై యత్నించునని భావించి, సంచారము చేయుచుందురు. సామాన్య మానవుల విషయమున కుర్చీనుండి పడక వరకు సొంతము చేసుకొను బుద్ధి మిక్కుటముగ నుండును. అట్టి స్థితిలో క్రొత్తవారు చేరునపుడు ఆదరించి తాము చేయుచున్న పనిలో ప్రవేశము కల్పించి తమలో కలుపుకొనుటకు చాల పెద్ద మనస్సు అవసరము. ఇట్టి పెద్దమనస్సున్న వారే బృందములో పెద్దవారు. లేనివారు బృందము యొక్క ఆయుర్దాయమునకు తెలియక గండి కొడుదురు. నూతనముగ వచ్చిన వారిలో గల సామర్థ్యమును, నైపుణ్యమును గుర్తించి తగు రీతిని వారికిని కార్యక్రమములయందు బాధ్యత ఏర్పరచుట సహకారమునకు సంకేతము. సహకారము లేని సంగములు, బృంద జీవనములు, నామ మాత్రములై సదాశయమను విత్తనమునకు జన్మించిన కలుపు మొక్కలుగ భాసించును. సహకార ఉద్యమమునకు ఇవి వెక్కిరింతై గోచరించును.



# 105

## సదాచారము

**మా**నవజాతి యందు లెక్క లేనన్ని అస్వస్థతలున్నవి. లక్షల సంవత్సరముల నుండి, అజ్ఞానము కారణముగ జాతి యొనర్చిన దుష్కృత్యములు జాతి కర్మగ స్థిరపడి మానవుని బాధించుచున్నవి. మోటు మనుషుల కన్న సున్నితమైన మనస్సు గలవారికే, వ్యాధుల బాధ యెక్కువ. అందున దైవము ధర్మము, దయ, సత్యము, సత్కర్మ అను గుణములు నాశ్రయించిన వారికి వ్యాధుల ఆటుపోట్లు మరింత ఎక్కువగ నుండును.

వారి శరీర ధాతువులు అహింసా మార్గమున సున్నితమగు చుండగ, వాతావరణ మందలి కాలుష్యము వారిని అంటుట సులభ మగుచుండును. కావున అట్టివారు సామాన్యులకన్న కొంత భిన్నమైన ఆహార వ్యవహారాదులను ఏర్పరచుకొనవలసి యుండును.

ఆచారము పేరున పెద్దలు ఈ రక్షణ కల్పించిరి. సదాచార మందు యిట్టి శ్రేయస్సు యిమిడి యున్నదని సాధకులు గ్రహించ

వలెను. శుచి, శుభ్రత, దైనందిన దైవప్రార్థన, సదాచారములోని భాగములు. వీనిని అశ్రద్ధ చేయుట తగదు. మానవ సమాజమున ధార్మిక సంపత్తి కలవారు సదాచారము నవలంబించుటలో చాల వ్యాధుల నుండి పరిరక్షించుకొనగలరు. సదాచారము విషయమున అశ్రద్ధ గలవారు కంటినొప్పి, పంటిగొప్పి, అజీర్తి, ఇత్యాది బాధలకు తరచు గురి కాగలరు. సత్సాధకులు దీనిని గమనించుదురు గాక!



## 106

## విచికిత్సలు

మీ మానవ సంఘమునందు అధికారమును గూర్చి, హక్కులను గూర్చి, సహకారమును గూర్చి సుహృత్ భావమును గూర్చి అనేకానేక విచికిత్సలు జరుగుచుండును. అట్లే పేదరిక నిర్మూలనమును గూర్చి అనారోగ్య పరిస్థితులను గూర్చి, రోగములను గూర్చి ఆరోగ్యమును గూర్చి సదస్సులు జరుగు చుండును. సంఘమందలి సమస్త సమస్యలను గూర్చి, కోట్లాది ధనము ఖర్చుచేయుచు భౌగోళికముగ విచికిత్సలు జరుగుచుండును. సదస్సులలో తీర్మానములు కూడ చేయుచుందురు. ఆచరణ అంతంతమాత్రమే. విచికిత్స ఎక్కువ, ఆచరణ తక్కువ. ఈ విచికిత్స జాతికి ప్రధానమైన రుగ్మతగ మాకు గోచరించుచుండును.

సదస్సులు నిర్వహించి, విచికిత్సచేసి, కారణములు వెదకి, తీర్మానములు చేసి, వాటిని ఉల్లంఘించుట చేయుదురు. 'ఉల్లంఘించుటకే కదా తీర్మానములు !' అను భావము కూడ హాస్యముగ మీరు వ్యక్తము చేయుదురు. అందు సత్యము సమృద్ధిగ నున్నదని

గమనింపవలెను. హాస్యమునకు పలికిన మాటలలో సత్యము లప్రయత్నముగ బయల్పడును. ఈ సదస్సుల యందు ప్రజలు విశ్వాసమును కూడ కోల్పోయెదరు. కంటి తుడుపు సదస్సులే కాని మరియొకటి కాదను భావన కూడ వ్యక్తమగుచుండును.

ఉదాహరణకు ప్రజాస్వామ్యమని ప్రస్తుత శతాబ్దముల యందు మీరు చేయు కేకలు మిన్నంటుచున్నవి కాని మచ్చునకైనను మానవ సంఘములలో ప్రజాస్వామ్యము గోచరింపదు.

సదస్సులు, విచికిత్సలు, తీర్మానములు, ఉల్లంఘనలు జాతి జీవనశైలియై నిలచినది. త్రికరణ శుద్ధి, దీక్షాయుత జీవనము మృగ్య మైనప్పుడు, వ్యక్తికిని సంఘమునకు కీడేగాని మేలు జరుగదు. పై కారణముగ నా అనుయాయులకును తెలియజేయు విషయమొక్కటే! తెలిసినది ఆచరింపుడు. విచికిత్సలు విసర్జింపుడు.



# 107

## రహస్య భాషణము

**య**తీశ్వరుడొకడు తరచు జంతువులతో మాటాడుచుండెడివాడు. అతని నివాసము ఒక వనప్రదేశమున నుండెడిది. ఆ వనమందు తేనెపట్లు యున్నవి. చీమలు పెట్టిన పుట్టలున్నవి. రామచిలుక లుండెడివి. ఇన్నిటితోపాటు కోతి యొకటి యుండెడిది.

యతి వానితో తరచు సంభాషించుచుండెడివాడు. అతడు చీమలతో యిట్లను చుండెను. "శ్రామికులారా! మీ పరిశ్రమ నెవరు గుర్తింతురు. మీ పరిశ్రమ కారణముగనే ఉన్నతోన్నతమైన మహానగరములు నిర్మింపబడచున్నవి. విష సర్పములందుచేరి మిమ్ములను పారద్రోలుచున్నవి."

అతడు తేనెటీగలను చూచి యిట్లు సంబోధించుచుండెను.

"జ్ఞానులారా! శ్రమకోర్చి, స్వాధ్యాయము కావించి, జాతి ఉన్నతికై మాధుర్యమును పోగుచేయుచున్నారు. అట్లు ప్రోగు చేయుటలో గల మాధుర్యము మిమ్ము ఈ కార్యమున నిలిపినది.

జాతి మీరందించు మాధుర్యమును అంగళ్ళలో అమ్ముకొనుచున్నారే, కాని అనుభవించుట లేదు. మీశ్రమా మాధుర్యము యీ జాతి కబ్బదు. ఐనను మీరు కొనసాగించు శ్రమ దైవమునకు ప్రీతి కలిగించుచున్నది. అట్లే కానిండు."

యతి చిలుకలను చూచి యిట్లనుచుండెను. "ప్రచారకుడా! "చిలుక పలుకులు పలుకుదువు, కులుకుతు తిరిగెదవు, చిలుక కొట్టుడు, కొట్టెదవు, భవిష్యత్తున తప్పక మత ప్రచారకుడవు కాగలవు. అతడు నీ వలనే ప్రదర్శకుడే. ఆచార్యుడు కాడు కదా! కులుకుచు తిరుగును. చిలుక కొట్టుడు కొట్టుచుండును. చిలుక పలుకులు పలుకు చుండును. మీ బోటి వారి వలన సంఘమున కేమియు ప్రయోజనము లేదు. వ్యర్థజీవనులు"

యతి కోతిని చూచి యిట్లనుచుండెడివాడు "విధ్వంసకుడా! నీవనుభవింపలేవు. ఇతరులననుభవింపనీయవు. సర్వమును ధ్వంసము చేయుదువు. నీవు నిజముగ కోతివే. నీ నుండి మానవులు పుట్టుట అసత్యము. కాని మానవుల నుండి నీవు నిత్యము పుట్టు చుందువు. నీవు యితరుల శ్రమను ధ్వంసము చేయుటయే పనిగ పెట్టుకున్నావు."

యతిబోధలు ఆకాశ తరంగములలో చేరి భూమి చుట్టును నేటికిని పరిభ్రమించుచున్నవి. చెవులున్న వారికి వినబడగలవు.

## 108

## దేవ-దానవులు

**మా**నవులకు దైవమిచ్చిన వరము సంకల్ప బలము, బుద్ధి, సంకల్ప బలము మహిమ మానవులకు పూర్ణముగ తెలియదు. తెలిసిన సరిసమానమగు బుద్ధిబలము లేనప్పుడు రాక్షసులగుచున్నారు. సంకల్పబలమునకు బుద్ధి బలము తోడై నిలచినచో మానవుని పురోగతి త్వరిత గతిని సాగగలదు. సంకల్పబలము కుమారుని వంటిది. బుద్ధిబలము గణపతి వంటిది. గ్రహపరముగ సంకల్ప బలము కుజగ్రహమునుండి, బుద్ధిబలము బృహస్పతి నుండి, మానవులకు లభించుచుండును. పై కారణముగనే తెలిసిన వారైన హిందువులు శివతనయుని పార్వతీ తనయుని ప్రార్థింతురు.

పూర్వకాలమున సంకల్పము కలిగిన మానవులు పర్వతము లను సైతము అట్టి బలముచే కదిలించుట, స్థలమార్పు చేయుట వంటివి గావించినారు. అది ప్రస్తుతము మహాత్మ్యముగ కనపడ వచ్చును. అది మహాత్మ్యము కాదు, మాగ్నటిజమ్ అయస్కాంతశక్తి. మనిషి యందు అయస్కాంత శక్తి వెనుక గల బలము సంకల్పము,

బుద్ధియే అని ఎరుగవలెను. మహాత్ముల యందు, సద్గురువుల యందు ఈ రెండు బలములు దర్శనమిచ్చుచుండును. జాతిపిత యని అందరిచే గౌరవింపబడిన మహాత్మా గాంధి యందు కూడ ఈ దివ్య శక్తులే ప్రవేశించి, కార్యమును నిర్వర్తించినవి.

సంకల్పశక్తి వాడియైన బాణముకన్న పదునైనది. దానిని దిశా నిర్దేశము చేయునది బుద్ధి. బుద్ధి అధ్యక్షతన సంకల్పము నిర్వర్తింప బడవలెననుటకు సంకేతమే గణపతి గురుత్వము, కుమారుని శిష్యత్వము. బుద్ధి అధిష్ఠించి, సంకల్పము నిర్వర్తింపబడినచో మానవుడు దివ్యత్వము నొందుచుండును. బుద్ధి లోపించినచో మానవుడు దానవుడగును. రామ రావణులకు, కర్ణార్జునులకు ఇదియే భేదము.



## OTHER BOOKS THROUGH MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

| | | |
|---|---|---|
| 1. | Agni (E/G/S) | 60-00 |
| 2. | Amanaskudu (T/K) | 18-00 |
| 3. | Antardarsana Dhyanamulu (T) | 100-00 |
| 4. | Anveshakudu (T) | 60-00 |
| 5. | Asangudu (T) | 15-00 |
| 6. | Ashram Leaves (E/G/S) | 100-00 |
| 7. | Ayurvedic Principles (E) | |
| 8. | Bharateeya Sampradayamu (T/Hi) | 10-00 |
| 9. | Cow ('Govu' Mahatyam Vivarana) (E/T/K) | 20-00 |
| 10. | Devapi Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 11. | Dhanakamuni Katha (T) | 25-00 |
| 12. | Doctorine of Eternal Presence (E) | 10-00 |
| 13. | Gayatri Mantra - Avagahana (T) | 10-00 |
| 14. | Geetopanishad - Gnana Yogamu (T) | 25-00 |
| 15. | Geetopanishad - Karma Yogamu (T) | 20-00 |
| 16. | Geetopanishad - Sankhya Yogamu (T) | 25-00 |
| 17. | Geetopanishad - Karmasanyasa Yogamu (T) | 20-00 |
| 18. | Geetopanishad - Dhyana Yogamu (T) | 40-00 |
| 19. | Good Friday (E/G/S/F/H) | 10-00 |
| 20. | Gurupaduka Sthavam (E) | |
| 21. | Health & Harmony (E) | 120-00 |
| 22. | Hercules-The Man and the Symbol (E/G/S/F) | 100-00 |
| 23. | Himalaya Guru Parampara (T/Hi) | 12-00 |
| 24. | Jupiter-The Path of Expansion (E/G/S) | 40-00 |
| 25. | Jyotirlinga Yatra (T) | 20-00 |
| 26. | Katha Deepika (T) | 40-00 |
| 27. | Listening to Invisible Master (E/G/S/F/H) | 20-00 |
| 28. | Lord Maitreya-The World Teacher (E/G/S/F/H) | |
| 29. | Maitreya Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 30. | Mana Mastaru Garu (T) | 60-00 |
| 31. | Mantrams-Their Significance and Practice (E/G/S) | 35-00 |

| | | |
|---|---|---|
| 32. | Maria Magdalena (E/S/G/F) | |
| 33. | Marriage-A Sacrament (E) | |
| 34. | Maruvu Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 35. | Master C.V.V. (Birthday Message) (T) | 30-00 |
| 36. | Master C.V.V. Noothana Yogamu (T) | 20-00 |
| 37. | Master C.V.V. Yogamu (T) | 20-00 |
| 38. | Master C.V.V. Yogamu-Karma Rahityamu (T) | 10-00 |
| 39. | Master C.V.V. - May Call !(E/G/S) | 100-00 |
| 40. | Master C.V.V. - May Call ! II (E) | 100-00 |
| 41. | Master C.V.V. The Initiator - Master E.K. The Inspiror (E) | 15-00 |
| 42. | Master C.V.V. - Saturn Regulations | 125-00 |
| 43. | Master E.K. - The New Age Teacher (E/G/S) | 70-00 |
| 44. | Mithila-A New Age Syllabus (E/G/S) | 100-00 |
| 45. | Occult Meditations (E/G/S) | 100-00 |
| 46. | Omkaram (T) | 30-00 |
| 47. | On Change (E/G/S) | 50-00 |
| 48. | On Healing (E/G/S) | 100-00 |
| 49. | On Love (E/G/S) | 50-00 |
| 50. | On Service (E/G/S) | 50-00 |
| 51. | On Silence (E/G/S) | 50-00 |
| 52. | Pranayamam (T) | 10-00 |
| 53. | Prayers (E/G/S) | 100-00 |
| 54. | Rudra (E/G/S) | 30-00 |
| 55. | Sankhya - The Sacred Doctrine (E/G/S) | 75-00 |
| 56. | Saraswathi - The Word (E/G/S) | 60-00 |
| 57. | Saturn-The Path of Systematised Growth (E/G/S) | 40-00 |
| 58. | Shodasopachara Pooja - Avagahana (T) | 10-00 |
| 59. | Sound-The Key and its Application (E/G/S) | 40-00 |
| 60. | Spiritualism - Business and Management (E/G/S) | 25-00 |
| 61. | Sri Dattatreya (E/G/S/T/Hi) | 33-00 |
| 62. | Sri Gurupaduka Sthavam (T) | 30-00 |
| 63. | Sri Krishna Namamrutham (T) | 25-00 |
| 64. | Sri Lalitha-1 (T) | 40-00 |
| 65. | Sri Lalitha-2 (T) | 40-00 |
| 66. | Sri Lalitha-3 (T) | 40-00 |
| 67. | Sri Lalitha-4 (T) | 40-00 |
| 68. | Sri Lalitha-5 (T) | 40-00 |

| | | |
|---|---|---|
| 69. | Sri Lalitha-6 (T) | 40-00 |
| 70. | Sri Lalitha-7 (T) | 40-00 |
| 71. | Sri Sastri Garu (E/G/S/F/T/H) | 40-00 |
| 72. | Sri Shiridi Sai Sayings (E/G/S/T/Hi) | 80-00 |
| 73. | Steps on Silence (E) | 75-00 |
| 74. | Suvarna Sopanamulu | |
| 75. | The Aquarian Cross (E/G/S) | 100-00 |
| 76. | The Aquarian Master (E/G/S) | 75-00 |
| 77. | The Doctorine of Ethics (E) | 35-00 |
| 78. | The Etheric Body (E/G/S) | |
| 79. | The Path of Synthesis (E) | 40-00 |
| 80. | The Splendor of Seven Hills (E/T/Hi) | 15-00 |
| 81. | The Teachigs of Lord Sanatkumara | 150-00 |
| 82. | The Theosophical Movement (E/G/S) | 60-00 |
| 83. | The White Lotus (E/G/S) | 20-00 |
| 84. | Time - The Key (E/G/S) | |
| 85. | Uranus - The Alchemist of the Age | 150-00 |
| 86. | Venus - The Path of Immortality (E/G/S) | 80-00 |
| 87. | Violet Flame Invocation (E/G) | 60-00 |
| 88. | Vrutrasura Rahasyam (T) | 35-00 |
| 89. | Varunagraha Prabhavamu (T) | 22-00 |
| 90. | Wisdom Buds (E/S) | 20-00 |
| 91. | Wisdom Teachings of Vidura (E/G/S) | 80-00 |
| 92. | Moon & Spiritual Astrology (S) | |
| 93. | The Death & Reincarnation (S) | |
| 94. | Commentary on Om Namonarayanaya (S) | |
| 95. | Master Jesus, Life and Teachings (S) | |
| 96. | The Science of Ayurveda & Homoeopathy (S) | |
| 97. | The Teachings of Master D.K. (S) | |
| 98. | The Human Constitution (S) | |
| 99. | The Masters of Wisdom (S) | |
| 100. | The Path of Meditation (S) | |
| 101. | Stories for Disciples (S) | |
| 102. | Spirituality in Daily Life (S) | |
| 103. | Special Practices for Disciples (S) | |
| 104. | Fundamentals of Health & Healing (S) | |
| 105. | Ganesha, The Cosmic Lord of Groupings (S) | |
| 106. | Astrology and Healing (S) | |